
పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, కీళ్లనొప్పులు, చర్మవ్యాధులతోపాటు అన్ని రకాల నొప్పులకు వనమూలికలతో వైద్యం చేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరాలయము
నారాయణపేట రోడ్డు, ఊట్కూర్ మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895



# వార్తా తరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar | సంపుటి :26 | సంచిక :94 | సంపాదకులు: కోటకొండ ఎల్ల విజయరాజు | శుక్రవారం 14 ఆగస్టు 2026 | పేజీలు :12 | వెల రూ5 /-


## లోకసభ నిరవధిక వాయిదా...!



**న్యూఢిల్లీ ఆగస్టు 13:**పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో గందరగోళం నెలకొనడంతో, లోక్‌సభను నిరవధికంగా వాయిదా వేశారు. షెడ్యూల్ ప్రకారం ఈరోజు సమావేశాలకు చివరి రోజు. అయితే, సాధారణంగా సాయంత్రం వరకు కార్యకలాపాలు కొనసాగుతాయి, కానీ ఉదయం 11 గంటలకే సభను వాయిదా వేశారు. చివరి రోజున ప్రధాని మోదీ, అమిత్ షా కూడా సభకు హాజరయ్యారు. జూలై 20 తర్వాత అమిత్ షా సభలో కనిపించడం ఇదే మొదటిసారి. ఈరోజు లోక్‌సభ కార్యకలాపాలు ప్రారంభం కాగానే ప్రతిపక్షాలు గందరగోళం సృష్టించాయి, కానీ ఆ తర్వాత వందేమాతరం గీతం ఆలపించడంతో కాసేపు నిశ్శబ్దం నెలకొంది. అనంతరం సభను వెంటనే వాయిదా వేశారు.

**టీ కార్యక్రమానికి దూరంగా కాంగ్రెస్**

ప్రతిపక్ష పార్టీల అసంతృప్తి ఎంతగా వ్యక్తమైందంటే, కాంగ్రెస్, ఇతర ఇండీ కూటమి పార్టీలు పార్లమెంట్ భవనంలో స్పీకర్ ఏర్పాటు చేసిన టీ పార్టీకి హాజరు కాలేదు. సభా కార్యకలాపాలు వాయిదా పడిన తర్వాత ఇలా టీ పార్టీ ఏర్పాటు చేయడం ఒక సంప్రదాయంగా వస్తోంది. గందరగోళంతో సమావేశం దాదాపుగా స్తంభించిపోయింది. ఢిల్లీ లాఠీచార్జిపై అమిత్ షా ప్రకటన చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. రామ మందిరంపై - మిగతా3లో

## స్టే ఉన్నా భవనాలు కూల్చేస్తారా



**హైదరాబాద్ ఆగస్టు 13:**కోర్టు స్టే ఉత్తర్వులు అమలులో ఉన్నప్పటికీ ప్రైవేటు ఆస్తులను కూల్చివేయడంపై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంలో హైదరాబాద్ డిజాస్టర్ అండ్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కమిషనర్ ఏవీ రంగనాథ్‌పై ధిక్కరణ చర్యలను సుమోటోగా స్వీకరించింది. ఆయనకు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేస్తూ, రెండు వారాల్లోగా వివరణ ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించింది. మేడ్చల్ జిల్లా, మల్కాజిగిరి మండలంలోని వాణి కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ పరిధిలో (సర్వే నెం. 194/1, 211) కోర్టు స్టే ఉన్నప్పటికీ కూల్చివేతలు చేపట్టారన్న ఆరోపణలపై జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా కలెక్టర్, మల్కాజిగిరి, తిరుమలగిరి తహసీల్దార్లు వ్యక్తిగతంగా కోర్టుకు హాజరయ్యారు. ఈ కూల్చివేతలకు రెవెన్యూ శాఖ ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని, తమ అనుమతి లేకుండానే మేడ్చల్ జిల్లాలో హైడ్రా దాదాపు 40 కూల్చివేతలు చేపట్టిందని కలెక్టర్ న్యాయస్థానానికి నివేదించారు. దీనిపై హైడ్రా తరఫు న్యాయవాది స్పందిస్తూ, రెవెన్యూ శాఖ - మిగతా3లో

## మైనారిటీ రిజర్వేషన్లకు మోదీ, అమిత్ షా వ్యతిరేకం

**సీఎం రేవంత్ రెడ్డి..**



**హైదరాబాద్:** ముస్లిం మైనారిటీ రిజర్వేషన్లు అడ్డుకునేందుకు కొన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ముస్లింలకు కాంగ్రెస్ 4 శాతం రిజర్వేషన్లు కల్పించిందని, వీటిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. రిజర్వేషన్ల రద్దు కోసం అత్యున్నత న్యాయస్థానాల వరకూ వెళ్లారని ముఖ్యమంత్రి విమర్శించారు. అయినా చిత్తశుద్ధితో కాంగ్రెస్ అమలు చేసిందన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మైనారిటీల ప్రతిభా సదస్సుకు సీఎం రేవంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో ప్రతిభ కనబరిచిన పలువురు మైనారిటీలకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మైనారిటీ రిజర్వేషన్లకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యతిరేకమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ నేతృత్వంలోనే మైనారిటీలకు సంక్షేమం అందుతోందని చెప్పారు. కాంగ్రెస్ అంటేనే సెక్యులర్ పార్టీ అని, హిందూ, ముస్లింలను రెండుకళ్లలా చూస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపైనా ముఖ్యమంత్రి విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వం గ్రూప్-1 పరీక్షలను నిర్వహించలేకపోయిందని - మిగతా3లో

## రాయదుర్గం భూముల వేలం ఆపండి



**హైదరాబాద్ ఆగస్టు 13:**హైదరాబాద్ ఐటీ కారిడార్‌లోని అత్యంత విలువైన రాయదుర్గంలో 10.63 ఎకరాల వారసత్వ భూమి వేలాన్ని తక్షణమే నిలిపివేయాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి టి. హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నేడు ఓ లేఖ రాశారు. ఆగస్టు 17, 21 తేదీల్లో తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ) నిర్వహించ తలపెట్టిన వేలాన్ని తీవ్రంగా ఖండించారు. గతంలో ప్రభుత్వ భూములను పూర్వీకులు అందించిన జాతీయ సంపదగా అభివర్ణిస్తూ ఉద్వేగభరిత ప్రసంగాలు చేసిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు ముఖ్యమంత్రి అయ్యాక అవే భూములను అమ్మకానికి పెట్టారంటూ హరీశ్ రావు వ్యాఖ్యానించారు. గచ్చిబౌలి, లగచర్ల, - మిగతా3లో

## దేశ రాజధానిలో ఆగస్టు 15 వేడుకలకు సర్వం సిద్ధం..



**ఢిల్లీ:** దేశ రాజధానిలోని చారిత్రక ఎర్రకోటపై 80వ స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధమైంది. ఆగస్టు 15న ఎర్రకోటపై జాతీయ పతాకాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ఎగురవేయనున్నారు. ఈ ఏడాది 'వందేమాతరం 150 ఏళ్ల వేడుకలు, వికసిత్ భారత్‌ఏ2047 కోసం యువశక్తి' థీమ్‌లతో ఎర్రకోట ముస్తాబైంది. చరిత్రలో తొలిసారిగా ఎర్రకోట స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో 'వందేమాతరం' గీతాన్ని ఆలపించనున్నారు. అలాగే జాతీయ పతాకావిష్కరణ వేళ వాయుసేనకు చెందిన Mi-17 హెలికాప్టర్ల ద్వారా పూలవర్షం కురిపించనున్నారు. జ్ఞానపథ్‌లో వందేమాతరం ఆకృతిలో 2,500 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు, 'మై భారత్' వాలంటీర్లు కూర్చోనున్నారు. వేడుకలను ప్రత్యక్షంగా వీక్షించేందుకు వివిధ రంగాలకు చెందిన దాదాపు 5 వేల మందికి అధికారులు ప్రత్యేక ఆహ్వానం పంపారు. వీఐపీ సంస్కృతికి స్వస్తి పలుకుతూ, భారతదేశంలోని ప్రముఖ సరస్సుల పేర్లతో సీటింగ్ ఎన్‌క్లోజర్లు ఏర్పాటు చేశారు. మరోవైపు, పర్యాటకుల సౌకర్యార్థం ఉచిత మెట్రో ప్రయాణం, క్యూఆర్ కోడ్ ఈ-ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు. వేడుకలు ముగిసిన వెంటనే ఎర్రకోట పరిసరాల్లో చెత్త తొలగింపు కోసం 'స్వచ్ఛత ప్రచారం' కార్యక్రమాన్ని చేపట్టనున్నారు.

## రాజ్యసభలో రచ్చ...రచ్చ...



**న్యూఢిల్లీ, ఆగస్టు 13:**కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభ నిర్వహించిన ప్రదేశంలో 'శుద్ధీకరణ' పేరుతో హోమం చేయడం రాజకీయ దుమారం రేపింది. ఈ అంశం గురువారం రాజ్యసభను కుదిపేసింది. ఖర్గే తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయగా.. కేంద్ర మంత్రి జేపీ నడ్డా స్పందించారు. ఈ ఘటన దురదృష్టకరమని పేర్కొన్నారు. బీజేపీ ఇలాంటి చర్యలను సమర్థించదని స్పష్టం చేశారు. ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ రామ్‌లీలా మైదానంలో ఆగస్టు 8న ఖర్గే 'విజయ శంఖనాద' సభ నిర్వహించారు. రెండు రోజుల తర్వాత శ్రీరామ్ సేనకు చెందిన కార్యకర్తలు అక్కడ హోమం చేసి వేదికను 'శుద్ధి' చేసినట్లు వార్తలు వచ్చాయి. దీంతో కాంగ్రెస్ తీవ్రంగా మండిపడింది. రాజ్యసభలో ఖర్గే మాట్లాడుతూ.. తన సభకు లక్షలాది మంది హాజరయ్యారని చెప్పారు. తాను ఏ మతం లేదా వర్గం గురించి మాట్లాడలేదన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపైనే మాట్లాడానని తెలిపారు. అయినా తన ప్రసంగం తర్వాత వేదికకు శుద్ధి చేయడం ఏంటని ప్రశ్నించారు. ఇది ప్రజాస్వామ్య పద్ధతేనా? రాజ్యాంగాన్ని ఎలా కాపాడుతున్నారని నిలదీశారు. ఈ ఘటనను ఖండించిన రాజ్యసభ ఛైర్మన్.. అంటరానితనం కంటే పెద్ద పాపం మరొకటి లేదని వ్యాఖ్యానించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఖర్గే దళితుడు కావడంతోనే శుద్ధి చేశారని ఉత్తరాఖండ్ కాంగ్రెస్ అధ్యక్షుడు గణేశ్ గోదియాల్ ఆరోపించారు. దీనికి బీజేపీ రాష్ట్ర నేత ఖజన్ దాస్ స్పందించారు. ఖర్గే సభలో చేసిన కొన్ని నినాదాలు సనాతన వర్గాల మనోభావాలను దెబ్బతీశాయని చెప్పారు. రామ్‌లీలా మైదానం మతపరమైన ప్రాధాన్యం ఉన్న ప్రాంతమని తెలిపారు. శుద్ధి కార్యక్రమంతో బీజేపీకి సంబంధం లేదని నడ్డా స్పష్టం చేశారు. ఘటనపై విచారణ జరుపుతామని హామీ ఇచ్చారు.

## బీసీ మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు

**మంత్రి పొన్నం ప్రభాకర్**





**హైదరాబాద్:**బీసీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, కుట్టు వృత్తి ద్వారా స్వయం ఉపాధి పొందేలా ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు' పథకాన్ని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా పాలన ప్రభుత్వంలో బీసీ మహిళల స్వయం ఉపాధి, ఆర్థిక సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. బీసీ మహిళలకు 100 శాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టు మిషన్లు అందించి, వారిని కేవలం ప్రభుత్వ పథకాల లబ్ధిదారులుగా కాకుండా స్వయం ఉపాధి పొందే మహిళా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

**1.19 లక్షల మహిళలకు ప్రయోజనం:**

రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 1,19,000 ఆటోమేటిక్ కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఒక్కో కుట్టు మిషన్ విలువ రూ.12,000 కాగా, లబ్ధిదారులపై ఎలాంటి ఆర్థిక భారం - మిగతా3లో

## మేడిగడ్డ బ్యారేజీ కేసు..మాజీ సీఎం కేసీఆర్‌కు మళ్లీ నోటీసులు...



**హైదరాబాద్:**కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుకు సంబంధించిన కేసులో మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టు మరోసారి నోటీసులు జారీ చేసింది. గతంలో పంపిన నోటీసులు ఆయనకు అందలేదని తేలడంతో మళ్లీ నోటీసులు జారీ చేయాలని కోర్టు ఆదేశించింది. నోటీసులు పక్కాగా అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయవాదిని ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణను సెప్టెంబర్ 9కి వాయిదా వేసింది. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంలో అక్రమాలు, నాణ్యతా లోపాలపై దాఖలైన ప్రైవేట్ పిటిషన్‌పై విచారణ కొనసాగుతోంది.

# సంపాదకీయం

## వాయిదాల లోక్‌సభ ఎవరికి ఉపయోగం?

ప్రజా సమస్యలపై చర్చలు జరపాల్సిన లోక్‌సభ డెడ్‌లాక్ నిరంతరం కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వ విధానాలు లేదా ఏవైనా వివాదాస్పద అంశాలపై చర్చ జరగాలని విపక్షాలు పట్టుబట్టడం సహజమే అయినప్పటికీ, ప్రభుత్వం ఒక నిర్దిష్ట అంశంపై చర్చకు సిద్ధమని ప్రకటించినా , స్పీకర్ సమయం కేటాయించినా.. మరో అంశాన్ని ముందుకు తెస్తూ సభను స్తంభింపజేయడం ప్రజాస్వామ్య వ్యవస్థలకే సవాలుగా మారుతోంది.పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో ప్రతిపక్షాలు వివిధ అంశాలపై చర్చలతో పాటు మంత్రుల ప్రకటనలు, రాజీనామాలను డిమాండ్ చేస్తూ నిరసనలకు దిగడం వల్ల ప్రశ్నోత్తరాల సమయం, జీరో అవర్ దాదాపుగా కొట్టుకుపోయాయి. ప్రభుత్వం కొన్ని కీలక బిల్లులపై చర్చకు సిద్ధపడినా, ఇతర ప్రాధాన్యతలపై విపక్షాల సభా దిగ్బంధం వల్ల అనేక బిల్లులు చర్చలు లేకుండానే ఆమోదం పొందాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పార్లమెంట్ కార్యకలాపాలు సాఫీగా సాగడానికి ప్రజల సొమ్ము కోట్లాది రూపాయలు వెచ్చిస్తుంటే, రోజూ సభ వాయిదాలు పడటంతో ప్రజ సమస్యలు పక్కనపడిపోతున్నాయనే విమర్శలు జాతీయ మీడియాలో ప్రధానంగా వస్తున్నాయి.ఈ తరహా సభా దిగ్బంధం వెనుక రాజకీయ ప్రయోజనాలు ఉన్నప్పటికీ, అసలేమీ చర్చ జరగకుండా సభ వాయిదా పడటం కంటే.. ఏ ఒక్క అంశం పైనైనా సభలో ఫలవంతమైన చర్చ జరగడం ప్రజాస్వామ్యానికి ఎంతో శ్రేయస్కరం. నీట్ అక్రమాలపై ఢిల్లీలో నిరసనలకు దిగిన విద్యార్థులపై పోలీసుల దాడులపై ఇప్పటివరకూ పార్లమెంట్ కు వచ్చి సమాధానం చెప్పకుండా తప్పించుకుంటున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా ముప్పేట దాడి నేపథ్యంలో వెనక్కి తగ్గారు. అమిత్ షాను ఎలాగైనా పార్లమెంట్ కు రప్పించాలని విపక్షాలు పార్లమెంట్ ఉభయసభల్ని స్తంభింపచేస్తున్న వేళ.. ఎట్టకేలకు అమిత్ షా తన నిర్ణయం మార్చుకున్నారు. పార్లమెంట్ కు హాజరై ఢిల్లీ పోలీసుల దాడులపై సమాధానం ఇవ్వాలని నిర్ణయించారు. నీట్ అక్రమాల నేపథ్యంలో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ గత నెలలో విద్యార్థులు కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో పార్లమెంట్ మార్చ్ కు బయలుదేరారు. వీరిని అడ్డుకునేందుకు ఢిల్లీ పోలీసులు లాఠీఛార్జ్, బాష్పవాయువు ప్రయోగాలతో పాటు పెల్లెట్ గన్ లను కూడా ప్రయోగించారు. అలాగే మేకులు కొట్టిన లాఠీలతో బాదడం, ఎలక్ట్రిక్ బేటన్లతో కొట్టడం చేశారు. దీంతో భారీ సంఖ్యలో విద్యార్థులు గాయాలపాలయ్యారు. వీరిని వివిధ ఆస్పత్రుల్లో కేంద్రమంత్రులు పరామర్శించారు. అప్పటి నుంచీ ఈ దారుణాలపై హోంమంత్రి అమిత్ షా సమాధానం కోసం విపక్షాలు పట్టుబడుతున్నా కేంద్రం ఒప్పుకోవడం లేదు ఈ నేపథ్యంలో విపక్షాలు నిత్యం ఉభయసభల్ని స్తంభింపచేస్తున్నా అమిత్ షా మాత్రం సభకు రావడం లేదు. దీంతో ఓ దశలో రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ కూడా విపక్షాల డిమాండ్ ప్రకారం అమిత్ షాను సభకు రప్పించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజుకు సూచించారు. దీంతో పరీక్షల అవకతవకలకు వ్యతిరేకంగా జరిగిన నిరసనల సందర్భంగా ఢిల్లీలో పెల్లెట్ గన్‌లు, బీహార్‌లో ఏకే-47లను ఉపయోగించడంపై హోం మంత్రి అమిత్ షా పార్లమెంటులో హాజరై వివరణ ఇవ్వాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌కు అంగీకరిస్తున్నట్లు, పోలీసుల చర్యతో సహా విద్యార్థుల నిరసనలకు సంబంధించిన ప్రతి అంశంపై పార్లమెంటులో చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. అయితే సభా కార్యకలాపాల సమయంలో ప్రతిపక్షాలు హంగామా సృష్టించకూడదని మంత్రి షరతు పెట్టారు.పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం ప్రతిపక్షాల హక్కు అయినప్పటికీ, అది ప్రజా ప్రయోజనాలకు విఘాతం కలగకుండా సభ సజావుగా సాగేందుకు తోడ్పడేలా ఉండాలన్నది రాజ్యాంగ నిపుణుల భావన. చర్చల ద్వారా మాత్రమే విధాన నిర్ణయాల్లో లోపాలను సరిదిద్దడం, ప్రభుత్వ జవాబుదారీతనాన్ని నిర్ధారించడం సాధ్యమవుతుంది. రామమందిర విరాళాలపై అమిత్ షా చేసిన ప్రకటనపై ప్రతిపక్ష కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంట్‌లో మంగళవారం కూడా నిరసన చేపట్టారు. మాకు అడ్డంకులు సృష్టిస్తారా అంటూ పాలక పక్ష ఎన్‌డీఏ ఎంపీలు పోటీగా నిరసన చేపట్టారు. పార్లమెంట్ ప్రధాన ద్వారాల్లోని ఒకటైన మకర ద్వారం వద్ద ప్రతిపక్ష, పాలక పక్ష ఎంపీలు పోటాపోటీగా నినాదాలు చేశారు.ఢిల్లీలో విద్యార్థి నిరసనకారులపై పోలీసుల అణచివేత, రామ మందిరం విరాళాల దుర్వినియోగంపై హోం మంత్రి అమిత్ షా పార్లమెంటుకు వచ్చి చర్చించాలని ప్రతిపక్ష ఎంపీలు పట్టుబట్టారు. కాంగ్రెస్ నేతృత్వంలోని జార్ఖండ్‌లో నిరసనలు చేపట్టిన విద్యార్థులపై హేమంత్ సొరేన్ ప్రభుత్వం లాఠీచార్జ్ జరిపించిందని, దీనిపై చర్చించడానికి రాహుల్‌గాంధీ పారిపోతున్నారని, డబుల్ గేమ్ ఆడుతున్నారని ఆరోపిస్తూ పాలక పక్ష ఎంపీలు ఎదురు నిరసనలు చేపట్టారు.పార్లమెంటు ను ఉద్దేశించి ప్రసంగించడానికి, ప్రతిపక్షాల ప్రశ్నలకు బదులివ్వడానికి అమిత్ షా సిద్ధంగా ఉన్నారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు చెప్పారు. అయినా ప్రతిపక్ష ఎంపీలు తమ నిరసన కొసాగించారు. రామ మందింలో విరాళాల దుర్వినియోగంపై ప్రతిపక్ష ఎంపీలు ఒక స్కిట్ ఈ నిరనసలో ప్రదర్శించారు.పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి , స్పీకర్ నేతృత్వంలో విపక్ష నేతలతో చర్చలు జరిపి సభా స్థంభనను తొలగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ.. ఉభయ పక్షాల మధ్య సమ్మతి కొరవడటంతో గందరగోళం కొనసాగుతోంది. ఏదేమైనా, విపక్షాలు వాకౌట్‌లు లేదా ఆందోళనలతో సమయాన్ని వృథా చేయకుండా, దొరికిన అవకాశాన్ని ఉపయోగించుకుని ప్రభుత్వం ఇచ్చే చర్చల్లో పాల్గొనడమే ప్రజాస్వామ్య బలాన్ని పెంచుతుంది.ఢిల్లీ ఘటనపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సమాధానం చెప్పి తీరాల్సిందేనని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. విద్యార్థులపై దాడి ఘటనపై ప్రకటన ఇవ్వడానికి ఆయన పార్లమెంట్‌కు రావాల్సిందేనని పట్టుబట్టారు. పోలీసుల దాడిలో యువతులు, మైనర్లు గాయపడ్డారని అన్నారు. కాల్పులపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరగాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు.

# మోడీ బహుమతుల వేలంతో 52 కోట్లకు పైగా నిధులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 13:**భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వివిధ సందర్భాల్లో అందే కానుకలు, స్మృతిచిహ్నాలు ఇప్పుడు ఆసక్తికరమైన అంశంగా మారాయి. ప్రధాని అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్నప్పుడు, వివిధ సంస్థలు, ప్రముఖులు, రాజకీయ నాయకులు, క్రీడాకారులు, ఇతర ప్రతినిధులు ఆయనకు అనేక రకాల బహుమతులు, మెమెంటోలు అందజేస్తుంటారు. వీటిని కేంద్ర ప్రభుత్వం క్రమం తప్పకుండా ఇ-వేలం నిర్వహించి విక్రయిస్తోంది. ఈ వేలాల ద్వారా ఇప్పటివరకు రూ.52 కోట్లకు పైగా ఆదాయం సమకూరినట్లు కేంద్రం వెల్లడించింది.కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షేఖావత్ లోక్‌సభలో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో ప్రధాని కానుకల వేలం ద్వారా వచ్చిన ఆదాయానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడర్న్ ఆర్ట్ ఆధ్వర్యంలో ఈ వేలం ప్రక్రియ కొనసాగుతోంది.

2021 తొలి ఎడిషన్: రూ.3.1 కోట్లు
2022 రెండో ఎడిషన్: రూ.3.6 కోట్లు
2023 మూడో ఎడిషన్: రూ.15.8 కోట్లు
2023 నాలుగో ఎడిషన్: రూ.14.4 కోట్లు
2024 ఐదో ఎడిషన్: రూ.11.16 కోట్లు
2024 ఆరో ఎడిషన్: రూ.2.24 కోట్లు
2025 ఏడో ఎడిషన్: రూ.1.89 కోట్లు

ఈ మొత్తం కలిపితే రూ.52 కోట్లకు పైగా నిధులు సమకూరినట్లు కేంద్రం తెలిపింది. సాధారణంగా ప్రధాని మోదీ జన్మదినమైన సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 31 వరకు ఈ-వేలం నిర్వహిస్తున్నట్లు కేంద్ర మంత్రి వివరించారు. 2019కు ముందు ప్రధానికి వచ్చిన ఇలాంటి కానుకలు,



స్మృతిచిహ్నాలను ఆధ్వర్యంలో ఈ తరహాలో వేలం వేసే విధానం లేదని కేంద్ర మంత్రి షెకావత్ పేర్కొన్నారు.ప్రధాని మోదీకి అందిన కానుకల్లో దేశంలోని వివిధ ప్రాంతాల సంస్కృతి, కళా సంపదకు ప్రతీకలైన వస్తువులు ఉంటాయి. పెయింటింగ్స్, శిల్పాలు, హస్తకళా వస్తువులు, మతపరమైన విగ్రహాలు, చేనేత వస్త్రాలు, క్రీడా స్మృతిచిహ్నాలు వంటి అనేక రకాల వస్తువులు వేలానికి వస్తాయి. వాటిలో కొన్ని వస్తువులు భారీ ధరలు పలికాయి. గాజు ఫ్రేమ్‌లో మినియేచర్ ఆలయ నిర్మాణంతో ఉన్న తుల్జా భవానీ విగ్రహం సుమారు రూ.1.03 కోట్ల వరకు ధర పలికినట్లు సమాచారం.అయోధ్య రామమందిర మెటాలిక్ మోడల్, జమ్మూకశ్మీర్ పష్మినా షాల్, తంజావూరు రామ దర్బార్ చిత్రం, నటరాజ మెటాలిక్ విగ్రహం, గుజరాత్ రోగన్ ఆర్ట్ 'ట్రీ ఆఫ్ లైఫ్', నాగాలాండ్ చేనేత షాల్, వివిధ వస్త్రాలు, పెయింటింగ్స్ కూడా వేలంలో ఆకర్షణగా నిలిచాయి. క్రీడలకు సంబంధించిన వస్తువులు కూడా వేలంలో ప్రత్యేక ఆసక్తిని కలిగించాయి. 2024 పారాలింపిక్స్ క్రీడాకారుల బూట్లు, ఒలింపిక్, పారాలింపిక్ క్రీడా సామగ్రితో పాటు స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాకు సంబంధించిన జావెలిన్, రామమందిరం, కాశీ విశ్వనాథ ఆలయ నమూనాలు వంటి వస్తువులు కూడా వేలంలోకి వచ్చాయి.ప్రధాని మోదీకి వచ్చిన కానుకలను వేలం వేసి వచ్చిన ఆదాయాన్ని నమామి గంగే కార్యక్రమానికి కేటాయిస్తున్నట్లు కేంద్రం తెలిపింది. గంగా నది పరిరక్షణ, పునరుద్ధరణ, కాలుష్య నివారణ వంటి కార్యక్రమాలకు ఈ నిధులను ఉపయోగిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమమైన నమామి గంగే కింద గంగా, దాని ఉపనదుల్లో కాలుష్యాన్ని తగ్గించడం, నదీ పునరుజ్జీవనం, పర్యావరణ వ్యవస్థను పరిరక్షించడం వంటి చర్యలు చేపడుతున్నారు. మురుగునీటి శుద్ధి మౌలిక సదుపాయాలు, రివర్‌ఫ్రంట్ అభివృద్ధి, జీవవైవిధ్య పరిరక్షణ తదితర ప్రాజెక్టులు ఇందులో భాగంగా ఉన్నాయి. ఈ కార్యక్రమాన్ని నేషనల్ మిషన్ ఫర్ క్లీన్ గంగా) అమలు చేస్తోంది.ప్రధాని మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కూడా తనకు వచ్చిన కానుకలను వేలం వేసి వచ్చిన మొత్తాన్ని బాలికల విద్య కోసం వినియోగించేవారని కేంద్రం వెల్లడించింది. ఇప్పుడు అదే విధానాన్ని జాతీయ స్థాయిలో కొనసాగిస్తూ.. వేలం ద్వారా వచ్చే ఆదాయాన్ని గంగా నది పరిరక్షణకు కేటాయిస్తున్నట్లు తెలిపింది. అంటే.. ప్రముఖులు, సంస్థలు ప్రధానమంత్రికి అందించిన కానుకలు వ్యక్తిగతంగా భద్రపరచడం కాకుండా.. వాటిని ప్రజా ప్రయోజనానికి ఉపయోగపడేలా వేలం వేస్తున్నారు. వేలం ద్వారా వచ్చిన నిధులు దేశంలోని కీలక పర్యావరణ కార్యక్రమానికి మళ్లించడం ఈ ప్రక్రియలో ప్రధాన అంశంగా నిలుస్తోంది.

# డీలిమిటేషన్ కు తమిళనాడు క్లియర్

**చెన్నై, ఆగస్టు 13:**కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియపై తమిళనాడు శాసనసభ అత్యంత ప్రాధాన్యత కలిగిన తీర్మానాన్ని ఆమోదించింది. జనాభా ప్రాతిపదికన మాత్రమే స్థానాల సంఖ్యను పెంచితే దక్షిణ భారత రాష్ట్రాల ప్రాతినిధ్యం తీవ్రంగా దెబ్బతింటుందనే ఆందోళనలు ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం మూడు స్పష్టమైన డిమాండ్లను సభ ముందుకు తెచ్చి ఏకగ్రీవంగా ఆమోదింపజేసింది.తీర్మానంలో పొందుపరిచిన ప్రధాన ప్రతిపాదనల ప్రకారం--- ప్రస్తుతం అమల్లో ఉన్న 1971 జనాభా ప్రాతిపదికన లోక్‌సభ స్థానాల కేటాయింపు నిష్పత్తిని యథాతథంగా కొనసాగించాలి. ఒకవేళ అనివార్య కారణాల వల్ల స్థానాల సంఖ్యను పెంచాల్సి వస్తే, ఆ పెంపును కూడా 1971 నాటి జనాభా నిష్పత్తి ప్రకారమే చేపట్టాలి. జనాభా నియంత్రణ , సామాజిక-ఆర్థిక అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా అమలు చేసినందుకు తమిళనాడుతో పాటు ఇతర దక్షిణ భారత రాష్ట్రాలను శిక్షించేలా పార్లమెంటరీ స్థానాల సంఖ్యను తగ్గించకూడదనేది మరో కీలక డిమాండ్.అంటే, మూడింటిలో ఏ డిమాండ్ చూసినా.. పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాల ప్రస్తుత ప్రాతినిధ్య శాతాన్ని భవిష్యత్తు పునర్విభజనలోనూ ఖచ్చితంగా కాపాడాలనేదే తమిళనాడు ప్రభుత్వ స్పష్టమైన వైఖరి. ప్రస్తుతం ఉన్న స్థానాల నిష్పత్తిని యథాతథంగా కొనసాగించడం లేదా లోక్‌సభ స్థానాలు పెరిగినా.. ఇప్పుడు పార్లమెంట్‌లో ఆయా రాష్ట్రాలకు ఎంత శాతంలో ప్రాతినిధ్యం ఉందో అదే శాతాన్ని కొనసాగించేలా పెంపు నిర్ణయించాలని స్పష్టం చేస్తోంది.కేంద్ర ప్రభుత్వం కూడా భవిష్యత్తులో స్థానాల పెంపు ఏ విధంగా ఉన్నప్పటికీ దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గకుండా సమతుల్యత పాటిస్తామని చెబుతోంది. అందుకే ఈ తీర్మానం ప్రాధాన్యత సంతరించుకుంది. రాబోయే డెలిమిటేషన్ ప్రక్రియలో జనాభా నియంత్రణ సాధించిన



రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా రాజ్యాంగబద్ధమైన హామీలు, రక్షణలు కల్పించాలని తమిళనాడు అసెంబ్లీ ద్వారా కేంద్రానికి గట్టి సందేశం పంపారు

# హీరోగా హిమాన్షు..

**హైదరాబాద్, ఆగస్టు 13:**స్టార్ హీరోలకు సంబంధించిన వారసులు సినీ ఇండస్ట్రీ లోకి హీరో గా ఎంట్రీ ఇవ్వడం కొత్తేమి కాదు , గత దశాబ్దాలుగా అనాదిగా వస్తున్న ఆచారమే ఇది. అదే విధంగా ప్రముఖ రాజకీయ నాయకుల వారసులు కూడా రాజకీయాల్లోకి రావడం మాత్రమే ఇది వరకు మనమంతా చూసాము. సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చినట్టు ఎక్కడా హిస్టరీ లో లేదు. అయితే తొలిసారిగా రాజకీయాల్లో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్న ఒక ప్రముఖ రాజకీయ నాయకుడు కుమారుడు సినీ ఇండస్ట్రీ లోకి ఎంట్రీ ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు ఇండస్ట్రీ వర్గాల్లో బలంగా వినిపిస్తున్న వార్త. ఆ రాజకీయ నాయకుడు మరెవరో కాదు . అతని కుమారుడు హిమాన్షు రావు సినీ రంగం లోకి అడుగుపెట్టేందుకు అమితాసక్తి ని చూపిస్తున్నట్టు సమాచారం.హిమాన్షు రావు ఇప్పటికే సంగీతం లో తన ప్రతిభ ని చాటుకున్నాడు. ఇతన్ని సోషల్ మీడియా లో అనుసరించే వాళ్లకు ఈ విషయం ఈపాటికే తెలిసే ఉంటుంది. అయితే సినీ రంగం లోకి



మాత్రం ఆయన హీరో గానే ఎంట్రీ ఇవ్వాలని చూస్తున్నాడట. ఇప్పటికే ఆయన నటన లో కోచింగ్ కూడా తీసుకున్నట్టు సమాచారం. ఒక ప్రముఖ నిర్మాత హిమాన్షు ని గ్రాండ్ గా లాంచ్ చేసేందుకు సన్నాహాలు కూడా జరుగుతున్నాయట. టాలీవుడ్ లో వరుస బ్లాక్ బస్టర్స్ ని అందుకుంటున్న ఒక డైరెక్టర్ , రీసెంట్ గానే కేటీఆర్ ని కలిసి ఒక స్టోరీ ని కూడా వినిపించినట్టు టాక్. ఆ డైరెక్టర్ మరెవరో కాదు , అనిల్ రావిపూడి అని ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తున్న గుసగుసలు. దీనిపై ఎలాంటి అధికారిక సమాచారం లేదు కానీ , హిమాన్షు సినీ రంగ ప్రవేశానికి మాత్రం పెద్ద ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్న విషయం వాస్తవం.ఇదంతా పక్కన పెడితే హిమాన్షు ఈ పోటీ వాతావరణాన్ని తట్టుకొని సినీ ఇండస్ట్రీ లో రాణించగలడా?, కేసీఆర్ కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులు ఉన్నారు. వీళ్ళు ఈ కుటుంబాన్ని దేవుడిలాగా పూజిస్తుంటారు. కచ్చితంగా హిమాన్షు నటించే మొదటి సినిమాకు అద్భుతమైన ఓపెనింగ్స్ ని వీళ్ళు అందిస్తారు. కానీ ఆ తర్వాత ఆయన దాన్ని నిలబెట్టుకొని ఇండస్ట్రీ లో ఎలాంటి కథలను ఎంచుకుంటూ ముందుకు వెళ్తాడు అనేదే చూడాలి.

# మారనున్న కేబీఆర్ పార్కు రూపు రేఖలు

**హైదరాబాద్, ఆగస్టు 13:**హైదరాబాద్ ప్రజలకు మరో సూపర్ న్యూస్. నగరంలో ప్రముఖ పార్క్‌గా ప్రసిద్ధి పొందిన కేబీఆర్ పార్క్ వద్ద రూపురేఖలు పూర్తిగా మారనున్నాయి. ఈ పార్క్ వద్ద విపరీతమైన ట్రాఫిక్ రద్దీ ఉంటుంది. దీనిని తగ్గించేందుకు ప్రభుత్వం సరికొత్త ఆలోచన చేసింది. పార్క్ చుట్టూ ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌ల నిర్మాణానికి ముందడుగు వేసింది. మొత్తం 14 నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. ఏడు ప్రధాన కూడళ్ల వద్ద ఈ నిర్మాణాలు జరగనున్నాయి. మొన్నటివరకు కోర్టు కేసులు, భూసేకరణ ప్రక్రియ వల్ల కొంత జాప్యం జరగగా.. ఇప్పుడు అవన్నీ తొలగిపోయాయి. దీంతో అధికారులు ప్రక్రియను మరింత వేగవంతం చేశారు. రెండేళ్లల్లో పనులన్నీ పూర్తి చేయాలనే లక్ష్యం నిర్దేశించుకున్నారు. వాహనదారులకు ఇబ్బంది కలగకుండా పనులు త్వరతగతిన పూర్తి చేయాలని భావిస్తున్నారు.ఈ ప్రాజెక్టులో భాగంగా జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 36 నుంచి కేబీఆర్ పార్క్ రోడ్డు మధ్య నాలుగు లైన్ల ఫ్లైఓవర్ ఉంటుంది. ఇక పంజాగుట్ట నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ వైపుకు 3 లైన్ల ఫ్లైఓవర్ నిర్మిస్తారు. ఇక మహారాజా అగ్రసేన జంక్షన్ నుంచి బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 10 వైపు 2 లైన్ల ఫ్లైఓవర్ నిర్మించనున్నారు. ఇక ఫిల్మ్ నగర్-బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 మధ్య 2 లైన్లతో కూడిన ఫ్లైఓవర్ ప్రతిపాదించారు. అలాగే జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్-జూబ్లీహిల్స్



రోడ్ నెంబర్ 45 మధ్య 2 లైన్ల ఫ్లైఓవర్ ఉంటుంది. ఇక వీటితో పాటు మొత్తం 6 అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు. ఫిల్మ్ నగర్ జంక్షన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ వైపు 2 లైన్ల అండర్ పాస్, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి నుంచి ఫిల్మ్ నగర్ వైపు ఒక అండర్ పాస్, ఎల్వీ ప్రసాద్ నుంచి పంజాగుట్ట వైపు 3 లైన్ల అండర్ పాస్, రోడ్డు నెంబర్ 45 నుంచి కేబీఆర్ పార్క్ ఎంట్రన్స్ వరకు ఒక అండర్ పాస్ ఉంటుంది.దాదాపు ఈ ప్రాజెక్టులు పూర్తి చేయడానికి రూ.1090 కోట్లు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేశారు. వీటిల్లో నిర్మాణ పనుల కోసం రూ.699.75 కోట్లు ఖర్చు కానుండగా.. భూసేకరణ ప్రక్రియ కోసం రూ.390 కోట్లు ఖర్చు అవుతాయని అంచనా వేస్తున్నారు. ఉక్కు వంతెనల నిర్మాణం వల్ల భూసేకరణ ఖర్చు తగగ్గుతుందని, తక్కువ స్థలంలోనే పనులు చేపట్టవచ్చని అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే కేబీఆర్ పార్క్ వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ తగ్గుతుంది. సిగ్నల్ ఫ్రీ జర్నీ వాహనదారులకు లభించనుంది. హైటెక్ సిటీ, ఫిల్మ్ నగర్ వటైపు వెళ్లేవారు వేగవంతంగా చేసుకోవచ్చు.

# ఫిరాయింపు ఎమ్మెల్యేల రివర్స్ గేర్

## గులాబీ గూటివైపు చూపులు?

**హైదరాబాద్, ఆగస్టు 13:**బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన ఎమ్మెల్యేల వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. అధికార పార్టీలో చేరితే నియోజకవర్గాలకు భారీగా నిధులు వస్తాయని, పెండింగ్ సమస్యలు పరిష్కారమవుతాయని ఆశించిన పలువురు ఎమ్మెల్యేలకు అనుకున్న స్థాయిలో ఫలితం కనిపించకపోవడంతో అసంతృప్తి పెరుగుతున్నట్లు తెలుస్తోంది. దీంతో కొందరు ఎమ్మెల్యేలు తిరిగి బీఆర్ఎస్ వైపు అడుగులు వేయాలనే ఆలోచనలో ఉన్నారన్న ప్రచారం ఊపందుకుంది. ఈ క్రమంలో బాన్సువాడ ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. వీరి తర్వాత మరికొందరు కూడా ఇదే బాట పట్టే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో సంప్రదింపులు జరుగుతున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం ఉన్నా.. దీనిపై అధికారికంగా ఎలాంటి స్పష్టత రాలేదు.కామారెడ్డి జిల్లా బీర్కూరులో కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో పోచారం శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలు ఈ చర్చకు మరింత ఊతమిచ్చాయి. తాను మంత్రి పదవి కోసం, డబ్బు కోసం కాంగ్రెస్‌లో చేరలేదని, కేవలం నియోజకవర్గ అభివృద్ధి కోసమే పార్టీ మారానని ఆయన స్పష్టం చేశారు. అయితే తాను ఆశించిన స్థాయిలో పనులు జరగడం లేదన్న అసంతృప్తిని బహిరంగంగానే వ్యక్తం చేశారు.బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన సమయంలో బాన్సువాడ నియోజకవర్గంలోని పెండింగ్ సమస్యలను ఆరు నెలల్లో పరిష్కరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని పోచారం గుర్తు చేశారు. కానీ ఆ హామీలు పూర్తిగా అమలు కాలేదన్న భావన ఆయన వ్యాఖ్యల్లో వ్యక్తమైంది.మంత్రులకు ఫోన్ చేసినా స్పందించడం లేదని, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా సీఎం మాటలను పట్టించుకోవడం లేదని ఆయన చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లోని అంతర్గత పరిస్థితులపై చర్చకు దారితీశాయి. సీఎం స్వయంగా చెప్పినా పనులు జరగడం లేదని, ముఖ్యమంత్రి కార్యాలయంలో కీలకంగా వ్యవహరించే వేం నరేందర్‌రెడ్డికి పలుమార్లు ఫోన్ చేసినా స్పందన లేదని పోచారం పేర్కొన్నట్లు సమాచారం.2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులుగా గెలిచి, ఆ తర్వాత అధికార కాంగ్రెస్ కండువా కప్పుకున్న పదిమంది ఎమ్మెల్యేల పరిస్థితి ప్రస్తుతం ముందు నుయ్యి.. వెనుక గొయ్యిలా తయారైంది. ప్రధానంగా బాన్సువాడ ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి ఇటీవల కామారెడ్డి జిల్లా బీర్కూరు ఆత్మీయ సమావేశంలో చేసిన తీవ్ర వ్యాఖ్యలు కాంగ్రెస్ అంతర్గత కలహాలను బహిర్గతం చేశాయి. "నేను మంత్రి పదవి కోసమో, నిధుల కోసమో పార్టీ మారలేదు.. కేవలం బాన్సువాడ అభివృద్ధి కోసమే వచ్చా. కానీ, ఆరు నెలల్లో పెండింగ్ పనులు పూర్తి చేస్తానన్న సీఎం రేవంత్ రెడ్డి హామీలు అమలు కావడం లేదు" అని ఆయన తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. చివరికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎం ముఖ్య సలహాదారు వేం నరేందర్ రెడ్డి కూడా ఫోన్లు ఎత్తడం లేదని ఆయన చేసిన ఆరోపణలు ప్రభుత్వంలో ఫిరాయింపుదారులకు దక్కుతున్న ప్రాధాన్యతను స్పష్టం చేస్తున్నాయి. పోచారం శ్రీనివాసరెడ్డి మాత్రమే కాదు, పార్టీ మారిన ఇతర ఎమ్మెల్యేల పరిస్థితి కూడా ఇలాగే ఉందన్న చర్చ జరుగుతోంది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరినప్పటికీ, ఇటీవల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వాన్ని, గత పాలనను ప్రశంసిస్తూ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికర చర్చకు దారితీశాయి. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కాంగ్రెస్ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు. ఇటీవలి మున్సిపల్ ఎన్నికల్లో ఆయన సోదరుడు బీఆర్ఎస్ తరఫున ప్రచారం చేసి మంచి ఫలితాలు సాధించడం, గూడెం 'ఘర్ వాపసీ'కి సంకేతంగా భావిస్తున్నారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డిలు సైతం తమ నియోజకవర్గాల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చలేక తీవ్ర ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు.ఫిరాయింపు ఎమ్మెల్యేల తిరుగుబాటు సంకేతాలతో కాంగ్రెస్ నాయకత్వం అప్రమత్తమైంది. కాంగ్రెస్ ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ ఈ వ్యవహారంపై దృష్టి సారించారు. ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకోవాలని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఎమ్మెల్యేలకు విజ్ఞప్తి చేశారు. అయితే, ఒకవైపు పాత కాంగ్రెస్ నాయకుల నుంచి వస్తున్న తీవ్ర వ్యతిరేకత, మరోవైపు నిధుల లేమితో ఫిరాయింపు ఎమ్మెల్యేలు తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారు. ఈ క్రమంలోనే కొందరు కీలక ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లతో సంప్రదింపులు జరుపుతున్నారనే ప్రచారం జోరందుకుంది.అధికార పార్టీ కండువా కప్పుకున్న వేళ కనిపించిన ఉత్సాహం ఇప్పుడు ఆవిరైపోయింది. సొంత నియోజకవర్గాల్లో ప్రజలకు ముఖం చూపించలేక ఈ ఎమ్మెల్యేలు సతమతమవుతున్నారు.

**అడకత్తెరలో రెబల్ ఎమ్మెల్యేలు**

2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున గెలిచిన పలువురు ఎమ్మెల్యేలు తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. అయితే పార్టీ మారిన తర్వాత కూడా కాంగ్రెస్‌లో వారికి పూర్తి స్థాయి రాజకీయ స్థానం దక్కలేదన్న అసంతృప్తి ఉందని వారి అనుచర వర్గాలు చెబుతున్నాయి.నియోజకవర్గ ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని స్థానిక నేతలు, అనుచరుల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. అధికార పార్టీలోకి వెళ్లిన తర్వాత నిధులు, అభివృద్ధి పనులు వేగంగా వస్తాయని భావించినా.. చాలా చోట్ల పనులు ముందుకు కదలకపోవడం ఎమ్మెల్యేలకు ఇబ్బందిగా మారిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కొంతకాలంగా కాంగ్రెస్‌కు దూరంగా ఉంటున్నట్లు కనిపిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో ఆయన సోదరుడు బీఆర్ఎస్‌లో చేరడం, ఆ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా పనిచేయడం రాజకీయంగా చర్చకు దారితీసింది. పటాన్‌చెరు పరిధిలో బీఆర్ఎస్ మెరుగైన ఫలితాలు సాధించడంతో గూడెం రాజకీయ వైఖరిపై మరింత ఆసక్తి ఏర్పడిందిజగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కూడా నియోజకవర్గ అభివృద్ధి పనులపై ఒత్తిడి ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కీలక రోడ్డు



పనులు పార్టీ మారి రెండేళ్లు గడిచినా ఆశించిన స్థాయిలో ముందుకు సాగకపోవడం ఆయనకు ఇబ్బందిగా మారిందని స్థానిక వర్గాలు చెబుతున్నాయి.గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి పరిస్థితి కూడా ఇలాగే ఉంది. గుర్రం లిఫ్ట్ పథకం పనులు చేపట్టడంతో పాటు పలు రిజర్వాయర్ల సామర్థ్యాన్ని పెంచితే నియోజకవర్గానికి ప్రయోజనం కలుగుతుందని ఆయన భావిస్తున్నారు. అయితే ఈ పనుల్లో జాప్యం జరుగుతుండటం ఆయనను కూడా అసంతృప్తికి గురిచేస్తున్నట్లు సమాచారం.ఫిరాయింపు ఎమ్మెల్యేల నుంచి వరుసగా అసంతృప్తి వ్యక్తమవుతుండటంతో కాంగ్రెస్ నాయకత్వం అప్రమత్తమైనట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ కూడా ఈ అంశంపై ఆరాతీసినట్టు సమాచారం. పోచారం వ్యాఖ్యలపై పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ స్పందిస్తూ.. ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకోవాలని సూచించారు. అందుబాటులో ఉన్న వనరులతో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలిపారు.అయితే ఎమ్మెల్యేల స్థాయిలో పరిస్థితులు అంత సాఫీగా లేవన్న సంకేతాలు మాత్రం కనిపిస్తున్నాయి. పార్టీ మారిన సమయంలో ఉన్న రాజకీయ ఉత్సాహం తగ్గిపోవడం, స్థానిక కాంగ్రెస్ నాయకత్వంతో సమన్వయం కుదరకపోవడం, అభివృద్ధి పనులకు నిధులు అందకపోవడం, తమ రాజకీయ భవిష్యత్తుపై స్పష్టత లేకపోవడం వంటి అంశాలు వారిని ఇబ్బంది పెడుతున్నట్లు తెలుస్తోంది.బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలలో కొందరు ఇప్పుడు తమ నిర్ణయాన్ని పునఃపరిశీలిస్తున్నారన్న ప్రచారం ఆసక్తిని పెంచుతోంది. అధికార పార్టీలో చేరిన సమయంలో నియోజకవర్గ అభివృద్ధి, రాజకీయ భవిష్యత్తు దృష్ట్యా తీసుకున్న నిర్ణయం ఆశించిన ఫలితాలు ఇవ్వలేదన్న భావన కొందరిలో బలపడుతున్నట్లు సమాచారం.పోచారం బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేయడం, గూడెం మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్‌కు దూరంగా కనిపించడం, దానం నాగేందర్ ఇటీవల బీఆరెస్ నాయకత్వాన్ని పొగడటం, సంజయ్ కుమార్, కృష్ణమోహన్‌రెడ్డి నియోజకవర్గ సమస్యలపై ఒత్తిడి ఎదుర్కొంటుండటం.. ఇవన్నీ ఫిరాయింపు ఎమ్మెల్యేల భవిష్యత్ అడుగులు ఎటు పడతాయా అన్న ఆసక్తిని పెంచుతున్నాయి. అయితే నిజంగానే వీరిలో కొందరు తిరిగి బీఆర్ఎస్‌లోకి వెళ్తారా? లేక ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నాయకత్వం అసంతృప్తిని చల్లార్చి వారిని పార్టీలోనే కొనసాగేలా చూస్తారా? అన్నది ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో కీలక ప్రశ్నగా మారింది.

# యూనిటీ మాల్ ఒప్పందంపై విచారణ జరగాలి..

**ఎంపీ రఘునందన్ రావు..**

**ఢిల్లీ:** తెలంగాణలో ప్రజల సొమ్ము దోచుకోవడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పోటీ పడుతున్నాయని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్ల అవినీతిని మించి కాంగ్రెస్ దోచుకోవాలని చూస్తోందని విమర్శించారు. ఈ రెండు పార్టీలు ఒకే నాణేనికి ఇరువైపులా ఉన్నటువంటివని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా యూనిటీ మాల్ పేరుతో జరిగిన ఒప్పందంపై సమగ్ర విచారణ జరపాలని ఎంపీ డిమాండ్ చేశారు.కేంద్రం ఇచ్చిన రూ.202 కోట్లతో యూనిటీ మాల్ నిర్మించాలని నిర్ణయించారని ఎంపీ రఘునందర్ రావు అన్నారు. అందుకు తెలంగాణ ప్రభుత్వం ఆరు ఎకరాలకు పైగా భూమి ఇచ్చిందన్నారు. అయితే, ఈ ఒప్పందంలో అవినీతి జరిగిందన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలపై విచారణ జరగాలని ఎంపీ రఘునందన్ రావు స్పష్టం చేశారు. కేటీఆర్ తప్పు చేస్తే విచారణ జరిగినప్పుడు, కాంగ్రెస్ తప్పు చేస్తే విచారణ ఎందుకు ఉండకూడదని ప్రశ్నించారు. 2018లో బీఆర్ఎస్ హయాంలో 10 ఎకరాల



భూమిని ప్రైవేట్ సంస్థకు కేటాయించారని, దానిపైనా విచారణ జరగాలన్నారు. ఈ రెండు భూకేటాయింపు ఒప్పందాలపై సమదృష్టితో దర్యాప్తు జరపాలని రఘునందన్ డిమాండ్ చేశారు.యూనిటీ మాల్, గత బీఆర్ఎస్ భూకేటాయింపులపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ కోరుతూ కేంద్ర విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు ఎంపీ చెప్పుకొచ్చారు. అలాగే, కాళేశ్వరం ప్రాజెక్టుపై డీపీఆర్ నుంచి చివరి చెల్లింపు వరకు సీబీఐ విచారణ జరపాలన్నారు. కేవలం మూడు బ్యారేజీలపై కాకుండా మొత్తం ప్రాజెక్టుపై దర్యాప్తు చేయాలన్నారు. కాళేశ్వరం మొత్తం ప్రాజెక్టుపై విచారణ జరిపించాలని కేంద్రానికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాయాలని ఎంపీ సూచించారు. దానిపై కేంద్ర హోంమంత్రిని కలిసి దర్యాప్తు జరిగేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. మరోవైపు, రింగ్ రోడ్డు, ఫార్ములా-ఈ రేస్, కాళేశ్వరం అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మాట మార్చిందని ఎంపీ మండిపడ్డారు.కాంగ్రెస్, బీఆర్ఎస్ పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ ప్రజల దృష్టిని మళ్లిస్తున్నాయని రఘునందన్ రావు విమర్శించారు. వీళ్లిద్దరూ అవినీతిలో అన్నదమ్ములంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఈ సందర్భంగా తెలంగాణలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రావాలని ప్రజలకు బీజేపీ విజ్ఞప్తి చేస్తోందన్నారు. హైదరాబాద్‌లో భూముల విలువ ఎకరాకు వందల కోట్లకు చేరిందని, ప్రజల ఆస్తులను విక్రయించే హక్కు ప్రభుత్వాలకు లేదని ఎంపీ తేల్చి చెప్పారు. ప్రజల ఆస్తులకు ప్రభుత్వాలు కస్టోడియన్లుగా ఉండాలని, అంతేకానీ యజమానులుగా వ్యవహరించొద్దని ఆయన పేర్కొన్నారు.

# లోకసభ నిరవధిక వాయిదా...!

- మొదటి పేజీ తరువాయి

కూడా చర్చ జరపాలని వారు డిమాండ్ చేశారు . "విరాళాలను ఎవరు దోచుకున్నారు?", "అమిత్ షా, సభకు రండి, సభకు రండి!" అని ప్రతిపక్షాలు నినాదాలు చేశాయి.వర్షాకాల సమావేశాల ముగింపులో, సోమవారం నాడు, తాము చర్చలకు సిద్ధంగా ఉన్నామని, తమ వాదనను ప్రతిపక్షాలు పూర్తిగా వినాల్సి ఉంటుందని ప్రభుత్వం ప్రకటించింది. రాహుల్ గాంధీ "పారిపోవద్దు" వంటి కామెంట్స్ చేశారు. దీని తరువాత, బుధవారం నాడు, తాను అన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్నానని అమిత్ షా స్వయంగా ఒక ప్రకటన జారీ చేశారు.ఆయన స్పీకర్ ఓం బిర్లాకు ఒక లేఖ కూడా రాశారు, అందులో, "దయచేసి మీ సమయాన్ని కేటాయించండి. మేం ప్రతి ప్రశ్నకు సమాధానం ఇస్తాం" అని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు చర్చను కోరుకోవడం లేదని అమిత్ షా ఆరోపించారు.ఇటీవల, అధికార ఎన్డీఏ ఎంపీలు జార్ఖండ్‌లో జరిగిన లాఠీచార్జి అంశాన్ని లేవనెత్తుతూ, "రాహుల్ గాంధీ, సమాధానం చెప్పండి!" వంటి నినాదాలు చేశారు. ఈరోజు ఉదయం, ఎన్డీఏ, ప్రతిపక్ష ఎంపీలు నినాదాలు చేస్తూ ఘర్షణ పడ్డారు. అధికార పార్టీ నాయకులు నిరసన తెలపడం ఇదే మొదటిసారి అని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ అన్నారు.

మోదీ, రాహుల్ గాంధీ సభలో ఉండగా..

**పార్లమెంట్ చరిత్రలో కొత్త అధ్యాయం!**

పార్లమెంట్ చరిత్రలో గురువారం అరుదైన ఘట్టం చోటుచేసుకుంది. వర్షాకాల సమావేశాల చివరి రోజు లోక్‌సభ కార్యకలాపాలు తొలిసారి 'వందేమాతరం'తో ప్రారంభమయ్యాయి. ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ సహా సభ్యులంతా సభలో ఉండగా ఆరు చరణాల జాతీయ గీతాన్ని ఆలపించారు.'వందేమాతరం' ఆలాపన పూర్తయ్యాక లోక్‌సభ నిరవధికంగా వాయిదా పడింది. రాజ్యసభ కూడా జాతీయ గేయంతోనే సమావేశాలను ముగించింది. దీంతో పార్లమెంట్ చరిత్రలో కొత్త అధ్యాయం నమోదైంది.'వందేమాతరం'కు చట్టబద్ధ రక్షణ కల్పించిన కొద్ది రోజులకే ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ గేయాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం, పాడకుండా నిరోధించడం నేరంగా పరిగణించేలా కొత్త చట్టం తీసుకొచ్చారు.కేంద్ర హోంశాఖ జనవరి 28న 'వందేమాతరం' ఆలాపనపై మార్గదర్శకాలు జారీ చేసింది. రాష్ట్రపతి రాక, త్రివర్ణ పతాక ఆవిష్కరణ, గవర్నర్ల ప్రసంగాలు వంటి సందర్భాల్లో ఆరు చరణాలు ఆలపించాలని అందులో సూచించింది.

# మైనారిటీ రిజర్వేషన్లకు మోదీ, అమిత్ షా వ్యతిరేకం

- మొదటి పేజీ తరువాయి

ఎద్దేవా చేశారు. ఓ ఆర్ఎంపీ డాక్టర్‌ను టీజీపీఎస్సీ సభ్యుడిగా నియమించారని సీఎం ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశామని సీఎం రేవంత్ పేర్కొన్నారు. యూపీఎస్సీ తరహాలో టీజీపీఎస్సీని బలోపేతం చేశామని ధీమా వ్యక్తం చేశారు. రిటైర్డ్ డీజీపీని టీజీపీఎస్సీ ఛైర్మన్‌గా నియమించామని చెప్పుకొచ్చారు. ఎంతో పారదర్శకంగా గ్రూప్-1 పరీక్షలు నిర్వహించామని తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నిఖత్ జరీన్ కోసం నిబంధనలు పక్కనపెట్టి మరీ గ్రూప్-1 ఉద్యోగం ఇచ్చామని, అలాగే క్రికెటర్ సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం కల్పించామని సీఎం రేవంత్ గుర్తు చేశారు.

# స్టే ఉన్నా భవనాలు కూల్చేస్తారా

- మొదటి పేజీ తరువాయి

సూచనల మేరకే జీఎల్ఆర్ నిబంధనల ప్రకారం ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకున్నామని వివరించారు. అయితే, సరైన రికార్డులను పరిశీలించకుండా ఏకపక్షంగా కూల్చివేతలు చేపట్టడం ఆమోదయోగ్యం కాదని ధర్మాసనం స్పష్టం చేసింది. హైడ్రా పరిధిలోని అన్ని జిల్లాల కలెక్టర్లు తమ వద్ద ఉన్న కోర్టు స్టే ఉత్తర్వుల వివరాలను తక్షణమే హైడ్రాకు తెలియజేయాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈ విషయంలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి తగిన మార్గదర్శకాలు జారీ చేయాలని సూచించింది. హైడ్రా ఏర్పాటుకు ముందు జారీ అయిన స్టే ఉత్తర్వులను సైతం ఆ సంస్థ పరిగణనలోకి తీసుకోవడం లేదని పలు ఫిర్యాదులు వస్తున్నాయని కోర్టు వ్యాఖ్యానించింది. అనంతరం తదుపరి విచారణను ఆగస్టు 27వ తేదీకి వాయిదా వేసింది

# రాయదుర్గం భూముల వేలం ఆపండి

- మొదటి పేజీ తరువాయి

మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ యూనివర్సిటీ పరిసరాలు, రాయదుర్గం వంటి ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను అమ్మేయడానికి కుట్రలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పర్యావరణ భూముల నుంచి రాయదుర్గంలోని వారసత్వ రాతి ప్రదేశాల వరకు తెలంగాణ విలువైన ప్రజా ఆస్తులకు ప్రమాదం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.వేలం వేయాలని ప్రతిపాదించిన రాయదుర్గం పాన్‌మక్తా గ్రామంలోని సర్వే నంబర్ 83ని ఇప్పటికే హెరిటేజ్ సైట్‌గా ప్రకటించారు. దీని యాజమాన్య హక్కులపై ఎస్బీఐ, వక్ఫ్ బోర్డు మధ్య న్యాయవివాదాలు కొనసాగుతున్నాయి. ఇలాంటి కేసులు పరిష్కారం కానప్పుడు థర్డ్ పార్టీ ప్రయోజనాలు కల్పించవద్దని సుప్రీంకోర్టు కూడా స్పష్టం చేసింది" అని హరీశ్ రావు తన లేఖలో గుర్తుచేశారు. ఇదే భూముల పరిరక్షణ కోసం 2020లో రేవంత్ రెడ్డి కోర్టులను ఆశ్రయించారని చెప్పారు. "అప్పుడు కోర్టుకెక్కిన మీరే, ఇప్పుడు సీఎం అయ్యాక వివాదాస్పద ఆస్తిపై థర్డ్ పార్టీ హక్కులు ఎలా కల్పిస్తారు?" అని ప్రశ్నించారు.ఇదే సర్వే నంబర్‌లో గతంలో 6.2 ఎకరాలను ఎకరాకు రూ. 237 కోట్ల చొప్పున వేలం వేయగా, ఆ భూమిపై ఎస్బీఐ యాజమాన్య హక్కులను ప్రకటించిందని, ఈ అంశం ప్రస్తుతం తెలంగాణ హైకోర్టులో విచారణలో ఉందని హరీశ్ రావు తెలిపారు. ఈ కేసు తేలకుండానే, అదే సర్వే నంబర్‌లోని మరో 10.63 ఎకరాలను వేలం వేయడం పరిపాలనా విచక్షణను, ప్రభుత్వ నిబద్ధతను ప్రశ్నిస్తోందని విమర్శించారు.భూమి యాజమాన్య హక్కులు చట్టబద్ధంగా తేలే వరకు ఎలాంటి వేలం, బదిలీ, రిజిస్ట్రేషన్ లేదా అభివృద్ధి కార్యకలాపాలు చేపట్టవద్దని ఆయన డిమాండ్ చేశారు. వారసత్వ ఆస్తికి సంబంధించిన రికార్డుల గల్లంతుపై విచారణ జరిపించాలని, వక్ఫ్ రికార్డుల మాయంపై స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించాలని కోరారు. భవిష్యత్ తరాల కోసం ఈ విలువైన భూములను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని హరీశ్ రావు స్పష్టం చేశారు.

# బీసీ మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు

- మొదటి పేజీ తరువాయి

లేకుండా 100 శాతం సబ్సిడీపై అందజేస్తామని చెప్పారు.

ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు అర్హులైన బీసీ మహిళల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు మంత్రి వెల్లడించారు.

**పేద, ఒంటరి మహిళలకు ప్రాధాన్యత:**


కుట్టు వృత్తిపై ఆసక్తి ఉన్న నిరుద్యోగ బీసీ మహిళలకు ఈ పథకం ద్వారా స్వయం ఉపాధి కల్పించడమే ప్రధాన ఉద్దేశమని మంత్రి తెలిపారు. అత్యంత పేదలు, వితంతువులు, ఒంటరి మహిళలు, నిరాశ్రయులు, అనాథలు, వికలాంగులు, అలాగే కుట్టు వృత్తిలో అనుభవం ఉన్న మహిళలకు నిబంధనల మేరకు ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పారు.లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జరుగుతుందని మంత్రి స్పష్టం చేశారు. కుట్టు మిషన్ల వినియోగంపై అవసరమైన శిక్షణను కూడా తప్పనిసరి చేస్తున్నట్లు తెలిపారు.

**మొదటి దశలో 1.19 లక్షల మందికి అవకాశం:**

కుట్టు మిషన్లు కోరుకునే మహిళల సంఖ్య ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, మొదటి దశలో 1.19 లక్షల మంది అర్హులకు ప్రయోజనం కల్పిస్తామని మంత్రి చెప్పారు. భవిష్యత్‌లో పథకాన్ని మరింత విస్తరించి ఎక్కువ మంది బీసీ మహిళలకు ప్రయోజనం కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ప్రభుత్వ విప్ లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు ఈర్లపల్లి శంకరయ్య, నవీన్ యాదవ్, కాలేరు వెంకటేష్, వివిధ కులాల కార్పొరేషన్ ఛైర్మన్లు, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాలమయాదేవి, బీసీ సంక్షేమ శాఖ అధికారులు మల్లయ్య బట్టు, అలోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

# పూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణకు భారీగా తరలిరావాలి

**మంత్రి పొన్నం**



**హైదరాబాద్:**మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ బస్సులు, ఇతర స్వయం ఉపాధి కార్యక్రమాల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అదే విధంగా 'ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు' పథకం ద్వారా బీసీ మహిళలకు ఇంటి నుంచే ఆదాయం పొందే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు.బీసీ సంక్షేమ శాఖ ద్వారా ఆత్మగౌరవ భవనాలకు నిధులు కేటాయిస్తూ, వాటి నిర్మాణాలను పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. ఇటీవల బలహీన వర్గాల ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించి బీసీల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని చెప్పారు. కులగణన అనంతరం బీసీల అభివృద్ధికి సంబంధించిన తదుపరి కార్యాచరణను ముందుకు తీసుకెళ్తామని మంత్రి పేర్కొన్నారు.

**పూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణకు భారీగా తరలిరావాలి**

ఈనెల 14వ తేదీ సాయంత్రం 4 గంటలకు హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్ ఎదురుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఆవిష్కరించనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పార్టీ చాంపియన్గా నిలుస్తోందని, మహాత్మా జ్యోతిబాపూలేను స్మరించుకుంటూ ప్రగతి భవన్ను "మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్" గా, సచివాలయాన్ని "డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయం""గా పేరు మార్చినట్లు తెలిపారు.

## హీరోలు రానా, వెంకటేశ్ లకు ఎదురుదెబ్బ..
## కేసు కొట్టివేతకు హైకోర్టు నిరాకరణ

**ఫిలింనగర్‌లోని ఆస్తి వివాదానికి సంబంధించి కేసు**

**సివిల్ వివాదంతో పాటు క్రిమినల్ కేసు కూడా కొనసాగవచ్చన్న హైకోర్టు**

**కింది కోర్టులో విచారణ ఎదుర్కోవాల్సిందేనని ఆదేశం**



ప్రముఖ సినీ నటులు వెంకటేశ్, రానా, దగ్గుబాటి అభిరామ్, నిర్మాత డి. సురేశ్ బాబులకు తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైంది. తమపై నమోదైన చోరీ, అతిక్రమణ కేసులను కొట్టివేయాలని కోరుతూ వారు దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం తిరస్కరించింది. ఆస్తికి సంబంధించిన సివిల్ వివాదం పెండింగ్‌లో ఉన్నంత మాత్రాన, క్రిమినల్ కేసు విచారణను నిలిపివేయలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. హైదరాబాద్‌లోని ఫిలింనగర్‌లో గల డెక్కన్ కిచెన్ రెస్టారెంట్ ఆస్తికి సంబంధించి వ్యాపారవేత్త కోరె నందు కుమార్ ఈ కేసు దాఖలు చేశారు. తాను లీజుకు తీసుకున్న స్థలంలోని నిర్మాణాలను నిందితులు అక్రమంగా కూల్చివేశారని, చట్టవిరుద్ధంగా ప్రాంగణంలోకి ప్రవేశించి విలువైన వస్తువులను అపహరించారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. తనను, తన కుటుంబాన్ని బెదిరించడమే కాకుండా, కోర్టు స్టే ఉత్తర్వులు అమలులో ఉన్నప్పటికీ నిందితులు వాటిని బేఖాతరు చేశారని ఆరోపించారు. ఈ వివాదం పూర్తిగా సివిల్ వ్యవహారమని, దీనిపై క్రిమినల్ విచారణ జరపడం సరికాదని దగ్గుబాటి కుటుంబ సభ్యులు, వారి అకౌంటెంట్ గడ్డం విశ్వనాథం హైకోర్టును ఆశ్రయించారు. అయితే, ఈ వాదనతో జస్టిస్ ఎన్. తుకారాంజీ ధర్మాసనం ఏకీభవించలేదు. ఒకే వివాదంలో సివిల్, క్రిమినల్ అంశాలు మిళితమై ఉండవచ్చని, నేరపూరిత చర్యలు జరిగినట్లు ప్రాథమిక ఆధారాలు ఉన్నప్పుడు విచారణను అడ్డుకోలేమని కోర్టు స్పష్టం చేసింది. ఫిర్యాదు, వాంగ్మూలాలు, ఫోటోలు, వీడియో సాక్ష్యాధారాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే కింది కోర్టు మెజిస్టేట్ ఈ కేసును విచారణకు స్వీకరించారని హైకోర్టు అభిప్రాయపడింది. లోతైన విచారణ ద్వారానే వాస్తవాలను తేల్చాల్సి ఉంటుందని, ప్రాథమిక దశలో సెక్షన్ 482 కింద కేసును కొట్టివేయలేమని వెల్లడించింది. ఈ తీర్పుతో నాంపల్లిలోని 17వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో ఈ కేసు విచారణ యథావిధిగా కొనసాగనుంది.

## అభివృద్ధి కోసమే సీఎంకు మద్దతిచ్చా..
## పోచారం మరోసారి హాట్ కామెంట్స్



**కామారెడ్డి, ఆగస్టు :** కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర దుమారాన్ని రేపిన విషయం తెలిసిందే. అభివృద్ధి నిధులకు సంబంధించి తనకు న్యాయం జరగలేదంటూ కామెంట్స్ చేశారు. దానికి కొనసాగింపుగా ఈరోజు(గురువారం) కూడా వర్ని మండలం జాకోరా గ్రామంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే... మరోసారి హాట్ కామెంట్స్ చేశారు. ఇటీవల తాను చేసిన వ్యాఖ్యల్లో ఎలాంటి రాజకీయం దురుద్దేశ్యం లేదని స్పష్టం చేశారు. తనకు స్వార్థం ఉందంటూ బుద్ధిహీనులు ప్రచారం చేస్తున్నారని, స్వార్థం ఉందని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. 'నా మాటల వెనుక రాజకీయం, రహస్యం లేదు. నేను డబ్బులకు అమ్ముడుపోయే వ్యక్తిని కాదు. నాకు ఎలాంటి స్వార్థం లేదు. ప్రజల కోసమే నా జీవితం' అని స్పష్టం చేశారు. అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రికి మద్దతు ఇచ్చానని ఎమ్మెల్యే అన్నారు. అన్నం పెట్టిన వాళ్లను మరిచిపోతే పుట్టగతులుండవన్నారు. కేసీఆర్ చేశారు కాబట్టే.. చేశారని చెప్పానని.. రేవంత్ రెడ్డి ఇచ్చినవి కూడా చెబుతానని తెలిపారు. ఉన్నది ఉన్నట్లు చెప్పడం తన నైజమని చెప్పుకొచ్చారు. పోరాటం చేస్తా తప్ప, తల వంచే రాజకీయం చేయనని స్పష్టం చేశారు. ప్రజల కోసం, నియోజకవర్గ అభివృద్ధి కోసం ఏమైనా చేస్తానన్నారు. ఎమ్మెల్యేకు ప్రభుత్వ సహకారం కావాలని.. ప్రభుత్వ సహకారం లేకుంటే ఏమి చేయలేమని పోచారం శ్రీనివాస రెడ్డి వెల్లడించారు.

## వరంగల్ జిల్లా శాయంపేట మెగా
## టెక్స్‌టైల్ పార్కులో విషాదం..




**వరంగల్ జిల్లా:** గీసుగొండ మండలం శాయంపేట శివారులోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో ఇవాళ (గురువారం) విషాద ఘటన చోటుచేసుకుంది. గణేశా ఎకోపెట్ క్లాత్ ఫ్యాక్టరీలో లిఫ్ట్‌లో ఇరుక్కుని ఇద్దరు సిబ్బంది మృతిచెందారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సాంకేతిక నిపుణులు అభిలాష్ (30), సూర్యప్రకాశ్ (31)గా మృతులను గుర్తించారు. అయితే, వారిద్దరూ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తూ లిఫ్ట్‌లో ఇరుక్కుపోయారు. ఈ ఘటనలో ఇద్దరూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. షార్ట్‌సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి ప్రమాదానికి గల పూర్తి కారణాలపై ఆరా తీస్తున్నారు. లిఫ్ట్‌లో ప్రమాదం ఎలా జరిగింది? నిజంగానే షార్ట్‌సర్క్యూట్ జరిగిందా? వంటి అంశాలపై దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు.

## ఫూలే విగ్రహాల ఏర్పాట్లను
## పరిశీలించిన ఎమ్మెల్యే దానం

**హైదరాబాద్:** నగర నడిబొడ్డున మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఏర్పాటు చేయాలన్నది బడుగు, బలహీన వర్గాల చిరకాల వాంఛ అని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఈ వాంఛను ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి నెరవేరుస్తున్నారని తెలిపారు. ఈ నెల 14న ఐమాక్స్ ఎదురుగా ఉన్న హెచ్ఎండీఏ పార్కులో పూలే దంపతుల కాంస్య విగ్రహాలను సీఎంబ్ఆవిష్కరించనున్నట్లు వెల్లడించారు. విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను ఎమ్మెల్యే దానం నాగేందర్ అధికారులు, పోలీసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో మహిళల విద్యాభివృద్ధికి జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. వారి ఆశయాలకు అనుగుణంగా సీఎం రేవంత్రెడ్డి పనిచేస్తున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ఏర్పాటు చేస్తూ తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని దానం నాగేందర్ పేర్కొన్నారు. ఈ నెల 14న జరిగే విగ్రహావిష్కరణ సభకు ప్రజలు, పూలే అభిమానులు, బడుగు బలహీన వర్గాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# మండలిలో జన్ జీ...




**వరంగల్, ఆగస్టు 13 :** తెలంగాణ రాజకీయం ఎప్పుడూ రసవత్తరంగానే ఉంటుంది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ముగిసినా.. ఇప్పుడు రాష్ట్రంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల వేడి అప్పుడే మొదలైంది. సాధారణంగా ఎన్నికల సమయానికి కొన్ని నెలల ముందు హడావుడి కనిపించడం సహజం, కానీ ఈ సారి ఏకంగా ముందే ప్రధాన రాజకీయ పార్టీల తరపున యువ నాయకులు, కొత్తతరం ఆశావాహులు క్షేత్రస్థాయిలో పావులు కదుపుతున్నారు. ముఖ్యంగా గ్రాడ్యుయేట్ స్థానాల్లో విద్యావంతులు, యువత ఓటర్లుగా ఉండటంతో సాంప్రదాయ రాజకీయ సీనియర్ల కంటే ఫైర్‌బ్రాండ్ నాయకత్వం, విద్యాధికులైన యువ నేతల వైపే పార్టీలు మరియు ఓటర్లు మొగ్గు చూపే ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. తెలంగాణలోని ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలు రాబోయే కాలంలో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ పట్టభద్రుల నియోజకవర్గానికి ప్రస్తుతం బీఆర్ఎస్ నేత సురభి వాణీదేవి ప్రాతిపదికన ఉన్న ఈ సీటు గడువు 2027 మార్చితో ముగుస్తుంది. రాజధాని నగరం, ఐటీ కారిడార్ విస్తరించి ఉన్న ప్రాంతం కావడంతో ఇక్కడ గెలుపు పార్టీల ప్రతిష్టకు ప్రతీకగా మారింది. వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి గతంలో పల్లా రాజేశ్వర్ రెడ్డి విజయం సాధించారు. కానీ ఆయన ఎమ్మెల్యేగా రాజీనామా చేశారు. ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న విజయం సాధించారు. ఆయనను కాంగ్రెస్ సస్పెండ్ చేసింది. ఈసారి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పోటీల్లో పాత తరం నేతల కంటే యువత, సోషల్ మీడియా ప్రభావం ఉన్న నాయకులే ప్రముఖంగా వినిపిస్తున్నారు. టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్, అధికార ప్రతినిధిగా కాంగ్రెస్ వైఖరిని గట్టిగా వినిపిస్తున్న సామ రామ్మోహన్ రెడ్డి ఈసారి కాంగ్రెస్ తరఫున గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ రేసులో బలమైన అభ్యర్థిగా ప్రచారంలో ఉన్నారు. విద్యార్థి నాయకుడిగా ప్రస్థానం ప్రారంభించి, గడిచిన కొన్నేళ్లుగా టీవీ డిబేట్లు, క్షేత్రస్థాయి ఉద్యమాల ద్వారా యువతలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారాయన. హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ లేదా మెదక్ ఉమ్మడి జిల్లాల పరిధి నుంచి ఆయన పోటీ చేసే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది. విద్యాధికుడైన రాకేష్ రెడ్డి గత వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపఎన్నికలో బీఆర్ఎస్ తరఫున పోటీ చేసి హోరాహోరీ పోరాటం ఇచ్చారు. ఉపఎన్నికలో స్వల్ప తేడాతో ఓడినప్పటికీ లక్షకు పైగా మొదటి ప్రాధాన్యత ఓట్లను సాధించి తన సత్తా చాటారు. రాబోయే ఎమ్మెల్సీ సమరంలో ఆయన మళ్లీ ప్రధాన పోటీదారుడిగా నిలబడేందుకు నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి పట్టభద్రుల ఎన్నికలు ఓ రకంగా పనితీరుకు పరీక్షగా మారనున్నాయి. నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్, గ్రూప్స్ నియామకాలపై విద్యావంతుల్లో ఉన్న అభిప్రాయాన్ని తమకు అనుకూలంగా మలుచుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ భావిస్తోంది. అందుకే అగ్రెసివ్ కాన్ఫిడెంట్ ఉన్న యువ ముఖాలను బరిలోకి దింపే యోచనలో ఉంది. మరోవైపు, కోల్పోయిన కేడర్ విశ్వాసాన్ని నిలబెట్టుకోవడానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ యువ గ్రాడ్యుయేట్లను, విద్యాధికులను ముందు వరుసలో నిలబెడుతున్నారు. ఇక బీజేపీ తన అర్బన్ ఓట్ బ్యాంక్, హిందూత్వ కేడర్‌తో పాటు విద్యావంతుల మద్దతుతో రెండు స్థానాల్లో సత్తా చాటాలని గ్రౌండ్ వర్క్ వేగవంతం చేసింది. త్వరలో ఎన్నికల సంఘం ఓటర్ నమోదు ప్రక్రియ ప్రారంభించే అకాశం ఉంది. అప్పటి నుంచే అసలు వార్ ప్రారంభం కనుంది. రాకేష్ రెడ్డి, సామ రామ్మోహన్ రెడ్డి వంటి సోషల్ మీడియా లీడర్లు ఇప్పటికే వందలాది ఐటీ నిపుణులు, నిరుద్యోగులతో డైరెక్ట్ కనెక్ట్ సాధిస్తుండటం ఈ కొత్తతరం రాజకీయాన్ని తెలియజేస్తోంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏ పార్టీ గెలుపోటములను నిర్ణయించేది రెండు ప్రధాన అంశాలు. మొదటిది మొదటి, రెండో ప్రాధాన్యత ఓట్ల ప్రాసెస్ అయితే, రెండోది ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు . ఉద్యోగ ప్రకటనల అమల్లో జాప్యం జరిగితే అది అధికార పార్టీ అభ్యర్థులకు ప్రతికూలంగా మారే ముప్పు ఉంటుంది. అదే సమయంలో ప్రతిపక్షాలు కేవలం విమర్శలకే పరిమితం కాకుండా సరైన ప్రత్యామ్నాయ అజెండాను చూపిస్తే తప్ప పట్టభద్రుల ఓట్లను ఆకర్షించలేవు. ఈ సమీకరణాల మధ్య రాబోయే గ్రాడ్యుయేట్ సమరం తెలంగాణ రాజకీయాల్లో ఒక ట్రెండ్ సెట్టర్‌గా మారబోతోంది.

# బండికి కీలక బాధ్యతలు..

**హైదరాబాద్, ఆగస్టు 13:** తెలంగాణలో ఏలాగైనా అధికార పీఠాన్ని దక్కించుకోవడమే లక్ష్యంగా కమలం పార్టీ పావులు కదుపుతోంది. ఈ క్రమంలోనే రాబోయే అసెంబ్లీ సమరానికి పార్టీని సిద్ధం చేసేందుకు నేతృత్వంలో మార్పులు ఉంటాయా, లేక ప్రస్తుత సారథ్యాన్నే కొనసాగిస్తారా అనే అంశం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావును తప్పించి, గతంలో పార్టీని పరుగులు తీటించిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు మళ్లీ రాష్ట్ర పార్టీ పగ్గాలు అప్పగిస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. రాజకీయ వర్గాల్లో బండి సంజయ్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నప్పటికీ, బీజేపీ జాతీయ నాయకత్వం నుంచి మాత్రం నాయకత్వ మార్పుపై స్పష్టమైన సంకేతాలేవీ వెలువడలేదు. షెడ్యూల్ ప్రకారం తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు 2028లో జరగాల్సి ఉంది. ఒకవేళ కేంద్రం ప్రతిపాదిస్తున్న 'జమిలి' విధానం అమల్లోకి వస్తే, ఇవి 2029 మే లేదా జూన్ నాటికి మారే అవకాశం ఉంది. ఈ లెక్కన ప్రస్తుత అధ్యక్షుడు రాంచందర్ రావు పదవీకాలం ఇంకా సుమారు రెండేళ్లకు పైగా ఉంది. ఎన్నికలకు ఇంకా తగినంత సమయం ఉన్నందున, ఇప్పుడు హడావుడిగా అధ్యక్షుడిని మార్చడం వల్ల పార్టీలో నూతన అసంతృప్తులు, సమన్వయ లోపాలు తలెత్తే ప్రమాదం ఉందని అధిష్ఠానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర అధ్యక్ష పదవి రేసులో కేవలం బండి సంజయ్ మాత్రమే కాకుండా మరికొందరు అగ్రనేతలు కూడా ఉన్నారు. తెలంగాణలో బీజేపీని దూకుడుగా ముందుకు తీసుకెళ్లిన అనుభవం బండి సంజయ్ కి ఉంది. కార్యకర్తలలో ఉన్న విపరీతమైన క్రేజ్, అధికార పార్టీకి గట్టి పోటీ ఇవ్వగలరనే నమ్మకం ఆయనకు సానుకూల అంశాలు. ఇక ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్, రఘునందన్ రావు కూడా పార్టీ అధ్యక్ష పీఠం ఆశిస్తున్నారు. క్షేత్రస్థాయిలో మంచి పట్టున్న ఈ సీనియర్ ఎంపీలు కూడా అధ్యక్ష బాధ్యతల కోసం జాతీయ నాయకత్వంతో సంప్రదింపులు జరుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే నూతన అధ్యక్షుడిని నియమిస్తే, ఆయన రాష్ట్రవ్యాప్తంగా పార్టీపై పూర్తి పట్టు సాధించడానికి కొంత సమయం పడుతుంది. ఈ విరామం ఎన్నికల సమయానికి పార్టీకి ప్రతికూలంగా మారవచ్చని కొందరు విశ్లేషిస్తున్నారు. అందుకే అధ్యక్షుడిని మార్చడం కంటే, రాంచందర్ రావునే పదవిలో కొనసాగిస్తూనే.. రేసులో ఉన్న ఇతర కీలక నేతలకు వివిధ కీలక బాధ్యతలు అప్పగించాలనే ఆలోచనలో హైకమాండ్ ఉన్నట్లు సమాచారం. ముఖ్యంగా నియోజకవర్గాల వారీగా పార్టీని



బలోపేతం చేయడం, బలమైన సామాజిక వర్గాలను బీజేపీ వైపు తిప్పుకోవడం, నాయకుల మధ్య సమన్వయాన్ని పెంచడంపైనే పార్టీ దృష్టి సారిస్తోంది. మొత్తానికి, బండి సంజయ్ లేదా ఇతర నేతల పేర్లు ఎంతగా ప్రచారంలో ఉన్నప్పటికీ, ప్రస్తుతానికి రాంచందర్ రావు నేతృత్వంలోనే కమలనాథులు ముందుకు సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే 'జమిలి' నిర్ణయం, మారే రాజకీయ సమీకరణాలను బట్టి చివరి నిమిషంలో హైకమాండ్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి!

## ఉచిత పథకాలపై తెలంగాణ
# హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు..

**రాష్ట్రం ప్రమాదంలో పడుతుందని వ్యాఖ్య**

**ఉచిత పథకాలతో రాష్ట్రంపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందన్న హైకోర్టు**


**ప్రజలు వర్క్ కల్చర్ మర్చిపోతున్నారని ఆందోళన**

**ఐఫోన్ పట్టుకున్న వాళ్లు కూడా ఉచితాల కోసం ఎదురు చూస్తున్నారని మండిపాటు**




రాష్ట్రంలో ఉచిత పథకాల అమలు, వాటి ఆర్థిక భారంపై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ సంచలన వ్యాఖ్యలు చేసింది. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ ధర్మాసనం... చట్టబద్ధమైన ప్రక్రియ, అసెంబ్లీ తీర్మానం లేకుండా కేవలం జీవోల ఆధారంగానే ప్రజాధనాన్ని వెచ్చించే పథకాలను ఎలా కొనసాగిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. నాలుగు వారాలు గడిచినా ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ఈ పథకాల అమలుపై తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు మధ్యంతర 'స్టే' విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర బడ్జెట్ అంచనాలు, రాబడిని విశ్లేషిస్తూ ఆదాయంలో మెజారిటీ భాగం జీతాలు, అప్పులు, సంక్షేమ పథకాలకే సరిపోతే అభివృద్ధికి కేవలం కొన్ని వేల కోట్లు మాత్రమే మిగులుతున్నాయని న్యాయస్థానం గుర్తుచేసింది. అర్హులైన పేదలకు సహాయం చేయడం సమంజసమే అయినా, శ్రీమంతులకు కూడా ఉచితాలు అందజేస్తుండటం ఆర్థిక వ్యవస్థను డేంజర్ జోన్‌లోకి నెడుతోందని వ్యాఖ్యానించింది. పల్సర్ బైక్, ఐఫోన్ పట్టుకుని ఉచిత బియ్యం తీసుకుంటున్న పరిస్థితులు ఉన్నాయని.. ఫలితంగా ఇక్కడి ప్రజలు పని కల్చర్ మర్చిపోయారని ఆవేదన వ్యక్తం చేసింది. వ్యవసాయ పనులకు కూలీలు దొరక్క ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను తెచ్చుకోవాల్సి వస్తోందని, ఇలాగే ఉంటే భవిష్యత్తులో 'ఒకప్పుడు మనుషులు పని చేసేవారట' అని మ్యూజియంలో ప్రదర్శనగా పెట్టాల్సి వస్తుందని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. రాజకీయాల కోసం ఒక్క తెల్ల రేషన్ కార్డును కూడా తొలగించే ధైర్యం చేయడం లేదని, ఐఫోన్లు, ఐప్యాడ్లు పట్టుకున్న వారూ ఉచితాల కోసం చూస్తున్నారని తెలిపింది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ఎంతటి కుబేరుడైనా డబ్బులన్నీ అయిపోయి చివరికి పనికి ఆహార పథకం కూలీగా మారక తప్పదని, రేపటి తరం భవిష్యత్తు అత్యంత ప్రమాదంలో పడుతుందని హెచ్చరిస్తూ విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

## జమ్మూ కశ్మీర్‌లో గంటల వ్యవధిలో మళ్లీ భూ ప్రకంపనలు



**శ్రీనగర్, ఆగస్టు13:** జమ్మూ కశ్మీర్ లడఖ్‌లోని లేహ్‌లో మళ్లీ భూ ప్రకంపనలు వచ్చాయి. గురువారం ఉదయం 9.54 గంటలకు భూ ప్రకంపనలు వచ్చాయి. రిక్టర్ స్కేల్‌పై దాని తీవ్రత 4.3గా నమోదయింది. భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సెస్మాలజీ (ఎన్‌సీఎస్) వివరించింది. ఈ భూకంపం వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం కానీ జరగలేదని వెల్లడించింది. అయితే గురువారం ఉదయం 6 గంటలకు భూప్రకంపనలు వచ్చాయని తెలిపింది. దీని తీవ్రత 5.5గా నమోదు అయిందని పేర్కొంది. కేవలం నాలుగు గంటల వ్యవధిలో ఈ భూప్రకంపనలు చోటు చేసుకున్నాయి. దీంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. లడఖ్ తరచూ భూకంపాలు సంభవించే ప్రాంతంగా ఉన్న సంగతి తెలిసిందే.

## మేడిపల్లి ఏసీపీ కార్యాలయంలో సీపీ సుమతి ఆకస్మిక తనిఖీ

**మేడ్చల్:** మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధి మేడిపల్లి ఏసీపీ కార్యాలయాన్ని సీపీ సుమతి ఆకస్మికంగా తనిఖీ చేసారు. సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరణ.. స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఉప్పల్ డీసీపీ సురేష్ కుమార్, ఏసీపీ మోహన్ కుమార్, ఇన్స్పెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. కేసులు, పెండింగ్ దర్యాప్తులు, సిబ్బంది వివరాలు, పోలీస్టేషన్ల సమస్యలపై ఆరాతీసారు. నేరాల నియంత్రణ, శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించి, సమస్యలపై త్వరితగతిన స్పందించాలని సిబ్బందికి సూచించారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు ...

**జిల్లా అదనపు కలెక్టర్ మధు మోహన్**

**జోగులాంబ గద్వాల, ఆగస్టు 13(స్కై న్యూస్):**స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మధు మోహన్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసీ తమ ఛాంబర్ నందు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.గద్వాల పోలీస్ పరేడ్ మైదానంలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుక సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ఆయా శాఖల వారీగా అధికారులకు సూచనలను ఇచ్చారు.ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అట్టహాసంగా వేడుకలు జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు.ముఖ్య అతిథిలు ప్రజాప్రతినిధులు,అధికారులు, ఆహ్వానితులందరికీ ఆహ్వానాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.వేడుకలకు హాజరయ్యే ప్రజాప్రతినిధులు, అధికారులు,ప్రజలకు అవసరమైన సౌకర్యాలు పకడ్బందీగా కల్పించాలన్నారు.పతాకావిష్కరణ కార్యక్రమంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ముందస్తుగా జాగ్రత్తలు



తీసుకోవాలన్నారు.పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ లో వేదిక,సీటింగ్ ఏర్పాట్లను పక్కాగా చేపట్టాలని తహసీల్దార్ కు ఆదేశించారు.వేడుకల ప్రాంగణంలో తాగునీరు,పారిశుద్ధ్య ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు.నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.అత్యవసర పరిస్థితుల్లో తక్షణ చికిత్స అందించేలా వైద్య బృందాన్ని వేడుక వద్ద అందుబాటులో ఉంచాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని ఆదేశించారు. వివిధ సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలుప్రతిబింబించేలా వివిధ శాఖల స్టాళ్లను ఏర్పాటు చేయాలన్నారు.ప్రదర్శన స్టాళ్లను ఆకర్షణీయంగా,వినూత్నంగా ఏర్పాటు చేసిన ఉత్తమ శాఖలకు అవార్డులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా దేశభక్తిని చాటేలా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని విద్యా శాఖ అధికారులకు సూచించారు. జిలాల్లో సమర్ధవంతంగా విధులు నిర్వహించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేయాలన్నారు.ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రోటోకాల్ ను పాటిస్తూ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగ రావు,ఆర్డీవో శ్రీనివాస రావు,కలెక్టరేట్ ఏ.ఓ మంజుల, గద్వాల్ తహసీల్దార్ హరి కృష్ణ, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# గ్రామాలకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలి..

**జోగులాంబ గద్వాల ఆగస్టు 13 (స్టైల్ న్యూస్):** గ్రామాల అవసరాలకు అనుగుణంగా పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి,ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసి తమ ఛాంబర్ నందు 2026--27 ఆర్థిక సంవత్సరానికి జిల్లా పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనపై జిల్లా స్థాయి కార్యాచరణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణాభివృద్ధిని మరింత వేగవంతం చేయడంతో పాటు గ్రామస్థాయిలో సమగ్ర అభివృద్ధిని సాధించేందుకు పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు సమర్థవంతమైన సాధనమని అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు గ్రామాల వాస్తవ అవసరాలను ప్రతిబింబించేలా ఉండాలని స్పష్టం చేశారు.పేదరిక నిర్మూలన, జీవనోపాధి మెరుగుదల, ఆరోగ్యవంతమైన గ్రామాలు, బాలలకు అనుకూల వాతావరణం, నాణ్యమైన విద్య,తాగునీటి సౌకర్యం,పారిశుద్ధ్యం, పచ్చదనం, స్వయం సమృద్ధి మౌలిక



సదుపాయాలు,సామాజిక న్యాయం,సుపరిపాలన,మహిళా సాధికారత వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.తమ శాఖలకు సంబంధించిన గణాంకాలు, భౌతిక,ఆర్థిక ప్రగతి,అవసరాల వివరాలను సకాలంలో అందించి ప్రణాళికల రూపకల్పనకు సహకరించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు,పాఠశాలల మౌలిక వసతుల అభివృద్ధి వంటి ప్రాజెక్టులను ప్రాధాన్యతగా పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల్లో చేర్చాలని సూచించారు.అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి తమ శాఖల పథకాలు, నిధులు,వనరులను సమీకరిస్తూ ఫండ్ కన్వర్జెన్స్ ద్వారా గ్రామాల అవసరాలకు అనుగుణంగా సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలు రూపొందించాలని ఆదేశించారు. గ్రామసభల ద్వారా ప్రజల అభిప్రాయాలను సేకరించి, గ్రామాభివృద్ధికి అవసరమైన పనులను ప్రాధాన్యత క్రమంలో గుర్తించాలని తెలిపారు. రూపొందించే ప్రణాళికలు గ్రామాల సమగ్రాభివృద్ధికి దోహదపడటంతో పాటు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో ఆదర్శంగా నిలవాలని అన్నారు.ప్రతి శాఖ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి నిర్దేశిత గడువులోగా ప్రతిపాదనలు సమర్పించాలని, శాఖల మధ్య సమన్వయంతో నాణ్యమైన జిల్లా పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ నాగేంద్రం, డీఆర్డీఓ ముషాయిదా బేగం, డీపీఓ శ్రీకాంత్, డీడబ్లుఓ సునంద, డియంహెచ్ఓ సంధ్య కిరణ్మయి,మత్స్య శాఖ అధికారి షకీలా భాను, సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలి...



**నాగర్ కర్నూల్ ఆగస్టు 13 (స్కై న్యూస్)** మునిసిపాలిటీ పరిధిలోని రహమత్ నగర్ కాలనీ నక్కల వాగు వద్ద మునసిపాలిటీకి చెందిన పాత బావిని కొందరు కబ్జా చేసేందుకు కూల్చివేశారని దీనిపై చర్యలు తతీసుకోవాలని బిఆర్ఎస్ కౌన్సిలర్ లు డిమాండ్ చేశారు గురువారం మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి వినతిపత్రం సమర్పించారు ఈ సందర్భంగా కౌన్సిలర్లు తిమ్మాజీపేట పాండు అర్జునయ్య గంగాధర్ ను మాట్లాడుతూ ఈనెల తొమ్మిది న కొందరు ఉద్దేశపూర్వకంగా అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా జెసిబి సాయంతో పాత బావిని కూల్చివేశారని దీనివల్ల ప్రభుత్వానికి సుమారు లక్షల పైగా నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. పాత బావి కూల్చివేత వల్ల వర్షపు నీరు కేసరి సముద్రం చెరువులోకి వెళ్లకుండా మూసుకుపోవడం వలన కాలనీ ముంపుకు గురి అయ్యే ప్రమాదం ఉందని వివరించారు. విద్యుత్ ట్రాన్స్ఫర్మర్ సమీపంలో కూల్చివేతలు జరపడం వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిలో అవకాశం ఉందని కూల్చివేతకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోకపోతే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. వెంటనే ప్రభుత్వ స్థలాన్ని కాపాడేందుకు మునిసిపల్ అధికారులు రక్షణ గోడ నిర్మించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో 12వ వార్డు కౌన్సిలర్ ముమ్మడి జయలక్ష్మి నాగేష్ పదవ వార్డు కౌన్సిలర్ జయప్రకాశ్ చారి తదితరులు పాల్గొన్నారు

## హెచ్ఐవి ఎయిడ్స్ పై అవగాహన

**జోగులాంబ గద్వాల, ఆగస్టు 12 ( స్కై న్యూస్):**హెచ్ఐవీ/ఎయిడ్స్ నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకుని,సరైన సమాచారాన్ని సమాజంలోని ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేయాలని అదనపు కలెక్టర్ మధు మోహన్ పిలుపునిచ్చారు.బుధవారం జిల్లా కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఇంటెన్సిఫైడ్ ఐఈసీ కార్యక్రమంలో భాగంగా హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై నిర్వహించిన అవగాహన ర్యాలీని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ప్రారంభించారు. పాత జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ మీదుగా రాజీవ్ చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా క్యూఆర్ కోడ్,బ్రేక్ ఫ్రీ పోస్టర్లను ఆవిష్కరించి, యువతకు హెచ్ఐవీ/ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ "హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై సరైన అవగాహనే నివారణకు మొదటి అడుగని తెలిపారు. వ్యాధిపై ఉన్న అపోహలు, భయాలను తొలగించి ప్రతి ఒక్కరికీ వాస్తవమైన సమాచారం చేరవేయాలన్నారు. హెచ్ఐవీపై అనుమానం ఉన్నవారు ఎలాంటి సంకోచం లేకుండా పరీక్షలు,కౌన్సెలింగ్ మరియు వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. హెచ్ఐవీతో జీవిస్తున్న వారిని వివక్షకు గురిచేయకుండా గౌరవం, మానవతా దృక్పథంతో చూడడం ప్రతి ఒక్కరి సామాజిక




బాధ్యతని పేర్కొన్నారు.ప్రభుత్వం అందిస్తున్న అవగాహన, పరీక్షలు,కౌన్సెలింగ్ మరియు చికిత్సా సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ముఖ్యంగా యువత, విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడం ద్వారా హెచ్ఐవీ నివారణపై సమాజంలో మరింత చైతన్యం తీసుకురావచ్చని తెలిపారు.యువత స్వయంగా అవగాహన పొందడంతో పాటు ఇతరులకు కూడా సరైన సమాచారాన్ని అందించాలని పిలుపునిచ్చారు."అవగాహన పెంచుదాం -- అపోహలను తొలగిద్దాం -- హెచ్ఐవీని నివారిద్దాం" అని అదనపు కలెక్టర్ సందేశమిచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగ రావు,జిల్లా వైద్య శాఖ అధికారి సంధ్య కిరణ్మయి,వైద్య సిబ్బంది,విద్యార్థులు , తదితరులు పాల్గొన్నారు.

## పరేడ్ ప్రాక్టీస్‌ను పరిశీలించిన: అదనపు ఎస్పీ రియాజ్

**నారాయణపేట ఆగస్టు 13: (స్కైన్యూస్)** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వ హించేందుకు నారాయణ పేట జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో కొనసాగుతున్న పరేడ్ ప్రాక్టీస్‌ను అదనపు ఎస్పీ ఎం.డి. రియాజ్ ఉల్ హక్ గురువారం పరిశీలిం చారు.ఆగస్టు 15న నిర్వ హించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా పోలీస్ సిబ్బం దితో నిర్వహిస్తున్న పరేడ్ రిహార్సల్స్‌ను మార్చ్‌పాస్ట్, కవాతు, బ్యాండ్ సమ న్వయం తదితర అంశాల ను అదనపు ఎస్పీ పరిశీ లించారు.పరేడ్‌లో సిబ్బంది క్రమశిక్షణ, సమయపాలన, సమన్వయం, ఏకరూపత పాటించాలని అదనపు ఎస్పీ సూచించారు.ఈ పరేడ్ రిహార్సల్స్ కు ఆర్ఐ విజయ్




భాస్కర్ పరేడ్ కమాండర్ గా నిర్వహిస్తు న్నారు. సిబ్బంది తదిత రులు పాల్గొన్నారు.

## సౌకర్యాల సద్వినియోగంతో భవిష్యత్తులో రాణించాలి...

**నాగర్ కర్నూల్ ఆగస్టు 13( స్కై న్యూస్)** ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించే విద్యార్థులు విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో అన్ని రంగాలలో రాణించాలని లయన్స్ క్లబ్ అధ్యక్షులు అమరేందర్ రెడ్డి మాజీ గవర్నర్ సూరంపల్లి



రాధాకృష్ణ కోరారు గురువారం మున్సిపాలిటీ పరిధిలోని దేశిఇటిక్యాల గ్రామంలో పాఠశాల విద్యార్థులకు డ్రమ్ సెట్ అందించారు ఈ సందర్భంగా సూరంపల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ గతంలో విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ సందర్భంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు క్లబ్ ను అభ్యర్థించడం జరిగిందని అందులో భాగంగానే నేడు పంపిణీ చేశామని వివరించారు. అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమానికి ఆధ్వర్యంలో సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు ఈ కార్యక్రమంలో కార్యదర్శి పరమేశ్వర్ రెడ్డి కోశాధికారి ప్రేమ్ కుమార్ రెడ్డి కేబినెట్ సభ్యులు దొడ్ల రాజవర్ధన్ రెడ్డి తెప్ప శ్రీను మాజీ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి రామకృష్ణారెడ్డి ప్రధానోపాధ్యాయురాలు మంజుల తదితరులు పాల్గొన్నారు

## దివ్యాంగుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత...

**ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి...**

**నాగర్ కర్నూల్ ఆగస్టు 13( స్కైన్యూస్)** రాష్ట్రంలో ప్రజా పాలన కొనసాగిస్తున్న ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి తెలిపారు గురువారం మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేసిన సదరం మూల్యాంకన కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు సందర్భంగా ఆయన




మాట్లాడుతూ దివ్యాంగులకు వైకల్య నిర్ధారణ ప్రక్రియను మరింత సులభతరం చేసి ఆదుకునేందుకు ఈ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. దివ్యాంగులకు ప్రభుత్వం ఉచితంగా పరికరాలను అందిస్తున్నట్లు అర్హులైన వారంతా వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులను మంజూరు చేసి అన్ని విధాల ఆదుకుంటున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు మునిసిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్ కౌన్సిలర్లు అలివేలమ్మ పడిగే శంకర్ తో పాటు అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

## క్రీడలతో మానసిక ఒత్తిడిని అదిగామించాలి...

**సిబ్బంది సంక్షేమానికి ప్రత్యేక దృష్టి**

**నాగర్ కర్నూల్ ఆగస్టు 13 (స్కై న్యూస్)** నిరంతరం విది నిర్వహణలో ప్రజల రక్షణ కోసం పనిచేస్తున్న పోలీసు సిబ్బంది క్రీడల ద్వారా మానసిక ఒత్తిడిని అదగమించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ సూచించారు గురువారం నూతనంగా నిర్మించిన బ్యాట్మెంటన్ కోర్టును ప్రారంభించారు ఈ



సందర్భంగా వారు మాట్లాడుతూ నిరంతరం ఇది నిర్వహణ ద్వారా ఆరోగ్యం దెబ్బతినడమే



కాకుండా మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ప్రతి ఒక్కరూ కొంత సమయం ఆరోగ్యం పై దృష్టి సారించి వివిధ క్రీడలలో రాణించాలని కోరారు. పోలీసు సిబ్బంది సంక్షేమం మరియు ఆరోగ్యం కోసం ప్రత్యేక దృష్టి సారించి పని చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు డీఎస్పీ బుర్రి శ్రీనివాస్ యాదవ్ సిఐ అశోక్ రెడ్డి ఆర్ ఐ లు జగన్ రాఘవరావు ఆర్ఎస్ఐ లు ప్రశాంత్ గౌస్ భాష శివాజీ ఎస్సైలు శంషుద్దీన్ వెంకటరెడ్డి పోలీసులు పాల్గొన్నారు

## మాతా శిశు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో... ఘనంగా హర్ ఘర్ తిరంగా

**నారాయణపేట ఆగస్టు 13: (స్కైన్యూస్)** నారాయణపేట జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వ ర్యంలో గురువారంసాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల లో ఘనంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథితిగా జిల్లా సంక్షేమ




అధికారి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేందర్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ జాతీయ జెండా మన దేశా నికి గర్వకారణమని, దేశం కోసం తమ వంతు ఉత్తమ సేవలు అందించేందుకు ఇది నిరంతరం స్ఫూర్తిని స్తుందని ఆయన పేర్కొ న్నారు. ప్రతి ఒక్కరూ ఈ ఉద్యమంలో భాగస్వాము లు కావాలని, 'వికసిత్ భారత్' నిర్మాణంలో మన మందరం కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మహనీ యుల త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకో వాలని, వారి ఆశయ సాధ నకు విద్యార్థులు కృషి చేయాలని కోరారు. జాతీ య జెండాతో దిగిన సెల్ఫీలను హర్ గర్ తిరంగా అధికారిక వెబ్‌సైట్‌లో అప్ లోడ్ చేసి, సర్టిఫికెట్లు పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ యాదమ్మ, మేరా యువ భారత్ జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ అనిల్ గౌడ్, జిల్లా మహిళా సాధికారత కేంద్రం జిల్లా సమన్వయకర్త నర్సిములు, జెండర్ స్పెసి లిస్టులు అనిత, నర్సిము లు , అధ్యాపక బృం దం,నాన్-టీచింగ్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

వార్తాతరంగాలు
శుక్రవారం 14 ఆగస్టు 2026

## అమర జవాన్ నీరటి చంద్రశేఖర్‌కు కొందుర్గు బీజేపీ నాయకుల ఘన నివాళి



**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 13 (స్కై న్యూస్):** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు కొందుర్గు బీజేపీ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో తంగేళ్లపల్లి, తిరుమనీ దేవునిపల్లి గ్రామాల్లో అమర జవాన్ నీరటి చంద్రశేఖర్ విగ్రహాలకు పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ దేశ రక్షణ కోసం చంద్రశేఖర్ చేసిన త్యాగం చిరస్మరణీయమని, ఆయన సేవలు దేశ ప్రజలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. అమర జవాన్ కుటుంబానికి ప్రభుత్వం మరింత అండగా నిలవాలని డిమాండ్ చేశారు. ఆయన భార్యకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించడంతో పాటు కుటుంబానికి భూమి, పిల్లల భవిష్యత్తుకు ఆర్థిక భరోసా కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ కొందుర్గు మండల అధ్యక్షుడు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కక్కునూరు వెంకటేష్ గుప్తా, మాజీ మండల అధ్యక్షుడు బలవంత్ రెడ్డి, కొమరబండ శ్రీశైలం, సర్పంచ్ బోయ అశోక్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్ 18వ వార్డులో రూ.80 లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం



**రంగా జిల్లా ఆగస్టు 13 (స్కై న్యూస్):** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ మున్సిపాలిటీ 18వ వార్డులో రూ.80 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, స్థానిక కౌన్సిలర్లతో కలిసి శంకుస్థాపన చేశారు. కీర్తి అపార్ట్‌మెంట్ సమీపంలో పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే మున్సిపల్ పాలకవర్గం ప్రధాన లక్ష్యమన్నారు. డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, సీనియర్ నాయకుడు చెంది తిరుపతి రెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పట్టా భూములను 22.1(ఏ) నిషేధిత జాబితాలో చేర్చడంపై రైతుల ఆగ్రహం..

### వెంటనే తొలగించి న్యాయం చేయాలని డిమాండ్!



**జోగులాంబ గద్వాల, ఆగస్టు 13(స్కై న్యూస్):** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం ఎద్దులగూడెం గ్రామ శివారులోని తమ పట్టా భూములను 22.1(ఏ) నిషేధిత జాబితాలో చేర్చడం తమకు తీవ్ర అన్యాయమని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ శివారులోని సర్వే నంబర్లు 20, 28, 93, 94లోని పట్టా భూములను 22.1(ఏ) నిషేధిత జాబితాలో చేర్చడంతో భూముల క్రయవిక్రయాలు, ఇతర అవసరాల విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. పట్టా భూములను నిషేధిత జాబితాలో చేర్చడానికి గల కారణాలను అధికారులు స్పష్టం చేయాలని కోరుతున్నారు. 22.1(ఏ) నిషేధిత జాబితా నుంచి తమ పట్టా భూములను వెంటనే తొలగించి, రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించి న్యాయం చేయాలని గ్రామస్థులు సంబంధిత అధికారులను డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశంపై అధికారులు తక్షణమే విచారణ చేపట్టి, అర్హులైన రైతులకు న్యాయం చేయాలని ఆర్డీవో కార్యాలయం ఏ వో కు వినతి పత్రం సమర్పించారు.

## 2లక్ష 50వేలు రూపాయల LOC లెటర్ ను అందజేసిన ఎమ్మెల్యే



**జోగులాంబ గద్వాల, ఆగస్టు 13(స్కై న్యూస్):** గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు గద్వాల టౌన్ 27వ వార్డ్ షేరెల్లి వీధీ చెందిన సత్యమ్మ లక్ష్మన్న మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరు అయిన 2లక్ష 50వేలు రూపాయల గాూజ లెటర్ ను లిగద్వాల ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి గారి చేతుల మీదుగా అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గోవిందు, మాజీ ఎంపీపీ రాజారెడ్డి, జిల్లా సీనియర్ నాయకులు బండ్ల రాజశేఖర్ రెడ్డి నాయకులు వినోద్, షాషా, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 4లక్ష రూపాయల LOC లెటర్ ను అందజేసిన ఎమ్మెల్యే



ఈరోజు గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు గద్వాల మండలం పరిధిలోని సంగాల గ్రామానికి చెందిన టి. భారతి w/0 టి. సవారన్న మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరు అయిన 4లక్ష రూపాయల గాూజ లెటర్ ను లిగద్వాల ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి గారి చేతుల మీదుగా అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో నాయుకులు జగదీశ్వర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, మద్దిలేటి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహ రహిత జిల్లాగా నారాయణపేట...







**బాల్య వివాహాల నివారణలో మత పెద్దల పాత్ర కీలకం**

**సమాచారం అందిస్తే తక్షణ చర్యలు.**

**జిల్లా కలెక్టర్ ప్రియాంక**

**నారాయణపేట ఆగస్టు 13: (స్కైన్యూస్)** నారాయణపేట జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక పిలు పునిచ్చారు. శ్రావణ మాసం లో వివాహ ముహూర్తాలు ప్రారంభం కానున్న నేపథ్యం లో గురువారం మహిళా భివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నియోజక వర్గంలోని పూజారులు, పాస్టర్లు, ఖ్వాజీలకు బాల్య వివాహాల నిర్మూలనపై ఇక్కడి సింగారం మలుపు దారి వద్ద గల వృత్తి నైపు ణ్య అభివృద్ధి కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్య క్రమంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహం ఒక సామాజిక రుగ్మత మాత్రమే కాకుండా చట్టవిరుద్ధమైన చర్య అని స్పష్టం చేశారు. 18 సంవత్సరాలు నిండని బాలికకు వివాహం చేయ డం వల్ల ఆమె విద్య, ఆరో గ్యం, భవిష్యత్తుపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడు తుందని తెలిపారు.

**మత పెద్దల పాత్ర కీలకం**

పూజారులు, మౌలానాలు, పాస్టర్లు, ఖాజీలు వివాహ కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషిస్తారని, సమాజంలో వారి మాటకు ఎంతో గౌర వం, విశ్వాసం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. బాల్య వివాహం నిర్వహించేందుకు ఎవరైనా సంప్రదించిన ప్పుడు, వివాహానికి అను మతి ఇవ్వకుండా "ఇది సరైన వయసు కాదు.. వివాహాన్ని వాయిదా వేయండి" అని స్పష్టంగా చెప్పాలని కోరారు. తమ పరిధిలో బాల్య వివాహం జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందిం చాలని మత పెద్దలకు సూచించారు. చట్టంపై విస్తృ త అవగాహనజిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దే ప్రక్రియలో భాగంగా ఇప్పటికే సర్పంచు లు, చైల్డ్ మ్యారేజ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లు, ఆర్డీఓలు, తహ సీల్దార్లు, పంచాయతీ కార్య దర్శులకు అవగాహన, శిక్ష ణ కార్యక్రమాలు నిర్వహిం చినట్లు కలెక్టర్ తెలిపారు. మక్తల్, కొడంగల్, కోస్గి తది తర ప్రాంతాల్లో కూడా బాల్య వివాహాల నివార ణపై మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించ నున్నట్లు వెల్లడించారు. కారణాలు చూపడం సమ ర్థనీయం కాదుకుటుంబ ఒత్తిడి, ప్రేమ వ్యవహారం, సామాజిక పరిస్థితులు తదితర కారణాలను బాల్య వివాహాలకు చూపుతు న్నప్పటికీ, ఏ కారణంకూడా చట్టాన్ని ఉల్లంఘించడానికి సమర్థన కాదని కలెక్టర్ స్పష్టం చేశారు. బాల్య వివా హాల వల్ల బాలికలు చిన్న వయసులోనే గర్భధారణ, రక్తహీనత, ఇతర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొనే అవ కాశం ఉందన్నారు. చదువు మధ్యలోనే ఆగిపోయి భవి ష్యత్తులో విద్య, ఉపాధి అవకాశాలను కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ఇటీవల కోటకొం డ పీహెచ్‌సీ సందర్శన సందర్భంగా కవలలకు గర్భవతిగా ఉన్న యువ తిని గుర్తించి, తీవ్ర రక్తహీన తతో బాధపడుతున్న ఆమెకు వెంటనే వైద్య సేవలు అందించి మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రికి తరలించిన విషయాన్ని కలెక్టర్ ప్రస్తావించారు. బాలికలకు చిన్న వయసు లో వివాహం చేయడం వల్ల వారి విద్య, ఉపాధి, ఆరో గ్యం, ఆత్మవిశ్వాసం వంటి అంశాలపై ప్రతికూల ప్రభా వం పడుతుందని కలెక్టర్ అన్నారు. "ఒక బాలికకు బాల్యం కావాలి.. చదువు కావాలి.. ఆరోగ్యం కావాలి.. తన భవిష్యత్తును తానే నిర్ణయించుకునే అవకాశం కావాలి" అని పేర్కొన్నారు. బాల్య వివాహాలను అరిక ట్టడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. సమాచారం అందిస్తే తక్షణ చర్యలుజిల్లాలో ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతు న్నట్లు తెలిసిన వెంటనే సంబంధిత తహసీల్దార్, సీడీపీఓ లేదా చైల్డ్ మ్యారేజ్ ప్రొటెక్షన్ అధికారులకు సమాచారం అందించాలని కలెక్టర్ సూచించారు. వయస్సు ధృవీకరణ పత్రా లు, ఆధార్ తదితర వివరా లపై అనుమానాలు ఉన్న ప్పుడు వెంటనే అధికారుల ను సంప్రదించాలని తెలి పారు. బాల్య వివాహాల విషయంలో ఎవరైనా ఒత్తిడి తీసుకువచ్చినా, ఎలాంటి రాజకీయ లేదా ఇతర జోక్యాలకు తలొగ్గ కుండా చట్ట ప్రకారం చర్య లు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. శ్రావణ మాసంలో జిల్లాలో జరిగే వివాహాలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, సీడీపీఓల ద్వారా వివాహాలకు సంబం ధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించి, అనుమానాస్పద సందర్భా ల్లో తక్షణమే పరిశీలన చేపట్టాలని ఆదేశించారు. రాబోయే రోజుల్లో జిల్లాలో ని అన్ని ప్రాంతాల ప్రతిని ధులతో మరోసారి సమా వేశం నిర్వహించి బాల్య వివాహాల నివారణకు తీసు కుంటున్న చర్యలను సమీ క్షించనున్నట్లు తెలిపారు. "బాల్య వివాహాలకు స్వస్తి -- బాలికల భవిష్యత్తుకు భరోసా -- బాల్య వివాహ రహిత నారాయణపేట జిల్లా" అనే లక్ష్యంతో అంద రూ కలిసికట్టుగా పనిచే యాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

**బాల్య వివాహాల నిర్మూలనకు మత పెద్దలు సహకరించాలి**

నారాయణపేట జిల్లాలో బాల్య వివాహాల నిర్మూల నకు పూజారులు, పురోహి తులు, ఖాజీలు, పాస్టర్లు, మత పెద్దలు, తల్లిదండ్రు లు, ప్రజా ప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ కోరారు. వివాహం ఒక పవిత్రమైన కార్యక్రమమని, అయితే బాల్య వివాహం మాత్రం చట్టవిరుద్ధమైనదని స్పష్టం చేశారు. కాలానుగుణంగా సమాజంలో మార్పులు వస్తున్నాయని, ప్రస్తుతం బాలల హక్కులు, విద్య, ఆరోగ్యం, భద్రతకు అత్యం త ప్రాధాన్యత ఇస్తున్నా మని తెలిపారు. బాల్య వివాహాల కారణంగా బాలికల విద్య మధ్యలోనే ఆగిపోవడంతో పాటు రక్తహీనత, చిన్న వయ సులో గర్భధారణ, ప్రసవ సమయంలో సమస్యలు వంటి అనేక ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. ఒక బాలికకు 18 సంవత్స రాలు పూర్తయ్యే వరకు తల్లిదండ్రులు ఆమెకు సంర క్షకులుగా ఉండి, చదువు, ఆరోగ్యం, భద్రత, భవిష్య త్తుపై దృష్టి పెట్టాలని సూచించారు. వివాహ ముహూర్తం నిర్ణయించే సమయంలో జాతకం, గుణమేళనం వంటి అంశా లను ఏ విధంగా పరిశీలి స్తారో, అదే విధంగా వధూవ రుల వయస్సును కూడా అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించాలని పూజారు లు, పురోహితులు, మత పెద్దలను ఎస్పీ కోరారు. 18 సంవత్సరాలు పూర్తికా ని బాలిక వివాహానికి అంగీ కరించకూడదని, వయస్సు పై అనుమానం ఉంటే వివాహాన్ని నిర్వహించకుం డా సంబంధిత అధికారుల కు సమాచారం అందించాల ని సూచించారు. ఆధార్ లేదా ఇతర ధృవపత్రాల్లో అనుమానాస్పద వివరాలు ఉన్నా, తప్పుడు ధృవప త్రాలు సమర్పించినా వాటి ని ఆధారంగా చేసుకుని వివాహం నిర్వహించకుండా పోలీస్ అధికారులు, సీడీ పీఓలకు సమాచారం ఇవ్వా లని తెలిపారు. బాల్య వివా హాన్ని నిర్వహించే వ్యక్తులు కూడా చట్టపరమైన చర్యల కు బాధ్యులవుతారని, బాల్య వివాహ నిషేధ చట్టంలోని నిబంధనలను ప్రతి పూజారి, పురోహితు డు, ఖాజీ, పాస్టర్, మత పెద్ద తప్పనిసరిగా తెలుసు కోవాలని సూచించారు. తల్లిదండ్రులు, బంధువులు లేదా ఇతరుల నుంచిబాల్య వివాహం నిర్వహించాలనే ఒత్తిడి వచ్చినప్పుడు, "18 సంవత్సరాలు పూర్తికాకుం డా వివాహం నిర్వహించ డం చట్టవిరుద్ధం" అనే విషయాన్ని స్పష్టంగా తెలియజేసి, చట్టాన్ని రక్షణగాఉపయోగించుకోవాలని సూచించారు. సమా జంలో పూజారులు, పురోహితులు, ఖాజీలు, పాస్టర్లు, మత పెద్దలకు ప్రజల్లో ప్రత్యేకమైన గౌర వం, విశ్వాసం ఉందని, వారి మాటలను ప్రజలు శ్రద్ధగా వింటారని ఎస్పీ తెలిపారు. అందువల్ల వివాహానికి వచ్చే తల్లి దండ్రులకు బాలిక విద్య, ఆరోగ్యం, భవిష్యత్తు ప్రాధాన్యతను వివరించి, బాల్య వివాహాల నిరోధంలో వారు ముందుండాలని కోరారు. శీఘ్రమే పుత్రప్రాప్తి రస్తు" అనే దీవెనతో పాటు "విద్యా ప్రాప్తిరస్తు, ఉద్యోగ ప్రాప్తిరస్తు" అని ఆశీర్వదిం చాలని ఎస్పీ సూచించారు. బాలికలకు కేవలం వివాహ మే జీవిత లక్ష్యంగా కాకుం డా విద్య, ఉద్యోగం, స్వయం సమృద్ధి, మంచి భవిష్యత్తు లక్ష్యాలుగా ఉండేలా సమాజం ప్రోత్స హించాలన్నారు. బాల్య వివాహం జరుగుతోందని తెలిసిన వెంటనే సంబంధి త అధికారులకు సమాచా రం అందించాలని సూచిం చారు. వయస్సుపై అను మానం ఉన్న సందర్భాల్లో స్వయంగా నిర్ణయం తీసుకోకుండా పోలీస్ శాఖ, సీడీపీఓ లేదా సంబంధిత అధికారులను సంప్రదించా లని తెలిపారు. బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించి నారాయణ పేట జిల్లాను బాల్య వివా హ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం" అని ఎస్పీ పిలుపునిచ్చారు. "బాలికకు మంచి విద్య అందాలి.. మంచి ఉద్యోగం రావాలి.. తన కాళ్లపై తాను నిలబ డాలి.. అదే మనందరి ఆశీర్వాదం కావాలి" అని పేర్కొన్నారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలన కు అవగాహన కల్పిస్తూ ముద్రించిన బ్రోచర్లను ఎస్పీ తో కలసి కలెక్టర్ ఆవిష్క రించారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూఓ రాజేందర్ గౌడ్, డీపీఆర్ఓ రషీద్, డీసీపీఓ కరిష్మా, చైల్డ్‌లైన్ తిరుపతయ్య, సీడీపీఓలు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

# దేశ ఐక్యత కోసమే హర్ ఘర్ తిరంగా యాత్ర...

**త్యాగాలను మరించుకోవడం బాధ్యత**

**నాగర్ కర్నూల్ ఆగస్టు 13( స్కైన్యూస్)** దేశ ఐక్యతను పెంపొందించడంతోపాటు స్వాతంత్రోద్యమంలో మహనీయులు చేసిన త్యాగాలను నాయకులు వివరించారు గురువారం పట్టణంలో జాతీయ జెండాలతో హర్ ఘర్ తిరంగా ర్యాలీని మార్కెట్ యార్డు లోని శివాలయం నుండి ప్రారంభించారు ఈ సందర్భంగా వేముల నరేందర్ రావు నాయకత్వంలో వేలాదిమంది విద్యార్థులు యువత పార్టీ నాయకులు కార్యకర్తలు శోభాయాత్ర నిర్వహించారు అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షులు నరేందర్ రావు రాష్ట్ర కార్యదర్శి భరత్ ప్రసాద్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రశీ గౌడ్ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పద్మా



యాదవ్ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు భూషయ్య బీజేవైఎం జిల్లా అధ్యక్షులు నరేష్ చారి తో పాటు పలువురు మాట్లాడుతూ దేశ ప్రగతి కోసం మరియు జాతీయ భావనను ప్రతి ఒక్కరిలో కల్పించేందుకు ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకుని కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. దేశాన్ని ఐక్యంగా ఉంచే శక్తి త్రివర్ణ పథకానికి ఉందని అన్నారు ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చెవ్వా ప్రమోద్ కుమార్ మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి చంద్రకళ ఓబీసీ మూర్చ జిల్లా అధ్యక్షులు జట్టు వెంకటేష్ మహిళా మోర్చా రాష్ట్ర నాయకురాలు బల్మూరు జానకి మాజీ జిల్లా ఉపాధ్యక్షులు పోల్దాస్ రాము కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ రెడ్డి యువమోర్చా రాష్ట్ర నాయకులు విజయేందర్ రెడ్డి ప్రవీణ్ వెంకటేష్ సత్యనారాయణ ఏబీవీపీ నాయకులు శాంతన్ శివ వెంకటేష్ తో పాటు పలువురు పాల్గొన్నారు

# ఘనంగా హర్ ఘర్ తిరంగా...ఐక్యతను చాటుదాం

**బిజెపి నేత నాగురావు నామాజీ**

**నారాయణపేట ఆగస్టు 13: (స్కైన్యూస్)** ఘర్ ఘర్ తిరంగా హర్ ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చిన సందర్భంగా గురువారం నారాయణపేటలోని తన నివాసంపై బిజెపి రాష్ట్ర సీనియర్ నేత రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజీ జాతీయ జెండాను ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం స్వతంత్ర ఉద్యమం నాటికి దేశంలో దాదాపు 10 కోట్ల మంది భారతీయులు తమ తమ ఇళ్లపై 15 ఆగస్టు నాడు మరి అంతకు ముందు మూడు రోజులు జాతీయ జెండాను ఆవిష్కరించి కేంద్ర ప్రభుత్వానికి అండగా నిలబడ్డరని అన్నారు. ఆ పిలుపుకు కొనసాగింపుగా ఈ సంవత్సరము ""1942 ఆగస్టు 9న జరిగిన క్విట్



ఇండియా ఉద్యమం"" స్ఫూర్తితో ఆగస్టు 9 నుండి 17 ఆగస్టు వరకు దేశవ్యా ప్తంగా ప్రతి ఊరిలో ప్రతి ఇంటి పై భారత జాతీయ జెండాను ఎగురవేసి జాతీ య స్ఫూర్తిని పెంపొందించా లని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో ఆగస్టు 10వ తేదీ నుండి 15 ఆగస్టు వరకు ప్రతి ఒక్కరూ ఈ "" ఆపూర్వ జెండా ప్రతి ఇంటి పై జెండా"" ఎగరాలని కోరారు. ఇదే స్ఫూర్తితో నారాయణపేట జిల్లా కేంద్రంతో పాటు ప్రతి పల్లెలో ప్రతి ఇంటి పైన జెండాను ఎగుర వేయవల సిందిగా భారతీయులం దరినీ కోరినారు. ఈ పిలుపును అమలు చేసి దేశద్రోహుల ఆట కట్టివే యాలని ప్రతి ఒక్కరిలో జాతీయ జెండాపై భక్తిని పెంచాలని దేశభక్తిని రగి లించాలని జాతి పునర్ నిర్మాణంలో భాగస్వా ములు కావాలని రాజకీ యాలకు అతీతంగా ప్రతి భారతీయుడు ఈ స్వాతం త్ర దినోత్సవ శుభాకాంక్షలు జాతీయ జెండాలు ఎగుర వేసి మరొకసారి దేశభక్తి, ఐక్యతను చాటుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ అదనపు న్యాయవాది నందు నామాజీ,బిజెపి నాయకులు హనుమంతురావు,కుమార్,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఏడాది నిండని పసికందులాంటి కార్పొరేషన్ ను చిదిమేయకండి

**కొత్తగూడెం కార్పొరేషన్ అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కు అర్హత సాధించిపెట్టా**

**డిపిఆర్ టెండర్లలో పూర్తి పారదర్శకత పాటిస్తాం**

**విమర్శల నివృత్తికే ఆన్‌లైన్ టెండర్లకు ఆదేశం**

**రూ.9.60 కోట్ల అవినీతి ప్రచారం అబద్ధం**

**అబద్ధపు ప్రచారంతో ప్రజల్లో అనుమానాలు సృష్టించొద్దు**

**అవినీతి అక్రమాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు తప్పవు**

**కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు**





**కొత్తగూడెం ఆగస్ట్ 13( స్కై న్యూస్)** :అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ద్వారా నిధులు వెచ్చించి పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని, ఆయా పనులకు సంబంధించిన డిపిఆర్ తయారీ టెండర్లలో పూర్తి పారదర్శకత పాటిస్తున్నామని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. కొత్తగూడెం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిధులు మంజూరు కానున్నాయని, పనుల అంచనాల ప్రకారమే కేంద్ర గ్రాంట్లు, రాష్ట్ర వాటా మరియు బ్యాంకుల రుణాల ద్వారా నిధుల సమీకరణ జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ పథకం కింద దేశవ్యాప్తంగా లక్ష కోట్ల కేంద్ర సహాయంతోపాటు 25 శాతం కేంద్రం, 25 శాతం రాష్ట్రం, 50 శాతం బ్యాంకు రుణం ఉంటుందని, ఇందులో భాగమైన 26 మున్సిపాలిటీల్లో ఖమ్మం కార్పొరేషన్‌కు రూ.2,670 కోట్ల రుణం వస్తుండగా, కొత్తగూడెం కార్పొరేషన్‌కు రూ.600 కోట్ల రుణం అడిగామని వివరించారు. అభివృద్ధి పనుల నిధులపై కాకుండా కేవలం 'వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక టెండర్'కు సంబంధించి కొందరు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఎమ్మెల్యే కూనంనేని మండిపడ్డారు. రూ.600 కోట్ల అంచనా పనులకు 1.6 శాతం చొప్పున డిపిఆర్ టెండర్ ఒప్పందం కుదిరితే, అందులో ఏకంగా రూ.9.60 కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించడం వారి అజ్ఞానానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో నల్గొండలో 1.6 శాతం, మహబూబ్‌నగర్‌లో రూ.1,000 కోట్ల పనులకు 1.5 శాతంతో ఇలాగే డిపిఆర్ ఒప్పందాలు కుదిరాయని గుర్తుచేశారు. ఇతర పట్టణాలు, మున్సిపాలిటీల్లోనూ ఇదే విధానంలో టెండర్లు జారీ అయినప్పుడు లేని అవినీతి కేవలం కొత్తగూడెంలోనే ఎలా జరుగుతుందని, అక్కడ కూడా అవినీతి జరిగినట్లేనా అని నిలదీశారు. ఆరు నెలల పసిపిల్ల లాంటి కొత్తగూడెం కార్పొరేషన్‌ను పురిటిలోనే చంపాలని కుట్రలు చేస్తున్నారని, అసలు నిధులే విడుదల కాకుండా డిపిఆర్ ఫీజులో కోట్ల రూపాయల అవినీతి ఎలా జరుగుతుందో చెప్పాలన్నారు. కొందరు పనిగట్టుకొని ప్రజల్లో అపోహలు సృష్టించారని, ప్రజల్లో ఉన్న సందేహాలు, అపోహలను నివృత్తి చేయడానికి ఆఫ్‌లైన్ డిపిఆర్ విధానాన్ని రద్దు చేసి ఆన్‌లైన్ టెండర్లకు ఆదేశాలు ఇచ్చామని స్పష్టం చేశారు. డిపిఆర్ శాతాన్ని 0.5 శాతానికి లేదా మరింత తగ్గించే సామర్థ్యం ఉన్నవారు ఆన్‌లైన్ టెండర్లలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. చుంచుపల్లి ఉమ్మడి పంచాయతీ 45 ఏళ్లుగా సీపీఐ అధీనంలోనే ఉందని, ప్రజాదరణ లేకపోతే తాము ఎన్నికల్లో గెలుస్తామా అని ప్రశ్నించారు. గతంలో ప్రపంచ బ్యాంకు రుణం (టీఎండీపీ) విధానాన్ని వ్యతిరేకించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రజాప్రతినిధులు లేదా అధికారులు ఎవరైనా తప్పులకు పాల్పడినా, పేదలను మోసం చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని, అనవసర ఆరోపణలు చేస్తే వెంటాడతామని హెచ్చరించారు. పట్టణంలో రోడ్లు, డ్రైనేజీలు, విద్యా సంస్థలు, క్రీడా ప్రాంగణాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ఆయన వివరించారు. విలేకర్ల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య, నాయకులు ఎండి యూసుఫ్, మునిగడప వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు వీసంశెట్టి విశ్వేశ్వరావు, మునిగడప పద్మ, బోయిన విజయ్ కుమార్, గడ్డం శాంతిప్రియ, గడ్డం వెంకటేశ్వర్రావు, నామా కీర్తి, కూరపాటి సుధాకర్, బండి నర్సింహా, ధనలక్ష్మి, దుర్గయ్య, కళావతి, శ్యామల, మంద నాగమణి, మద్దాల హరిత, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## కొందుర్గ్ మండల పరిషత్ నిధుల అక్రమ విత్‌డ్రాలపై విచారణ జరపాలి

**ఎంఆర్‌పీఎస్ కొందుర్గ్ మండల అధ్యక్షులు ఆనేగాళ్ల ఆనంద్ మాదిగ డిమాండ్**



రంగారెడ్డి జిల్లా, ఆగస్టు **13 (స్కై న్యూస్):** కొందుర్గ్ మండల ప్రజా పరిషత్‌లో ప్రభుత్వ నిధుల విత్‌డ్రాలపై సమగ్ర విచారణ చేపట్టాలని ఎంఆర్‌పీఎస్ కొందుర్గ్ మండల అధ్యక్షులు ఆనేగాళ్ల ఆనంద్ మాదిగ డిమాండ్ చేశారు. ఈ వ్యవహారానికి సంబంధించి పలు ఆడియోలను ఆయన విడుదల చేయడం మండలంలో చర్చనీయాంశంగా మారింది. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం కేటాయించిన నిధులను ప్రైవేట్ వ్యక్తుల ద్వారా, డ్రైవర్ పేరుతో సైతం విత్‌డ్రా చేసినట్లు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని ఆనంద్ మాదిగ ఆరోపించారు. ప్రభుత్వ నిధులను నిబంధనలకు విరుద్ధంగా విత్‌డ్రా చేసి ఉంటే ఇది తీవ్రమైన విషయమని పేర్కొన్నారు. నిధులు ఎవరి ద్వారా విత్‌డ్రా చేశారు? ఏ అవసరాలకు ఖర్చు చేశారు? నిబంధనలు పాటించారా? అనే అంశాలపై ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత అధికారులు, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజా సంక్షేమానికి కేటాయించిన నిధుల వినియోగంలో పూర్తి పారదర్శకత పాటించాలని, ప్రజా సొమ్ము దుర్వినియోగం కాకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆనేగాళ్ల ఆనంద్ మాదిగ విజ్ఞప్తి చేశారు.

## ప్రమాదానికి గురైన శంకరయ్యను పరామర్శించిన బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్



**రంగారెడ్డి జిల్లా ఆగస్టు 13 (స్కై న్యూస్):** రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం అల్వాల గ్రామానికి చెందిన కాకునూరు శంకరయ్య ఇటీవల ప్రమాదానికి గురై శంషాబాద్‌లోని ట్రైడెంట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ ఆసుపత్రికి వెళ్లి శంకరయ్యను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. అనంతరం వైద్యులతో మాట్లాడి శంకరయ్యకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. శంకరయ్య త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి తిరిగి రావాలని రవీందర్ యాదవ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వారిలో స్థానిక మాజీ సర్పంచ్ తిరుమల్రెడ్డి శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

## శ్రీ రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలలో స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే జి ఎం ఆర్ దంపతులు



**దేవరకద్ర ఆగస్టు 13 (స్కై న్యూస్);** దేవరకద్ర మండలం వెంకటయ్యపల్లి గ్రామంలో గురువారం శ్రీ రంగనాయక స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో సతీ సమేతంగా పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి, స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి అనంతరం దేవాలయం పైకి వెళ్లేందుకు సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. శ్రీ. ఆంజనేయస్వామి దేవాలయం వద్ద నూతన షెడ్డు ను ప్రారంభించిన ఎమ్మెల్యే తదనంతరం జీకే మాస్టర్ షోటోకాన్ కరాటే డు – ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే బెల్ట్ ప్రధానోత్సవ కార్యక్రమంలో పాల్గొని, కరాటేలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కరాటే బెల్టులను పంపిణీ చేసి వారిని అభినందించిన ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి

# అభివృద్ధి పనులకు భూమిపూజ





**జగిత్యాల జిల్లా,రాయికల్, ఆగష్టు 13,(వార్త తరంగాలు ):**–జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని అల్లీపూర్ గ్రామంలో రూ.22.50 లక్షల విలువైన పలు అభివృద్ధి పనులకు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ భూమిపూజ చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూ.3.50 లక్షలతో ప్రహరీ గోడ, రూ.5 లక్షలతో కిచెన్ షెడ్, రూ.4 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణ పనులకు, గ్రామంలో రూ.6 లక్షలతో సీసీ రోడ్డు, రూ.4 లక్షలతో అంగన్వాడీ భవన మరమ్మతు పనులకు శంకుస్థాపన చేశారు.అల్లీపూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు రాష్ట్రస్థాయి యోగాసన, అథ్లెటిక్స్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఎమ్మెల్యే వారిని అభినందించారు. కిష్టంపేట మాజీ సర్పంచ్ తంగేళ్ల రమేష్ తండ్రి స్మారకార్థం రాయికల్ లయన్స్ క్లబ్‌కు ఎమ్మెల్యే చేతుల మీదుగా ఫ్రీజర్ అందజేశారు.అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

**57 మంది లబ్ధిదారులకు రూ.18.60 లక్షల చెక్కులు**

రాయికల్ పట్టణ, మండలానికి చెందిన 57 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.18 లక్షల 60 వేల విలువైన చెక్కులను రాయికల్ గుడేటి రెడ్డి సంఘంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి, సర్పంచ్ గౌతమి వెంకటేష్, ఫాక్స్ ఛైర్మన్ రాజలింగం, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రవీంధర్ రావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. ముఖీధ్, జిల్లా కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు సురేంధర్ నాయక్, మాజీ ఉపసర్పంచ్ సాగర్ రావు, గ్రామ, మండల నాయకులు, సర్పంచులు, అధికారులు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబాన్ని పరామర్శించిన జీవన్‌రెడ్డి



**జగిత్యాల జిల్లా,రాయికల్, ఆగష్టు 13(వార్త తరంగాలు ):** జగిత్యాల జిల్లా రాయికల్ మండలం మహితాపూర్ గ్రామానికి చెందిన దుమాల రవి (35) అనారోగ్యంతో జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు . విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి గురువారం కుటుంబాన్ని పరామర్శించారు. ఇల్లు లేక శ్మశానవాటికలో కర్మకాండలు నిర్వహిస్తున్న విషయం తెలుసుకుని చలించిపోయి ఆర్థిక సాయం అందించారు.ఈ సందర్భంగా రవి భార్యకు చేయూత పథకం కింద వితంతు పింఛన్, కుటుంబానికి ఇల్లు మంజూరు చేయించాలని జీవన్‌రెడ్డి సూచించారు. పిల్లల విద్యకు అవసరమైన సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమం లో రాయికల్ మున్సిపల్ ఛైర్మెన్ కటుకం రవీంధర్, మాజీ జెడ్పిటీసి గోపి మాధవి రాజారెడ్డి,రాయికల్ మండల బిఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు బర్కం మల్లేశం,రాయికల్ పట్టణ అధ్యక్షులు ఎలిగేటి అనిల్,ఉపసర్పంచ్ లు దొంగ ప్రణయ్‌రెడ్డి, ఇద్దం సుధీర్‌రెడ్డి, వార్డు సభ్యులు బుస గంగా మల్లయ్య, అనుమల్ల రమ సత్యనారాయణ, నెమిళ్ల లత, స్వామిరెడ్డి, మండల, గ్రామ నాయకులు కొయ్యడి మహిపాల్, మంద రమేష్, జకిలేటి హరీష్‌రావు, కడుతల లక్ష్మీనారాయణ, ఎనగంటి రవి, కొల్ల బుచ్చిరెడ్డి, వేణుగోపాల్, లంక దాసరి తిరుపతి, గంగుల శ్రీనివాస్,సంబ గంగాధర్, మిట్టపల్లి రామన్న, తురగ నారాయణరెడ్డి, మ్యాకల రాజేషం, లింగారెడ్డి, నందన, బొమ్మన సూరత్ తదితరులు పాల్గొన్నారు.

## కొడంగల్ ఎత్తిపోతల అవకతవకలపై...
# లోకాయుక్తకు బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేల ఫిర్యాదు



**నారాయణపేట ఆగష్టు 13: (స్కైన్యూస్)** వికారాబాద్ జిల్లాల పరిధిలో చేపడుతున్న మక్తల్--నారాయణపేట--కొడంగల్ ఎత్తిపోతల పథకం లో చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్న అవక తవకలు, అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసు కోవాలని నారాయణపేట జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నారాయణపేట మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేం దర్ రెడ్డి, మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహ న్ రెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి లు గురువారం లోకా యుక్తకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నారాయణపేట జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్య క్షులు ఎస్.రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఏం.ఎన్.కే. ఎల్.ఐ.ఎస్ లో ముఖ్యంగా నారాయణపేట మండలం పేరపల్ల గ్రామ శివారులో చేపట్టిన భూముల సేకర ణలో పెద్ద ఎత్తున అక్రమా లు చోటు చేసుకున్నట్లు తెల్సుందని, ముఖ్యంగా దొంగ పాస్ బుక్ లతో నష్ట పరిహారం ఎత్తుకునేందుకు కాంగ్రెస్ నాయకులు పన్నా గంతో దండు కునేందుకు ప్రణాళికలు రూపొందించి నట్లు పక్కా సమాచారం ఉందన్నారు. అంతే కాకుం డా పేరపల్ల శివారులోని జయమ్మ చెరువులో నీరు నిల్వ చేయడం వల్ల కొంత మంది రైతులకు సంబంధిం చి భూములు కొల్పోకున్న, భూములు కోల్పోతున్నట్లు పేర్కొనడం, సర్వే నంబర్లు ఒక చోట ఉంటే భూములు ఒక చోట ఉన్నట్లు అధికా రులు చెప్పడం రైతులను అయోమయానికి గురి చేస్తుందన్నారు. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం కాకుండా, ప్రాజెక్టు పనుల్లో పారదర్శకత ఉండేలా చర్య లు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. విచార ణలో అవినీతి, అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలు తేలితే సంబంధిత అధికా రులపై, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని లోకాయుక్తను కోరినట్లు ఆయన తెలిపారు.ప్రజలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో ప్రతి రూపాయి ప్రజాధనం సక్ర మంగా వినియోగించా ల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. లోకాయుక్త విచారణ ద్వారా వాస్తవాలు వెలుగులోకి రావాలని వారు కోరారు.

# శ్రీ సద్గురు ఈశ్వర వీరప్పయ్య స్వామి దేవాలయంలో 41 శ్రావణ మాస పూజలు

**ఆలయ కార్య నిర్వహణ అధికారి కె శివానంద చారి**



**దేవరకద్ర ఆగస్టు 13 (స్కై న్యూస్);** శ్రావణ మాసం పురస్కరించుకొని దేవరకద్ర పట్టణ ప్రజలకు భక్తాగ్రేసరులకు భజనపరులకు పెద్దలందరికీ యువకులకు మనవి చేయడం ఏమనగా శ్రావణమాసం పురస్కరించుకొని గురువారం నుంచి శ్రావణ శుద్ధ పాడ్యమి ఉదయం 9 గంటలకు గంగా పూజ, శ్రీ రామలింగేశ్వర స్వామి శ్రీ సద్గురు వీరప్పయ్య స్వామి ఆలయాలలో కంకణ ధారణ పంచామృతాభిషేకములు అఖండ దీపారాధన కార్యక్రమం జరుగును అని శ్రీ ఈశ్వర వీరప్పయ్య స్వామి దేవస్థానం కార్యనిర్వాణాధికారి కె శివానంద చారి, గ్రామ పెద్దలు గురువారం తెలిపారు. ప్రతిరోజు రాత్రి శ్రీ సద్గురు ఈశ్వర వీరప్పయ్య స్వామి దేవాలయముల లో 41రోజులు అఖండ భజన కార్యక్రమం ఏర్పాటు చేయడమైనది కావున ఇట్టి కార్యక్రమంలో గ్రామస్తులందరూ భక్తాగ్రేసరులు భజనపరులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కాగలరని మనవి.ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా అఖండ దీపారాధానకు నూనె అయ్యగార్లకు సాహిత్యం కీర్తిశేషులు పల్లమర్రి శ్రీనివాసులు అనసూయమ్మల కుమారుడు ఏ, మహేష్ ఉమారాణి దంపతులు ఇస్తున్నారు. వారికి వారి కుటుంబ సభ్యులకు శ్రీ సద్గురు ఈశ్వర వీరప్పయ్య స్వామి కృప ఆశీర్వాదాలు ఎల్లవేళలా ఉండాలని కోరారు.

# భీమారం మాజీ సర్పంచ్ రాములు నాయక్ కి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ పరామర్శ



**జిల్లా ఆగస్టు 13 (స్కై న్యూస్):** ఇటీవల ప్రమాదంలో గాయపడిన ఫరూఖ్‌నగర్ మండలం భీమారం మాజీ సర్పంచ్ రాములు నాయక్‌ను బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వై. రవీందర్ యాదవ్ వారి స్వగృహంలో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా రాములు నాయక్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి సాధారణ జీవితం కొనసాగించాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో స్థానిక సర్పంచ్ గీత వీరేశం, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్, సర్పంచ్ కృష్ణవేణి హరి నాయక్, మాజీ సర్పంచులు మచ్చేందర్, చంద్రశేఖర్, పాత్లావత్ రాములు నాయక్, నాయకులు రాయికల్ వెంకట్ రెడ్డి, కంది యాదయ్య గౌడ్, మల్లేష్ నాయక్, పి. వీరేశం, బుచ్చయ్య, శ్రీనివాసులు, జి. యాదయ్య, సత్యం, రమేష్, శ్రీనివాస్ గౌడ్, శ్రీశైలం, నరేష్, నర్సింలు, మల్లేష్ గౌడ్, లింగం, భువనేశ్వర్ రెడ్డి, రమేష్ యాదవ్, మధు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ జూనియర్ కాలేజీల ధ్రువపత్రాలపై సమగ్ర విచారణ జరిపించాలి

**TGBIE కార్యదర్శి అభిలాష అభినవ్ ను కలిసి వినతిపత్రం అందజేసిన పి డి ఎస్ యూ తెలంగాణ రాష్ట్ర కమిటీ**




**హైదరాబాద్, ఆగస్టు 13,** తెలంగాణ రాష్ట్రంలోని ప్రైవేట్ జూనియర్ కాలేజీలకు పర్మిషన్/గుర్తింపు, మరియు అఫిలియేషన్,రెన్యువల్ మంజూరు చేసే సమయంలో సమర్పిస్తున్న ఫైర్ ఎన్ ఓసి,బిల్డింగ్ స్టబిలిటీ సరిఫికెట్ అప్రూవ్డ్ ,బిల్డింగ్ ప్లాన్,శానిటేషన్,డ్రింకింగ్ వాటర్‌తదితర ధ్రువపత్రాల నిజానిజాలను సమగ్రంగా పరిశీలించాలని ౹ాణూఖ తెలంగాణ రాష్ట్ర కమిటీ కోరింది.ఈ మేరకు ౹ాణూఖ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కె. పవన్ కుమార్‌లి , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. గణేష్ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ ప్రతినిధులు తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యదర్శి అభిలాష అభినవ్, ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యదర్శి వినతిపత్రాన్ని స్వీకరించి, సమస్యపై సానుకూలంగా స్పందించారని ౹ాణూఖ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కె. పవన్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. గణేష్ లు తెలిపారు.వినతిపత్రంలో పేర్కొన్న అంశాలను పరిశీలించిన అనంతరం, ఈ వ్యవహారంపై కమిటీ ఏర్పాటు చేసి సమగ్ర విచారణ జరిపిస్తామని కార్యదర్శి అభిలాష అభినవ్, హామీ ఇచ్చారు.ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యదర్శి అభిలాష అభినవ్, ను కలిసి వారిలో కె. పవన్ కుమార్‌రాష్ట్ర అధ్యక్షులుప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ కె. గణేష్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ బి. ఎం. వంశీ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ తదితరులు పాల్గొన్నారు

# 15 ఏళ్లుగా పెండింగ్‌లో సింగరేణి వారసుల ఉద్యోగాలు

**మారుపేర్ల కారణంగా విజిలెన్స్ కేసుల్లో చిక్కుకున్న మెడికల్ ఇన్వాలిడేషన్ వారసులు**

**వెంటనే కేసులు పరిష్కరించి ఉద్యోగాలు కల్పించాలని బాధితుల విజ్ఞప్తి**





**సింగరేణి ఆగస్ట్ 13( స్కై న్యూస్):**సింగరేణి సంస్థలో మెడికల్ ఇన్వాలిడేషన్ కింద రావాల్సిన వారసత్వ ఉద్యోగాలు మారుపేర్ల (అలియాస్ నేమ్స్) కారణంగా గత 15 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉండటంతో బాధిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. పెండింగ్‌లో ఉన్న విజిలెన్స్ కేసులను తక్షణమే పరిష్కరించి ఉద్యోగాలు కల్పించాలని బాధితులు ప్రభుత్వాన్ని, సింగరేణి యాజమాన్యాన్ని కోరుతున్నారు.సుమారు 30 సంవత్సరాలకు పైగా భూగర్భ గనులు, ఇతర విభాగాల్లో సేవలందించిన పలువురు కార్మికులు అనారోగ్య కారణాలతో కార్పొరేట్ మెడికల్ బోర్డు ద్వారా మెడికల్ ఇన్వాలిడేషన్ పొందారు. సింగరేణి నిబంధనల ప్రకారం వారి కుటుంబ సభ్యులకు డిపెండెంట్ ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ, మారుపేర్ల కారణంగా దరఖాస్తులు విజిలెన్స్ విచారణలోనే నిలిచిపోయాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సర్వీస్ రికార్డులు, విద్యార్హత ధ్రువీకరణ పత్రాల్లో పేర్లలో ఉన్న చిన్నపాటి మార్పుల కారణంగా ఈ సమస్య తలెత్తిందని వారు పేర్కొన్నారు. ఇంటి పేరు లేదా వ్యక్తిగత పేర్లలో స్వల్ప మార్పులు ఉండటంతో అసలు వారసులైన తమకు అన్యాయం జరుగుతోందని తెలిపారు.గత 15 ఏళ్లుగా ఉద్యోగాలు లేకపోవడంతో తమ కుటుంబాలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల చదువులు, వివాహాలు, కుటుంబ పోషణ వంటి బాధ్యతలను నిర్వర్తించడం భారంగా మారిందని తెలిపారు.గతంలో సింగరేణి యాజమాన్యం, కార్మిక సంఘాల మధ్య ప్రాంతీయ కార్మిక కమిషనర్ సమక్షంలో జరిగిన ఒప్పందంలో ఈ సమస్యను పరిష్కరించాలని నిర్ణయించినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఎలాంటి పురోగతి కనిపించడం లేదని పేర్కొన్నారు.విజిలెన్స్ విచారణ ఏ దశలో ఉందో కూడా తమకు సమాచారం ఇవ్వడం లేదని, ప్రతి సారి పరిశీలనలో ఉంది అనే సమాధానమే వస్తోందని బాధితులు ఆరోపించారు.తాము నిజమైన వారసులమేనని నిరూపించడానికి ప్రభుత్వ ఆధ్వర్యంలో డీఎన్ఏ పరీక్షలు నిర్వహించినా సహకరించడానికి సిద్ధంగా ఉన్నామని వారు స్పష్టం చేశారు.మానవతా దృక్పథంతో స్పందించి పెండింగ్‌లో ఉన్న విజిలెన్స్ కేసులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించి, అర్హులైన వారందరికీ వెంటనే ఉద్యోగాలు కల్పించాలని బాధితులు ప్రభుత్వాన్ని కోరారు.

# కేశంపేట్‌లో ఘనంగా హర్ ఘర్ తిరంగా యాత్ర



**కేశంపేట ఆగస్టు13 (స్కై న్యూస్):** కేశంపేట్ మండల కేంద్రంలో హర్ ఘర్ తిరంగా యాత్రను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలనే సందేశంతో నిర్వహించిన ఈ యాత్ర ఉత్సాహభరితంగా సాగింది.హర్ ఘర్ తిరంగా మండల కన్వీనర్ కణం ఉదయ్ కుమార్ గౌడ్, మండల కో-కన్వీనర్ కంచుకోట మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు జాతీయ జెండాలను చేతబూని పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దేశభక్తి నినాదాలతో కేశంపేట్ మండల కేంద్రం మార్మోగింది.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్, రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా కోశాధికారి అమడపురం నరసింహ గౌడ్, హర్ ఘర్ తిరంగా షాద్‌నగర్ ఇంచార్జ్ వంశీకృష్ణ, మండల అధ్యక్షురాలు రోళ్ల రాధిక, హర్ ఘర్ తిరంగా మండల ఇంచార్జ్ మచ్చ సుధాకర్ రావు, షాద్‌నగర్ ధార్మిక సెల్ కన్వీనర్ పసుల నరసింహ యాదవ్, బిజెవైఎమ్ అసెంబ్లీ కన్వీనర్ పుట్నాల సాయి పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జాతీయ జెండా దేశ గౌరవం, ఐక్యత, సమగ్రతకు ప్రతీక అని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ద్వారా యువతతో పాటు ప్రతి ఒక్కరిలో జాతీయ స్ఫూర్తిని మరింత పెంపొందించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో మండల జనరల్ సెక్రెటరీ కల్వకోలు తిరుపతి, తట్టేపల్లి నరసింహ, మండల ఉపాధ్యక్షులు కంచుకోట నర్సింలు, కోశాధికారి పాలాది శ్రీనివాస్, సీనియర్ నాయకులు పల్లె అంజయ్య, సొప్పరి నరసింహ, కరెడ్ల నరేందర్ రెడ్డి, మున్నూరు యుగేందర్, యువమోర్చా నాయకులు శివాజీ, పవన్ కుమార్ రెడ్డి, కుమారస్వామి గుప్తా, శేఖర్ రెడ్డి, జట్టూరి గోపాల్ రెడ్డి, అల్లం ప్రతాప్ రెడ్డి, భక్తవత్సల్‌తో పాటు శక్తి కేంద్రాల ఇంచార్జ్‌లు, బూత్ అధ్యక్షులు, మహిళలు, చిన్నారులు, యువత, బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

# కేశంపేట్‌లో బిజెపి పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా హర్ ఘర్ తిరంగా యాత్ర

**దేశభక్తి నినాదాలతో మార్మోగిన మండల కేంద్రం**



**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 13 (స్కై న్యూస్):** దేశభక్తి, జాతీయ ఐక్యతను చాటుతూ కేశంపేట్ మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా యాత్రను ఘనంగా నిర్వహించారు. హర్ ఘర్ తిరంగా మండల కన్వీనర్ కణం ఉదయ్ కుమార్ గౌడ్, కో-కన్వీనర్ కంచుకోట మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన యాత్రలో నాయకులు, కార్యకర్తలు జాతీయ జెండాలను చేతబూని పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దేశభక్తి నినాదాలతో కేశంపేట్ మండల కేంద్రం మార్మోగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్, రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా కోశాధికారి అమడపురం నరసింహ గౌడ్, హర్ ఘర్ తిరంగా షాద్‌నగర్ ఇంచార్జ్ వంశీకృష్ణ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జాతీయ జెండా దేశ గౌరవం, ఐక్యత, సమగ్రతకు ప్రతీక అని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ద్వారా యువతలో జాతీయ స్ఫూర్తిని మరింత పెంపొందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షురాలు రోళ్ల రాధిక, హర్ ఘర్ తిరంగా మండల ఇంచార్జ్ మచ్చ సుధాకర్ రావు, నాయకులు పసుల నరసింహ యాదవ్, పుట్నాల సాయి, మండల ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, యువమోర్చా నాయకులు, శక్తి కేంద్రాల ఇంచార్జ్‌లు, బూత్ అధ్యక్షులు, మహిళలు, చిన్నారులు, యువత, బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

# నూతనంగా నిర్మించిన గోదాములు, అగ్రి ఔట్ లెట్స్ 13 , మినరల్ వాటర్ ప్లాంట్ కోల్డ్ ప్రెస్ ఆయిల్ మిల్ ప్రారంభోత్సవం





**తెల్కపల్లి 13 ఆగస్ట్ (స్కై న్యూస్):**చిన్నముద్దునూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన గోదాములు, అగ్రి జెట్స్ 13, మినరల్ వాటర్ ప్లాంట్ కోల్డ్ ప్రెస్ ఆయిల్ మిల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి గారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు రైతులకు అవసరమైన సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.రైతులు తమ పంటలను నిల్వ చేసుకునేందుకు గోదాములు, వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడించే Cold Press Oil Mill, ప్రజలకు ఉపయోగపడే మినరల్ వాటర్ ప్లాంట్ వంటి సదుపాయాలు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.చిన్నముద్దునూరు గ్రామ అభివృద్ధికి మరింత సహకారం అందిస్తూ, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే గారు తెలిపారు.రైతు సంక్షేమమే లక్ష్యం

గ్రామీణ అభివృద్ధే ధ్యేయం

**వ్యవసాయ రంగ బలోపేతమే లక్ష్యం**

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మెన్ రమణ రావు ,౹ాూజూ ఛైర్మెన్ భాస్కర్ రెడ్డి , సర్పంచ్ రుక్సాన ఖదీర్ ,౹ాూజూ ఉప అధ్యక్షులు యాదయ్య , మండల నాయకులు, సర్పంచ్, ఉప సర్పంచ్ ,మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు ,ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి..

**దేవరకద్ర ఎస్సై భాస్కర్ రెడ్డి**



**దేవరకద్ర, ఆగస్టు 13 (స్కై న్యూస్);** సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని దేవరకద్ర ఎస్సై భాస్కర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ సైబర్ నేరగాళ్ల భారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫోన్లో ఎవరైనా బ్యాంక్ ఖాతాలో వివరాలు లేదా ఓటీపీ అడిగితే ఎట్టి పరిస్థితుల్లో చెప్పొద్దన్నారు. అదేవిధంగా ఫోన్ లేదా మెయిల్ ద్వారా వచ్చే వెబ్సైట్లను ఓపెన్ చేయొద్దు అన్నారు.దీంతో సైబర్ నేరగాళ్లు మన ఫోన్లు కంప్యూటర్లు హ్యాక్ చేస్తూ డాటా మొత్తం సేకరిస్తారన్నారు. అదేవిధంగా ఏదైనా ప్రమాద పరిస్థితులో దొంగలు, అనుమానితులు దాడి చేసినప్పుడు డయల్ 100 కు సమాచారం అందిస్తే, వెంటనే పోలీసులు పది నిమిషాల్లో అక్కడికి చేరుకొని సహాయం అందిస్తారన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో, సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ఎస్సై భాస్కర్ రెడ్డి సూచించారు.

# మోడ్రన్ ఇక్రా స్కూల్ లో వ్యాక్సిన్ పై అవగాహన



**కొత్తగూడెం ఆగస్టు 13 ( స్కై న్యూస్): భద్రాద్రి** కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో మోడ్రన్ ఇక్రా స్కూల్ ఎస్ సి బి నగర్ లో వ్యాక్సినేషన్ పై విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది..ఇచ్చట ఉన్న విద్యార్థినులకు హెచ్ పీ వి వాక్సిన్ గురించి అవగాహన కల్పించి,వ్యాక్సినేషన్ చేయటం జరిగింది. అటులనే 10 సంవత్సరాల నుండి 16 సంవత్సరాల విద్యార్థి,విద్యార్థినులకు టీ డి వ్యాక్సిన్ లను చేయటం జరిగింది. ఈ కార్యక్రమం లో కరస్పాండెంట్ ఎస్కే.అబ్దుల్ బసీద్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు పబ్లిక్ హెల్త్ మేనేజర్ పి హెచ్ ఎం , పి.శ్రీలక్ష్మి, కె. రాజేశ్వరి ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

# డిస్కో శ్రీను మరణం హిందూ సమాజానికి తీరని లోటు

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి వారి పార్థివ దేహానికి నివాళులు అర్పించిన పలువురు ప్రముఖులు**





**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 13 (స్కై న్యూస్):** హిందూ సమాజ సేవలో నిత్యం అంకితభావంతో పనిచేసిన డిస్కో శ్రీను (విశ్వసేను) మరణం నిజంగా హిందూ సమాజానికి తీరని లోటని బీజేపీ నాయకుడు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి అన్నారు. షాద్‌నగర్‌లో పతంజలి యోగా సెంటర్ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు, హిందూ ధర్మ పరిరక్షణ కోసం చౌడమ్మగుట్ట దేవాలయంలోని గోశాల అభివృద్ధి, సేవా కార్యక్రమాలు, వాహన సేవల్లో విశేషంగా పనిచేసిన వ్యక్తిగా ఆయనను గుర్తు చేసుకున్నారు. ఆధ్యాత్మిక చింతన, భక్తి భావం, సమాజ సేవను జీవిత లక్ష్యంగా తీసుకుని నిరంతరం పనిచేసిన ఆయన మరణం ఎంతో బాధాకరమని తెలిపారు. హిందూ సమాజ అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. డిస్కో శ్రీను పవిత్ర ఆత్మకు ఘన నివాళులు అర్పించిన నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, బండర్ రమేష్, లయన్ సుధాకర్, నరేందర్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ చెట్ల వెంకటేష్, విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులతో కలిసి భగవంతుడు ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, హిందూ సమాజ ప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు ఆయన పార్థివ దేహానికి పుష్పాంజలి ఘటించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని

# ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మళ్లాలి

**తక్కువ నీటితో సాగు చేసే ఆరుతడి పంటలు, కూరగాయల సాగును ప్రోత్సహించాలి**

**జిల్లా కలెక్టర్ అంకిత్**

**అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇంటి లబ్ధి చేకూరేలా చర్యలు**

**రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల సర్వేను వేగవంతం చేయాలి**

**ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించడమే లక్ష్యం**

**విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపరచాలి**

**నెల రోజుల్లో తెలుగు, ఇంగ్లీష్, గణితంలో స్పష్టమైన పురోగతి కనిపించాలి**

**సుజాతనగర్ ఆగస్ట్ 13( స్కై న్యూస్):** సింగభూపాలెం, వేపలగడ్డ గ్రామాల్లో జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం విస్తృతంగా పర్యటించి వివిధ అభివృద్ధి, సంక్షేమ, విద్యా కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సింగభూపాలెం చెరువును సందర్శించిన కలెక్టర్ నీటి నిల్వ పరిస్థితులను పరిశీలించారు. చెరువు పూర్తిస్థాయి నీటిమట్టం 19 అడుగులు కాగా, ప్రస్తుతం 14.5 అడుగుల నీరు ఉన్నట్లు అధికారులు వివరించారు. ఈ చెరువు ద్వారా సుమారు 2,200 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఉన్నందున, అందుబాటులో ఉన్న నీటి వనరులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ, ఆరుతడి పంటలను ప్రోత్సహించాలని, పెసర, కూరగాయల సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచేలా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.అనంతరం పాత అంజనాపురం గ్రామంలో రైతులు సాగు చేస్తున్న కూరగాయ పంటలు, పెసర, పత్తి పంటలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. కాకరకాయ, సొరకాయ తదితర కూరగాయల సాగును పరిశీలించి రైతులతో నేరుగా మాట్లాడారు.ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, వాటి ప్రభావం పంటల సాగుపై పడే అవకాశం తదితర అంశాలను రైతులకు వివరించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరి సాగు చేపట్టకుండా తక్కువ నీటితో సాగు చేయగల పెసర వంటి ఆరుతడి పంటలతో పాటు ఇతర ప్రత్యామ్నాయ పంటలను చేపట్టాలని సూచించారు. సింగభూపాలెం గ్రామంలో సుమారు 600 ఎకరాల్లో కూరగాయలు, 300 ఎకరాల్లో పెసర సాగు జరుగుతున్నట్లు అధికారులు వివరించారు. ఈ సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచేలా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న నీటి వనరులకు తాగునీటికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, తాగునీటి అవసరాలను కాపాడుతూ వున్న నీటిని పొదుపు చెయ్యాలన్నారు.అనంతరం సింగభూపాలెం గ్రామంలో మొదటి దశలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులతో పాటు రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం చేపడుతున్న సర్వేను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మొదటి దశలో గ్రామానికి మొత్తం 32 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, 100 శాతం ఇండ్ల గ్రౌండింగ్ ప్రక్రియ పూర్తయిందని, 11 ఇండ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, మిగిలినవి నిర్మాణ దశలో ఉన్నాయని అధికారులు తెలిపారు. నిర్మాణం పూర్తయిన లబ్ధిదారు



మిరియాల అరుణ ఇంటిని పరిశీలించిన కలెక్టర్, లబ్ధిదారులతో మాట్లాడి ఇంటి నిర్మాణానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల కోసం జరుగుతున్న సర్వేను పరిశీలించారు. దరఖాస్తుదారులతో నేరుగా మాట్లాడి వారి యొక్క ఆర్థిక పరిస్థితి కుటుంబ పరిస్థితి గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.గ్రామంలో మొత్తం 220 దరఖాస్తులు అందగా ఇప్పటి వరకు 92 దరఖాస్తుల సర్వే పూర్తయిందని, ఇందులో 61 పూరి గుడిసెలకు సంబంధించిన సర్వే పూర్తయిందని అధికారులు వివరించారు. మొత్తం దరఖాస్తుల్లో 10 దరఖాస్తులు తిరస్కరణకు గురైనట్లు తెలిపారు. మిగిలిన దరఖాస్తుల సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సర్వేలో పూర్తి పారదర్శకత పాటిస్తూ క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని, అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ నిబంధనల మేరకు రెండో విడత ఇందిరమ్మ ఇంటి పథకం లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం సింగభూపాలెం గ్రామంలో మిషన్ భగీరథ పథకం కింద రూ.49 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సంప్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ప్రస్తుతం గ్రామంలో సుమారు 60 శాతం మేర తాగునీటి సరఫరా జరుగుతోందని, ప్రతి ఇంటికి 100 శాతం సురక్షితమైన తాగునీరు అందించేందుకు సంప్ నిర్మాణం చేపడుతున్నట్లు అధికారులు వివరించారు. గ్రామంలో రోజుకు సుమారు 2 లక్షల లీటర్ల తాగునీరు అవసరమవుతుందని తెలిపారు. ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందేలా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. సంప్ నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని, ప్రతి ఇంటికి తాగునీటి కనెక్షన్ అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లకు కూడా ముందస్తు ప్రణాళికతో తాగునీటి కనెక్షన్లు కల్పించాలని ఆదేశించారు.అనంతరం గ్రామంలోని జిల్లా పరిషత్




ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరో తరగతి గదిని సందర్శించి విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో అందుతున్న సదుపాయాలు, బోధన తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల తెలుగు, ఇంగ్లీష్ పఠన సామర్థ్యాలను స్వయంగా పరిశీలించారు. విద్యార్థుల పఠన సామర్థ్యంపై అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్, విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో బోధన అందించాలని ఆదేశించారు. తాను మరో నెల రోజుల్లో తిరిగి పాఠశాలను సందర్శిస్తానని, అప్పటికి విద్యార్థులు తెలుగు, ఇంగ్లీష్, గణితంలో స్పష్టమైన పురోగతి సాధించేలా చర్యలుబ తీసుకోవాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.అనంతరం వేపలగడ్డ గ్రామంలోని మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే బాలుర పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు నిర్వహిస్తున్న క్రీడా పోటీలను పరిశీలించి విద్యార్థుల ఉత్సాహాన్ని అభినందించారు. అనంతరం పాఠశాల వంటగదిని పరిశీలించి విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న ఆహార నాణ్యతను స్వయంగా పరిశీలించారు. ప్రతిరోజూ అవసరమయ్యే బియ్యం, ఇతర సరుకుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలని వంట సిబ్బందిని ఆదేశించారు. అనంతరం వసతి గృహ పరిసరాలు, పరిశుభ్రత, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ అంకిత్ వెంట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, ఉద్యానవన శాఖ అధికారి కిషోర్ బాబు, తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, వ్యవసాయ శాఖ ఏవోలు, ఇరిగేషన్ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, సర్వే బృందాల సిబ్బంది, గ్రామస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బిడ్ వేసి చేతులెత్తేసిన బిల్డర్..

# రూ.5 కోట్లు లాస్



**హైదరాబాద్, ఆగస్టు 13:**హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో సంచలనం సృష్టిస్తూ కోకాపేట ప్లాట్ నంబర్ 17లో 4.59 ఎకరాల భూమికి ఎకరాకు రూ. 136.50 కోట్ల చొప్పున బిడ్ వేసిన వజ్రా కన్‌స్ట్రక్షన్స్ చెల్లింపులు చేయలేకపోయింది. దీంతో వేలం నిబంధనల ప్రకారం హెచ్‌ఎమ్‌డీఏ సదరు సంస్థ చెల్లించిన రూ. 5 కోట్ల ఈఎమ్‌డీ డిపాజిట్‌ను జప్తు చేసింది. ప్రీ-లాంచ్ విక్రయాల ద్వారా నిధులు సమీకరించాలనే వ్యూహం ఫలించకపోవటంతో భూమితో పాటు డిపాజిట్‌నూ సదరు సంస్థ కోల్పోయింది. కాగా, ఈ భూమిని మళ్లీ వేలం వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన కోకాపేట నియోపొలిస్ భూముల వేలంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. వేలంలో రికార్డు స్థాయిలో భారీ బిడ్ వేసి ప్లాట్‌ను దక్కించుకున్న వజ్రా కన్‌స్ట్రక్షన్స్ అనే రియల్ ఎస్టేట్ సంస్థ నిర్ణీత గడువులోగా నిధులు చెల్లించలేక చేతులెత్తేసింది. దీంతో వేలం నిబంధనలను కఠినంగా అమలు చేస్తూ.. హెచ్‌ఎండీఏ సదరు నిర్మాణ సంస్థ భద్రతా డిపాజిట్‌గా చెల్లించిన రూ. 5 కోట్ల అర్నెస్ట్ మనీ డిపాజిట్ (జువీణ)ని జప్తు చేసింది.కోకాపేట ప్లాట్ నంబర్ 17లోని 4.59 ఎకరాల భూమికి వజ్రా కన్‌స్ట్రక్షన్స్ ఎకరాకు ఏకంగా రూ. 136.50 కోట్ల చొప్పున బిడ్ దాఖలు చేసి భూములు దక్కించుకుంది. ఈ లెక్కన ఆ భూమి మొత్తం విలువ రూ. 626 కోట్లకు పైగానే ఉంటుంది. అయితే, భూమి కొనుగోలుకు అవసరమైన పూర్తి ఆర్థిక ఇన్వెస్ట్‌మెంట్ సొంతంగా లేనప్పటికీ.. ప్రాజెక్టు ప్రకటించి ప్రీ-లాంచ్, ఓపెన్ టు పబ్లిక్ విక్రయాల ద్వారా కొనుగోలుదారుల నుంచి ముందస్తుగా నిధులు సమీకరించి ప్రభుత్వానికి చెల్లించవచ్చని ఆ సంస్థ భావించింది. అయితే మార్కెట్‌లో ఆశించిన స్థాయిలో ప్రీ-లాంచ్ విక్రయాలు జరగకపోవడంతో ఆ వ్యూహం ఫలించలేదు.నిర్ణీత గడువు ముగిసినా డబ్బులు చెల్లించకపోవటంతో రూ. 5 కోట్ల డిపాజిట్‌ను హెచ్‌ఎండీఐ జప్తు చేసింది. ఫలితంగా వజ్రా కన్‌స్ట్రక్షన్స్ రూ. 600 కోట్లకు పైగా విలువైన కోకాపేట స్థలంతో పాటు రూ. 5 కోట్ల నగదును కోల్పోయి రెండు రకాలుగా నష్టాన్ని మూటగట్టుకుంది. భవిష్యత్ ప్రాజెక్టు విక్రయాలను నమ్ముకొని ఆర్థిక సామర్థ్యానికి మించి బిడ్లు వేయడం ఎంత ప్రమాదకరమో ఈ ఘటన స్పష్టం చేస్తోందని రియల్ ఎస్టేట్ నిపుణులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా.. చెల్లింపులు జరగని నేపథ్యంలో ప్లాట్ నంబర్ 17 కింద ఉన్న 4.59 ఎకరాల స్థలానికి త్వరలోనే మళ్లీ పారదర్శకంగా బహిరంగ వేలం నిర్వహించాలని హెచ్‌ఎండీఏ నిర్ణయించింది. గత వేలంలో ఎకరాకు 136.50 కోట్ల కోట్లకు పైగా పలుకగా.. కొత్త వేలంలో ఈ స్థలానికి ఎలాంటి ధర నమోదవుతుందనేది ఇప్పుడు నగర రియల్టీ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.కోకాపేట్‌లోని నియోపోలిస్, గోల్డెన్ మైల్ లేఅవుట్లతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న విలువైన భూములను వేలం వేయడానికి హెచ్‌ఎండీఏ సిద్ధమైంది. నిధుల సమీకరణే లక్ష్యంగా వేలానికి రెడీ అయ్యారు. నియోపోలిస్‌లో ఎకరానికి కనీస ధర రూ. 120 కోట్లుగా నిర్ణయించగా.. గోల్డెన్ మైల్‌లో రూ. 70 కోట్లుగా ఫిక్స్ చేసారు. ఈ వేలం ప్రక్రియ ఆగస్టు 24 నుంచి సెప్టెంబర్ 9 వరకు జరగనుంది. మోకిలా, బాచుపల్లి, సూరారం వంటి నివాస ప్రాంతాల్లోని ఖాళీ ప్లాట్లను సైతం ఈ-వేలంలో ఉంచారు.

## శ్రీ శ్రీ శ్రీ లోకాయపల్లి లక్ష్మమ్మ మాత ఉత్సవాలు ఘనంగా ప్రారంభం



**నారాయణపేట ఆగస్టు 13: (స్కైన్యూస్):** శ్రావణమాస ఉత్సవాలను పురస్కరించుకొని శ్రీ లోక పల్లి లక్ష్మణ జాతర ఉత్స వాలు ఘనంగా ప్రారంభం అయ్యాయి.గురువారం ఉదయం ఎక్లాస్పూర్ భక్తులు గ్రామ పెద్దలు, చిన్నారులు, ఆలయ కమిటీ సభ్యులందరూ, భక్తిశ్రద్ధలతో, మేళ తాళాలతో, భజనలు చేస్తూ, శ్రీ ఆలయ పూజారి, సోమశేఖర స్వామి, ఇంటి నుండి బయలుదేరి, నారాయణపేట పురవీధుల గుండా తిరుగుతూ, ఏ క్లాస్ పూర్ గ్రామం చేరుకొని శ్రీతిమ్మప్ప స్వామి దేవాలయము గుండా లక్ష్మమ్మ దేవాలయంకి పల్లకి సేవ చేశారు.ఇట్టి పల్లకి సేవలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు హరి నారాయణ బట్టడ్ , ఆలయ కమిటీ అధ్యక్షులు, శశికాంత్ యాదవ్ గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ గౌడ్ ,అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి పల్లకిని ప్రారంభించడం జరిగింది.ఈ కార్యక్రమంలో నారాయణపేట మున్సిపా లిటీ వైస్ చైర్మన్ మంజుల రెడ్డి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు కన్న జగదీష్ , ఎల్ రాధాకృష్ణ , కూరగాయల రవికుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి వేముల మధుసూదన్ రెడ్డి, సహకార దర్శి గొల్ల బుగ్గన, ఉషప్ప,సభ్యులు పిల్లి నరసింహులు, కే ఆనంద్, సంతోష్ నామాజీ, రమా. కాంత్ సలహాదారులు బండగొండ పెద్ద రాంరెడ్డి, ఆత్మారామ్ హెడ్క్. రాష్ట్రీయ స్వయంసేవక సంఘ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, అమ్మవారి మహిళా సేవా సమితి సభ్యులు సురేఖ, చిలాల్ అరుణ,భక్తులు, పాల్గొని అమ్మవారి పల్లకి సేవ విజయవంతం చేశారు. ఉత్సవాల్లో భాగంగా నేటి శ్రావణ శుక్రవారం మొదటి శుక్రవారం సందర్భంగా భక్తులకు క్యూలైన్ నేర్పా ట్లు, మంచినీటి సౌకర్యం, వాహనాల పార్కింగ్, దేవా లయాలకు రంగుల అలంక రణ, పూలఅలంకరణ, భక్తులు నైవేద్యాలు సమ ర్పించుటకు, తగిన ఏర్పా ట్లు ఆలయ కమిటీ సభ్య లు చేయడం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ లోకపల్లి లక్ష్మమ్మ మాత ను దర్శించుకొని అమ్మవారి దివ్య ఆశీస్సులు పొందాలనీ కోరారు.

## మహాకుంభమేళ తరహాలో

# గోదావరి పుష్కరాలు

**రాజమండ్రి, ఆగస్టు 13:**ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళా తరహాలో, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, అత్యున్నత వసతులతో 2027 గోదావరి పుష్కరాలను నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం సన్నాహాలు ముమ్మరం చేసింది. దక్షిణాది మహా కుంభమేళాగా భావించే ఈ పుష్కరాలకు కోట్ల సంఖ్యలో తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, గ్లోబల్ స్టాండర్డ్స్‌కు తగినట్లు ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మహాక్రతువు కోసం మొత్తం అంచనా వ్యయం రూ.8,500 కోట్లుగా నిర్ధారించగా.. తొలి విడత మౌలిక వసతులు, ఘాట్ల విస్తరణ పనుల నిమిత్తం ప్రభుత్వం ఇప్పటివరకు రూ.530 కోట్లను అధికారికంగా మంజూరు చేసింది.పుష్కరాల నిర్వహణలో అత్యంత కీలకమైన శాఖలకు నిధుల కేటాయింపులను ప్రభుత్వం పక్కాగా వర్గీకరించింది. గోదావరి తీరంలో భక్తుల రద్దీని తట్టుకునేలా 238 పాత , కొత్త పుష్కర ఘాట్ల ఆధునీకరణ, మరమ్మతులు, నిర్మాణాలు చేపడుతున్న నీటిపారుదల శాఖకు అత్యధికంగా రూ.210.06 కోట్లు కేటాయించారు. పట్టణ మౌలిక వసతులు, పారిశుధ్య నిర్వహణ పనుల నిమిత్తం పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు రూ.150 కోట్లు విడుదల కాగా, గోదావరి తీరమంతటా నిరంతర విద్యుత్ సరఫరా, తాత్కాలిక సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ఇంధన శాఖకు రూ.100 కోట్లు కేటాయించారు. దీంతో పాటు ఆలయాల సుందరీకరణ, ధార్మిక కార్యక్రమాల నిర్వహణకు దేవాదాయ శాఖకు రూ.60 కోట్లు, టూరిజం సేవలు, సాంస్కృతిక ప్రదర్శనల విస్తరణకు పర్యాటక, సాంస్కృతిక శాఖకు రూ.10 కోట్లు నిధులు విడుదలయ్యాయి.ఈసారి పుష్కరాలలో డిజిటల్ టెక్నాలజీ వినియోగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. లక్షలాది మంది భక్తులు ఒకేసారి వచ్చే అవకాశం ఉన్నందున క్రౌడ్ మేనేజ్‌మెంట్ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత సీసీటీవీ నెట్‌వర్క్, డ్రోన్ సర్వైలెన్స్, రియల్ టైమ్ కంట్రోల్ రూమ్‌లను అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. భక్తులు



తాము స్నానం చేయాలనుకునే ఘాట్లు, స్లాట్ బుకింగ్, ట్రాఫిక్ రూట్ మ్యాప్స్, అందుబాటులో ఉన్న పార్కింగ్ స్థలాలు, అత్యవసర వైద్య సేవల సమాచారాన్ని సులువుగా తెలుసుకునేలా ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్‌ను, క్యూఆర్ కోడ్ నేవిగేషన్ సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు.నది తీరం పొడవునా పారిశుధ్యం, భద్రత , పర్యావరణ పరిరక్షణ విషయాలలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. నది నీరు కలుషితం కాకుండా ప్రత్యేక ఫిల్ట్రేషన్ గ్రిడ్లను ఏర్పాటు చేయడమే కాక, ప్లాస్టిక్ రహిత పుష్కరాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నారు. ప్రతి ఘాట్ వద్ద 24 గంటలు అందుబాటులో ఉండేలా మొబైల్ మెడికల్ టీమ్‌లు, అంబులెన్సులు, పారిశుధ్య సిబ్బంది , స్విమ్మింగ్ నిపుణులను అందుబాటులో ఉంచనున్నారు. భక్తుల రద్దీని నియంత్రించేందుకు కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లు వేగంగా పనిచేస్తాయి. రాజమండ్రి, కోవూరు, నరసాపురం, భద్రాచలం పరిసర ప్రాంతాల గోదావరి తీరాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్ది, పుష్కరాలకు వచ్చే కోట్లాది మంది భక్తులకు భక్తిపారవశ్యంతో పాటు అధునాతనమైన, సురక్షితమైన ఆధ్యాత్మిక అనుభూతిని అందించడమే లక్ష్యంగా వైభవంగా ఏర్పాట్లు వేగవంతమవుతున్నాయి.

# బిజినెస్

## త్వరలో చలామణిలోకి పాలిమర్ కరెన్సీ నోట్‌లు.. కేంద్రం గ్రీన్ సిగ్నల్!



దేశంలో త్వరలో పాలిమర్ కరెన్సీ నోట్లు చెలామణిలోకి రానున్నాయి. రూ.10, రూ.20 విలువ కలిగిన పాలిమర్ నోట్లను క్షేత్రస్థాయి ప్రయోగాల కోసం జారీ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఒక్కో డినామినేషన్ లో వంద కోట్ల చొప్పున నోట్లను ప్రయోగాత్మకంగా జారీచేసే ప్రతిపాదనను ఆమోదించినట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేడు పార్లమెంటుకు వెల్లడించారు. భారతీయ రిజర్వ్ బ్యాంక్ సెంట్రల్ బోర్డు సిఫార్సు మేరకు 'ఆర్‌బీఐ చట్టం-1934' లోని సెక్షన్ 25 ప్రకారం ఈ ప్రతిపాదనను ప్రభుత్వానికి పంపింది. ఈ క్షేత్రస్థాయి ప్రయోగాలు విజయవంతమైతే భవిష్యత్తులో ఈ రెండు విలువల్లోని పాలిమర్ నోట్లను క్రమబద్ధంగా జారీచేసే అవకాశం ఉంటుంది. అయితే ప్రస్తుతం చెలామణిలో ఉన్న కాగితపు నోట్ల స్థానంలో వీటిని తీసుకురావడం లేదని, వాటితో పాటే ఈ కొత్త నోట్లు కూడా అందుబాటులో ఉంటాయని ప్రభుత్వం స్పష్టంచేసింది. అయితే పాలిమర్ నోట్ల సేకరణ ప్రక్రియ ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని ఆర్‌బీఐ పేర్కొన్నది. అందువల్ల వీటిని ఎప్పుడు ప్రవేశపెడతారు..? దీనికి ఎంత ఖర్చవుతుంది..? అనే విషయాలపై ఇప్పుడే కచ్చితమైన వివరాలు చెప్పలేమని తెలిపింది. అంతర్జాతీయంగా చూస్తే, కాగితపు నోట్లతో పోలిస్తే పాలిమర్ నోట్లు ఎక్కువ కాలం మన్నుతాయి. ఈ ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకునే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

## ఆడి కొత్త ప్లాన్.. వచ్చే మూడేళ్లలో..




వచ్చే మూడేళ్లలో తమ మార్కెట్ వాటాను రెట్టింపు చేసుకోవాలని నిర్దేశించుకున్నట్లు వాహనాల దిగ్గజం ఆడి ఇండియా బ్రాండ్ డైరెక్టర్ బల్బీర్ సింగ్ ధిల్లాన్ తెలిపారు. ప్రస్తుతం సంస్థకు 8 శాతం మార్కెట్ వాటా ఉన్నట్లు పేర్కొన్నారు. మరోవైపు, రాబోయే పండుగల సీజన్‌లో సరికొత్త ఆడి క్యూ3తో మొదలుపెట్టి 2027 నాటికి మొత్తం మూడు కొత్త ఉత్పత్తులను ప్రవేశపెట్టనున్నట్లు వివరించారు. 2027లో నెక్స్ట్ జనరేషన్ ఆడి ఏ5, ఫ్లాగ్‌షిప్ ఆడి క్యూ9ని అందుబాటులోకి తేనున్నట్లు ధిల్లాన్ పేర్కొన్నారు. ఇక ద్వితీయ, తృతీయ శ్రేణి మార్కెట్లపై ప్రధానంగా దృష్టి పెడుతూ వచ్చే ఏడాది ఆఖరు నాటికి రిటైల్ నెట్‌వర్క్‌ని 25 శాతం పైగా విస్తరించనున్నట్లు వివరించారు. షోరూమ్‌ల సంఖ్యను 40కి పెంచుకోనున్నట్లు వివరించారు. ప్రస్తుత డీలర్‌ప్‌లను తమ ప్రోగ్రెసివ్ షోరూమ్ కాన్సెప్టునకు కూడా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు చెప్పారు.

# 6 రోజుల్లో 9800.. 2 నెలల గరిష్ఠానికి బంగారం ధర

**ఢిల్లీ:** దేశంలో బంగారం, వెండి ధరలు మరోసారి పెరిగాయి. 10 గ్రాముల పసిడి ధర తాజాగా రూ.1200 పెరగడంతో దేశ రాజధాని ఢిల్లీలో పసిడి ధర రెండు నెలల గరిష్ఠమైన రూ.1.57 లక్షల స్థాయికి చేరింది. వెండి సైతం కిలోకు రూ.2 వేలు పెరిగి రూ.2.42 లక్షలకు చేరింది. అంతర్జాతీయంగా చమురు మంటలు కొనసాగుతున్నా ట్రేడర్ల నుంచి బలమైన డిమాండ్ కారణంగా బంగారం ధరలు పెరుగుతున్నాయి. గడిచిన ఆరు రోజుల్లో 10 గ్రాముల పసిడి ధర మొత్తంగా రూ.9800 మేర పెరిగింది. 10 గ్రాముల పసిడి ధర జూన్ 12న రూ.1.56 లక్షలు ఉండగా.. ఇప్పుడు మళ్లీ అదే స్థాయికి చేరింది. ఆగస్టు 3న బంగారం ధర రూ.1.47 లక్షలుగా ఉంది. అటు వెండి సైతం కిలో రూ.2 వేలు పెరిగి రూ.2.42 లక్షలకు చేరింది. ఏప్రిల్ 30న చివరిసారిగా వెండి ఈ ధర పలికింది. అంతర్జాతీయ విపణిలో స్పాట్ గోల్డ్ ఔన్సు 4399 డాలర్లు, వెండి ఔన్సు 65 డాలర్లు చొప్పున ట్రేడవుతున్నాయి. దీన్ని అనుసరించి మంగళవారం సాయంత్రం 6 గంటల సమయానికి హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లోనూ పసిడి ధర రూ.1.57 లక్షలు, వెండి రూ.2.42 లక్షలు చొప్పున పలుకుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 4,435 డాలర్ల స్థాయికి చేరినప్పుడూ చమురు ధరల్లో పెరుగుదల కారణంగా ధరలు దిగి వచ్చాయి. ఇప్పుడు కూడా



హర్మూజ్‌ను తెరిచే విషయంలో అనిశ్చితి కొనసాగుతున్న వేళ క్రూడాయిల్ ధరలు అధిక స్థాయిలో కొనసాగుతున్నాయి. అయినప్పటికీ.. బంగారం, వెండి ధరలు గరిష్ఠ స్థాయిలో కొనసాగుతున్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. అయితే, జులై నెలకు సంబంధించి అమెరికాలో కన్స్యూమర్ ప్రైస్ ఆధారిత ద్రవ్యోల్బణ గణాంకాల గురువారం వెలువడనున్నాయి. దీని ఆధారంగా అక్కడి ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై ఒక అంచనాకు వస్తుంది. ఈ డేటా బంగారం, వెండి ధరలను ప్రభావితం చేయొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్.. సెన్సెక్స్ 388 పాయింట్లు పతనం

భారత స్టాక్ మార్కెట్ మంగళవారం నష్టాల్లో ముగిసింది. సోమవారం లాభాల్లో ముగిసినప్పటికీ.. మంగళవారం నష్టాల బాటలోనే సాగింది. మధ్యాహ్నం 3.30 గంటలకు ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 388 పాయింట్లు నష్టపోగా, నిఫ్టీ 112 పాయింట్లు నష్టపోయింది. ఉదయం ట్రేడింగ్ నష్టాల్లోనే ప్రారంభమైంది. సోమవారం నాటి ముగింపుతో పోలిస్తే ఉదయం సెన్సెక్స్ 320 పాయింట్లు తక్కువగా 78,204 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. నిఫ్టీ 94 పాయింట్ల నష్టంతో 24,490 వద్ద ప్రారంభమైంది. చివరకు బీఎస్ఈ సెన్సెక్స్ 388.19 పాయింట్ల (0.49 శాతం) నష్టంతో 78,154.25 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 112.10 పాయింట్లు (0.46 శాతం) నష్టంతో 24,471.70 వద్ద ముగిసింది. బ్రాడర్ మార్కెట్ మాత్రం మిశ్రమ ఫలితాల్ని సాధించింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సెలెక్ట్ ఇండెక్స్ 2.02 పాయింట్లు (0.01 శాతం) నష్టపోగా, బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సెలెక్ట్ ఇండెక్స్ 34.63 పాయింట్లు (0.38 శాతం) లాభాలు పొందింది. నిఫ్టీ ఎఫ్ఎంసీజీ 1.17 శాతం నష్టపోయింది. నిఫ్టీ రియాల్టీ 1 శాతం నష్టపోయింది. నిఫ్టీ ఫార్మా మాత్రం 1.02 శాతం లాభపడింది. బీఎస్ఈ సెన్సెక్స్ 30 ఇండెక్స్‌లో టైటాన్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్, ఎటర్నల్ లాభపడ్డాయి. ఎటర్నల్ అత్యధికంగా 2.01 శాతం లాభపడింది. మరోవైపు భారతీ ఎయిర్‌టెల్, బజాజ్ ఫైనాన్స్, ఇండిగో, అల్ట్రాటెక్ సిమెంట్, యాక్సిస్ బ్యాంక్ సంస్థలు నష్టాల్లో ముగిశాయి. ముఖ్యంగా అల్ట్రాటెక్ సిమెంట్ సంస్థ 2.75 శాతం నష్టపోయింది. అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో క్రూడాయిల్ ధరలు పెరగడం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీంతో ట్రేడింగ్ నష్టాల్లో ముగిసింది. డాలర్‌తో రూపాయి మారక విలువ



మరింత బలపడింది. మంగళవారం 15 పైసలు తగ్గిన రూపాయి 95.43 వద్ద కొనసాగుతోంది. ఉదయం 95.38 వద్ద ఓపెన్ కాగా, మధ్యలో 95.37కు చేరింది. చివరకు 95.43 వద్ద ముగిసింది. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 0.13 శాతం తగ్గి, 87.61 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.


# సమర సన్నాహం..

## కొలంబోలో 6 రోజుల పాటు భారత్ ముమ్మర ప్రాక్టీస్

### క్లీన్‌స్వీప్ లక్ష్యంగా అస్త్రాలకు పదును

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం : శ్రీలంకతో రెండు టెస్టుల సిరీస్ కోసం భారత్ మునుపెన్నడూ లేని విధంగా సన్నద్ధం అవుతోంది. ఈనెల 4న కొలంబోలో అడుగుపెట్టడం మొదలు అక్కడి నాన్‌డెస్క్రిప్ట్స్ క్రికెట్ క్లబ్ (ఎన్‌సీసీ) మైదానంలో వరుసగా ఆరు రోజుల పాటు ఎలాంటి విరామం లేకుండా చెమటలు చిందించింది. ఇందులో మూడు రోజుల పాటు సాగిన పూర్తి స్థాయి వామప్ మ్యాచ్‌తో పాటు, మిగిలిన రోజుల్లో రోజుకు ఐదు నుంచి ఆరు గంటల పాటు సాగిన కఠిన నెట్ సెషన్లు ఉన్నాయి. గిల్‌సేన ఇంత ముమ్మరంగా సాధన చేయడం వెనుక రెండు కారణాలున్నాయి. ఒకటి 18 ఏండ్ల నుంచి లంకపై ఒక్క టెస్టు సిరీస్ కోల్పోని రికార్డును కొనసాగించడం..రెండోది ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ రేసులో నిలవాలంటే ఈ సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాల్సిన అవసరం ఉండటం. దాంతో ఈనెల 15న మొదలయ్యే సిరీస్ కోసం టీమ్ మేనేజ్‌మెంట్ ఏ చిన్న పొరపాటుకు కూడా తావివ్వకుండా పక్కా ప్రణాళికతో ఆటగాళ్లను సిద్ధం చేస్తోంది.



### ఓవైపు వామప్.. ఇంకోవైపు నెట్ సెషన్

ప్రస్తుత జట్టులో కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్‌కు మాత్రమే లంకలో టెస్టు మ్యాచ్‌లు ఆడిన అనుభవం ఉంది. మిగిలిన ఆటగాళ్లందరికీ ఇక్కడి పరిస్థితులు కొత్త. అందుకే లంకలో అడుగుపెట్టిన 24 గంటల్లోనే మైదానంలోకి దిగిన జట్టు ఇక్కడి విపరీతమైన వేడి, తీవ్రమైన తేమతో కూడిన వాతావరణానికి ఆటగాళ్లు అలవాటుపడేలా హెడ్ కోచ్ గంభీర్ ప్రాక్టీస్ సెషన్స్‌ను ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు, తిరిగి 2 నుంచి సాయంత్రం 5.30 వరకు రెండు విడతలుగా విభజించాడు. లంక ఎలెవన్‌తో జరిగిన వామప్ మ్యాచ్ సమయంలోనూ ఫీల్డింగ్ చేస్తున్న ఆటగాళ్లను మారుస్తూ, ఒకవైపు మ్యాచ్ ఆడుతూనే మరోవైపు సమాంతరంగా నెట్స్ ప్రాక్టీస్ చేయించడం గమనార్హం. ఎన్‌సీసీ మైదానంలో జరిగిన శిక్షణ ఎంత తీవ్రంగా సాగిందంటే, ప్రాక్టీస్ సెషన్ అని చూడకుండా ఫాస్ట్ బౌలర్లు నెట్స్‌లో పూర్తి వేగంతో విరుచుకుపడ్డారు. పంజాబ్ పేసర్ గుర్నూర్ బ్రార్ విసిరిన ఓ బంతి కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కుడి చేతి వేలుకు బలంగా తాకి గాయపరిచింది. ముందు జాగ్రత్తగా వామప్ మ్యాచ్ రెండు రోజుల ఆటకు దూరంగా ఉన్న గిల్ ఆఖరి రోజున ఓపెనర్‌గా బరిలోకి దిగి మెరుపు ఇన్నింగ్స్ ఆడి తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకున్నాడు.

### పగుళ్ల పిచ్‌పై స్పిన్నర్లను ఎదుర్కొంటూ..

మూడు రోజుల వామప్ మ్యాచ్ ముగిసిన తర్వాత సోమవారం జట్టుకు విశ్రాంతి ఇస్తారని భావించినప్పటికీ, ప్రధాన పేసర్లను మినహాయించి మిగిలిన ఆటగాళ్లంతా ఎన్‌సీసీ మైదానంలో మళ్లీ మూడు గంటలకు పైగా చెమటోడ్చారు. టెస్టు మ్యాచ్‌లో నాలుగో రోజు నాటి పిచ్‌ను తలపించేలా పగుళ్లు ఉండి, స్పిన్, రివర్స్ స్వింగ్‌కు అనుకూలించేలా వికెట్‌ను తయారు చేయించుకొని మరీ దీనిపై జట్టులోని నలుగురు స్పిన్నర్లు రవీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్, మానవ్ సుతార్, సారాంశ్ జైన్ బౌలింగ్‌లో బ్యాటర్లు తమ డిఫెన్స్, ఫుట్‌వర్క్‌ను మెరుగుపరుచుకోవడంపై దృష్టి సారించారు. సీనియర్ బ్యాటర్ రాహుల్ స్పిన్నర్లను ఎదుర్కొనేందుకు ప్రత్యేకంగా స్వీప్, రివర్స్ స్వీప్ షాట్లపై సాధన చేశాడు. గతంలో ఇంగ్లండ్, ఐర్లాండ్ పర్యటనల్లో పరిస్థితులకు వేగంగా అలవాటు పడకపోవడం వల్ల జరిగిన నష్టాన్ని పునరావృతం కాకుండా చూడాలనే కసి జట్టులో స్పష్టంగా కనిపిస్తోంది. కొలంబోలో ఆరు రోజులు ఉన్న గిల్‌సేన తొలి టెస్టు కోసం మంగళవారం గాలెకు చేరుకుంది. బుధవారం ఒక్క రోజు విశ్రాంతి తీసుకొని గురువారం నుంచి మళ్లీ ప్రాక్టీస్ మొదలుపెట్టి గాలె టెస్టులో ఆడే తుది జట్టుపై ఓ అంచనాకు రానుంది.

### రివర్స్ స్వింగ్ కోసం గిల్ ప్రత్యేక సాధన

లంక పిచ్‌లపై ప్రధాన సవాలుగా మారే రివర్స్ స్వింగ్‌ను ఎదుర్కొనేందుకు గిల్ ప్రత్యేక ప్రణాళికను అమలు చేశాడు. టీమ్ మేనేజ్‌మెంట్ ప్రత్యేకంగా తెప్పించిన కూకబురా రెడ్ బాల్స్‌లో కొద్దిగా పాతబడ్డ (సెమీ ఓల్డ్) బంతులతో ప్రాక్టీస్ చేశాడు. త్రో-డౌన్ స్పెషలిస్టులతో పాటు పేసర్ ఆకిబ్ నబీ బౌలింగ్‌లో రివర్స్ స్వింగ్ అవుతున్న బంతులను దాదాపు 20 నిమిషాల పాటు ఎదుర్కొన్నాడు. శ్రీలంకలోని పొడి వాతావరణం, రఫ్ ఔట్‌ఫీల్డ్ వల్ల బంతి త్వరగా మెరుపు కోల్పోయి రివర్స్ స్వింగ్‌కు అనుకూలిస్తుంది. దీనికి కౌంటర్ ఇచ్చేందుకు గిల్ పాత బడ్డ బంతులతో ప్రాక్టీస్ చేశాడు.

# స్పోర్ట్స్

## టీమిండియాతో సిరీస్ ఖరారు.. భారత్‌లో వారి ఆతిథ్యం!




అఫ్ఘానిస్తాన్ క్రికెట్ బోర్డు (ఏసీబీ) టీమిండియాతో టీ20 సిరీస్‌ను ఖరారు చేసింది. ఇందులో భాగంగా భారత జట్టుతో మూడు టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. అయితే, అఫ్ఘాన్ భారత్‌లోనే టీమిండియాకు ఆతిథ్యం ఇవ్వనుండటం విశేషం. కాగా అఫ్ఘనిస్తాన్‌లో మ్యాచ్‌లు నిర్వహించే పరిస్థితి లేదన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏసీబీ భారత్ లేదంటే యూఏఈలలో పలు సిరీస్‌లకు ఆతిథ్యమిస్తోంది. ఈ క్రమంలో తాజాగా టీమిండియాతో భారత్‌లో తలపడేందుకు సిద్ధమైంది.

### షెడ్యూల్ ఖరారు

ఇందులో భాగంగా ఢిల్లీ వేదికగా టీమిండియా- అఫ్ఘానిస్తాన్ మధ్య సెప్టెంబరు 13, 15, 17 తేదీల్లో మూడు టీ20 మ్యాచ్‌ల నిర్వహణకు షెడ్యూల్ ఖరారైనట్లు తెలుస్తోంది. అరుణ్ జైట్లీ స్టేడియంలో ఈ మూడు మ్యాచ్‌లు నిర్వహిస్తారని తెలుస్తోంది. ఇదిలా ఉంటే.. గతంలో ఐర్లాండ్, వెస్టిండీస్ జట్లకు అఫ్ఘానిస్తాన్ భారత్‌లో ఆతిథ్యం ఇచ్చిన సంగతి తెలిసిందే. 2017లో ఐర్లాండ్‌తో వైట్‌బాల్ సిరీస్ ఆడిన అఫ్ఘాన్ జట్టు.. 2017లో విండీస్‌తో ఆల్ ఫార్మాట్ సిరీస్ ఆడింది.

### టెస్టు, వన్డేలలో ఓటమి

ఇక ఇటీవల అఫ్ఘానిస్తాన్ భారత పర్యటనకు వచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఆతిథ్య జట్టుతో జూన్‌లో ఒక టెస్టు, మూడు వన్డేలు ఆడింది. న్యూ చండీగఢ్‌లోని ముల్లన్‌పూర్ స్టేడియంలో జరిగిన టెస్టు మ్యాచ్‌లో భారత్.. అఫ్ఘాన్‌ను ఏకంగా ఇన్నింగ్స్ 300 పరుగుల తేడాతో మట్టికరిపించింది. ఇక మూడు వన్డేల సిరీస్‌లోనూ ఆతిథ్య భారత జట్టు.. అఫ్ఘాన్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. తాజాగా మరోసారి అఫ్ఘాన్ టీమిండియాతో తలపడేందుకు సిద్ధమైంది. ఈసారి భారత్‌లో ఆతిథ్య దేశంగా అఫ్ఘాన్.. శ్రేయస్ అయ్యర్ సేనతో టీ20 సిరీస్ ఆడుతుంది. ఇదిలా ఉంటే.. టీ20 ప్రపంచకప్-2026లో భారత్‌ను చాంపియన్‌గా నిలిపిన సూర్యకుమార్ యాదవ్‌ను కెప్టెన్సీ బాధ్యతల నుంచి తొలగించిన బీసీసీఐ.. శ్రేయస్ అయ్యర్‌కు పగ్గాలు అప్పగించింది. అయితే, యూకే టూర్‌లో భాగంగా అతడికి ఆదిలోనే చేదు అనుభవం ఎదురైంది. పసికూన ఐర్లాండ్ చేతిలో టీ20 సిరీస్‌లో భారత్ 2-0తో వైట్‌వాష్ అయింది. ఆ తర్వాత ఇంగ్లండ్ చేతిలోనూ 4-0తో క్లీన్‌స్వీప్‌నకు గురై ఘోర పరాభవం ఎదుర్కొంది. అనంతరం జింబాబ్వే పర్యటనకు వెళ్లి.. ఆతిథ్య జట్టును 3-0తో వైట్‌వాష్ చేసి తిరిగి విజయాల బాట పట్టింది.

### శ్రీలంక పర్యటనలో

ఇక టీమిండియా ప్రస్తుతం శ్రీలంక పర్యటనలో ఉన్న సంగతి తెలిసిందే. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ 2025-27లో భాగంగా ఆతిథ్య జట్టుతో గిల్ సేన రెండు మ్యాచ్‌లు ఆడుతుంది. ఇరుజట్ల మధ్య ఆగస్టు 15న తొలి టెస్టు.. ఆగస్టు 23న రెండో టెస్టు మొదలుకానున్నాయి. ఇందుకు గాలె, కొలంబో వేదికలు.




## అల్లరి నరేష్ 'రంభ ఊర్వశి మేనక' టీజర్ విడుదల..

### నవ్వులు పంచేందుకు వస్తోన్న టాలీవుడ్ కామెడీ కింగ్!

టాలీవుడ్ కామెడీ కింగ్ అల్లరి నరేష్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'రంభ ఊర్వశి మేనక' చంద్రమోహన్ చింతడ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలున్నాయి. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ టీజర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రంలో అల్లరి నరేష్ సరసన నలుగురు కథానాయికలు రాశిసింగ్, విష్ణు ప్రియా, సురభి, ప్రిషా సింగ్ నటిస్తున్నారు. తన వంశ పారపర్యంగా వచ్చిన కోరికల బుక్‌తో భుమి మీదకి రంభ, ఊర్వశి, మేనకలను పిలిచిన అనంతరం జరిగిన పరిణామలు ఏంటి అనేది ఈ సినిమా స్టోరీ.వీశీజఅవం ప్రముఖ నిర్మాణ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై వస్తున్న ఈ సినిమా పూర్తిగా వినోదాత్మక నేపథ్యంలో రూపొందుతోంది. విడుదలైన టీజర్ ఆద్యంతం నవ్వులు పూయిస్తూ, అల్లరి నరేష్ మార్క్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతుందని స్పష్టం చేస్తోంది. ఈ చిత్రం సెప్టెంబర్ 04న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.



## భారీ రన్‌టైమ్‌తో రాబోతున్న యశ్ 'టాక్సీక్'.. సినిమా నిడివి ఎంతంటే?



సౌత్ ఇండియన్ రాకింగ్ స్టార్ యశ్ హీరోగా నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్ ఇండియా మూవీ 'టాక్సీక్' గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. కేజీఎఫ్ సిరీస్ తర్వాత యశ్ నుండి వస్తున్న చిత్రం కావడంతో ప్రేక్షకుల్లో మరియు ట్రేడ్ వర్గాల్లో విపరీతమైన క్రేజ్ ఉంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఓ ఆసక్తికరమైన వార్త ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతోంది. ఈ చిత్రానికి 3 గంటల 11 నిమిషాల భారీ రన్‌టైమ్ ఉండబోతున్నట్లు సమాచారం. సినిమా కథాంశం, యాక్షన్ సీక్వెన్స్‌లు మరియు ఎమోషనల్ డ్రామాకు తగినట్లుగా నిడివి కాస్త ఎక్కువగా ఉండొచ్చని, దాదాపు మూడు గంటల పాటు సినిమాను నడిపించేలా దర్శకురాలు ప్లాన్ చేస్తున్నారనే చర్చ జరుగుతోంది. అయితే దీనిపై చిత్ర యూనిట్ నుంచి ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇక ఈ సినిమాను ఐమాక్స్ ఫార్మట్‌లలో కూడా విడుదల చేయబోతున్నారు. అయితే ఇందులో విశేషం ఏమిటంటే కన్నడ నుంచి రెండు సినిమాలను (కేజీఎఫ్ 2, టాక్సిక్) ఐమాక్స్ ఫార్మట్‌లో విడుదల చేసిన ఏకైక హీరోగా యష్ రికార్డులకెక్కాడు.

## ఐదేళ్ల తర్వాత మరో ఓటీటీకి మారుతి మూవీ.. స్ట్రీమింగ్ ఎక్కడంటే?

టాలీవుడ్ డైరెక్టర్ మారుతి దర్శకత్వంలో వచ్చిన లవ్ అండ్ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'మంచి రోజులు వచ్చాయి'. ఈ మూవీలో సంతోష్ శోభన్, మెహరీన్ జంటగా నటించారు. 2021లో థియేటర్లలో రిలీజైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఫర్వాలేదనిపించింది. ప్రస్తుతం ఈ మూవీ ఆహా ఓటీటీలో అందుబాటులో ఉంది. అయితే దాదాపు రిలీజైన ఐదేళ్ల తర్వాత ఈ మూవీ మరో ఓటీటీకి వచ్చేసింది. ఈ రోజు నుంచే అమెజాన్ ప్రైమ్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. కాగా.. ఈ మూవీని ఎస్‌కేఎన్, వీ సెల్యూలాయిడ్ బ్యానర్లపై సంయుక్తంగా నిర్మించారు. ఈ చిత్రానికి అనూప్ రూబెన్స్ సం?గీతం అందించారు. ఈ సినిమాలో వెన్నెల కిశోర్, సప్తగిరి, వైవా హర్ష, అశిష్ ఘోష్ ముఖ్యపాత్రల్లో నటించారు.



## ప్రశాంత్ వర్మ 'జై హనుమాన్'లో 'డీసీ' బ్యూటీ?

టాలీవుడ్ నుంచి రానున్న మోస్ట్ అవేటెడ్ పాన్ ఇండియా చిత్రాల్లో ప్రశాంత్ వర్మ తెరకెక్కిస్తున్న 'జై హనుమాన్' ఒకటి. బ్లాక్‌బస్టర్ 'హను-మాన్' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న ఈ ప్రాజెక్ట్‌లో కన్నడ స్టార్ రిషబ్ శెట్టి హనుమంతుడిగా నటిస్తుండగా, యంగ్ హీరో తేజ సజ్జ కూడా కీలక పాత్రలో కనిపించనున్నారు. భారీ గ్యాప్ తర్వాత ఈ సినిమా ప్రస్తుతం శరవేగంగా జరుపుకుంటుంది. మైత్రి మూవీ మేకర్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ పౌరాణిక సూపర్‌హీరో చిత్రానికి ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇదిలాఉంటే, ఈ సినిమాకి సంబంధించి ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో ఓ క్రేజీ బజ్ వైరల్ అవుతోంది. ఇటీవలి కాలంలో వరుస విజయాలతో దూసుకుపోతున్న ట్రెండింగ్ బ్యూటీ వామికా గబ్బి 'జై హనుమాన్' చిత్రంలో కీలక పాత్రలో నటించనున్నట్లు తెలుస్తోంది. ఇటీవలే కోలీవుడ్ హిట్ చిత్రం 'డిసి' లో తన అద్భుతమైన నటనతో మంచి మార్కులు కొట్టేసిన వామికా.. ఇప్పుడు ఈ భారీ ప్రాజెక్ట్‌లో భాగం కానుందనే వార్త అభిమానులను ఎంతగానో ఉత్సాహపరుస్తోంది. విభిన్న నటనతో ప్రేక్షకులను అలరిస్తున్న వామికా గబ్బి ఈ చిత్రంలో ఒక పవర్‌ఫుల్ రోల్‌లో కనిపించనుందని సమాచారం. అయితే దీనిపై చిత్ర యూనిట్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

## మెగా క్యాంప్‌లో వరుస విజయాల జోరు..

### ఇక ఆ హీరో హిట్ కోసం ఫ్యాన్స్ ఎదురుచూపులు!

టాలీవుడ్‌లో మెగా క్యాంప్‌కు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. మెగా కుటుంబం నుంచి వచ్చిన హీరోలు తమకంటూ ప్రత్యేకమైన మార్కెట్‌ను, భారీ అభిమానగణాన్ని సంపాదించుకున్నారు. అయితే ఇటీవల కాలంలో మెగా హీరోల సినిమాలు వరుసగా బాక్సాఫీస్ వద్ద సత్తా చాటుతుండటంతో అభిమానుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. ఒకరి తర్వాత ఒకరు విజయాలు అందుకుంటూ మెగా క్యాంప్‌లో హిట్‌ల జోరు కొనసాగిస్తున్నారు. ఇప్పటికే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ 'ఓజి', మెగాస్టార్ చిరంజీవి 'మన శంకర వరప్రసాద్ గారు', మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ 'పెద్ది' చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద మంచి విజయాలను నమోదు చేశారు. ముఖ్యంగా ఈ సినిమాల విజయాలు ఆయా హీరోల అభిమానుల్లో భారీ సెలబ్రేషన్స్‌కు కారణమయ్యాయి. మెగా హీరోల సినిమాలు వరుసగా సక్సెస్ అవుతుండటంతో టాలీవుడ్‌లోనూ ఈ విజయాలపై ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఈ జాబితాలో తాజాగా మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ కూడా చేరిపోయారు. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కిన 'కొరియన్ కనకరాజు' సినిమాతో వరుణ్ తేజ్ మంచి విజయాన్ని అందుకున్నారు. చాలా కాలంగా సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్న వరుణ్‌కు ఈ సినిమా సక్సెస్ ఎంతో కీలకంగా మారింది. విభిన్నమైన కథాంశం, కామెడీ, హారర్ అంశాలతో తెరకెక్కిన ఈ సినిమా ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ అందుకోవడంతో బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధిస్తోంది. దీంతో వరుణ్ తేజ్ అభిమానులు సంబరాల్లో మునిగిపోయారు. ముఖ్యంగా వరుస పరాజయాల తర్వాత వచ్చిన ఈ విజయం వరుణ్ కెరీర్‌కు కొత్త ఊపును ఇచ్చిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మెగా క్యాంప్‌లో వరుస విజయాల జోరు కొనసాగుతున్న నేపథ్యంలో ఇప్పుడు అభిమానుల దృష్టి సుప్రీమ్ హీరో సాయి ధరమ్ తేజ్‌పై పడింది. ప్రస్తుతం సాయి ధరమ్ తేజ్ తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్ 'సంబరాల ఏటి గట్టు' లో నటిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో, భారీ స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే మంచి అంచనాలు ఉన్నాయి. విభిన్నమైన కథ, యాక్షన్, విజువల్స్‌తో ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించేలా దర్శకుడు ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో మెగా హీరోల విజయాల పరంపరను సాయి ధరమ్ తేజ్ కూడా కొనసాగిస్తాడని అభిమానులు ఆశిస్తున్నారు. ఒకే కుటుంబానికి చెందిన హీరోలు వరుసగా విజయాలు అందుకోవడం అభిమానులకు పండగ వాతావరణాన్ని తీసుకొచ్చింది. పవన్ కళ్యాణ్, చిరంజీవి, రామ్ చరణ్, వరుణ్ తేజ్ విజయాల తర్వాత ఇప్పుడు సాయి ధరమ్ తేజ్ కూడా హిట్ కొడితే మెగా క్యాంప్‌కు మరింత బలమైన విజయ పరంపర ఏర్పడినట్లవుతుంది.



# జమిలి ఎన్నికలపై కోవింద్ కృషి

భారత మాజీ రాష్ట్రపతి రామ్?నాథ్ కోవింద్ బయోగ్రఫీని ప్రధాని నరేంద్ర మోదీ ఆవిష్కరించారు. 'ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్: మై లైఫ్, మై స్ట్రగుల్స్' పుస్తకాన్ని బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కోవింద్‌తో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని మోదీ గుర్తుచేసుకున్నారు. రాష్ట్రపతిగా కోవింద్ అందించిన మార్గదర్శకత్వం, తనపై చూపిన ఆప్యాయత, ఆత్మీయత తనకు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. ఒకే దేశం-ఒకే ఎన్నిక దిశలో రామ్‌నాథ్ గొప్ప కృషి చేశారని, ఆయన చేసిన సూచనలు దేశాన్ని కొత్త దిశలో నడిపించనున్నాయని తెలిపారు. 'నాకు కోవింద్ చాలా కాలంగా తెలుసు. ఆయన సామర్థ్యాలను నేను సుదీర్ఘకాలంగా తెలుసుకునే అవకాశం లభించింది. ఈ ఆత్మకథ భారత ప్రజాస్వామ్యం, సమాజానికి చిరస్మరణీయ వారసత్వంగా నిలుస్తుంది. రాష్ట్రపతి పదవిలో ఉన్న సమయంలో కోవింద్ ఇచ్చిన సూచనలు, చూపిన ప్రత్యేకమైన ఆప్యాయత నాకు ఎంతో విలువైన ఆస్తిగా నిలిచాయి. ఆయన జీవిత అనుభవాలు, ఎదుర్కొన్న సవాళ్ల నుంచి దేశ యువత ఎంతో నేర్చుకోవచ్చు. ఆయన ఆలోచనలు, అనుభవాలను కొత్త తరం తెలుసుకోవాలి. పుస్తకానికి ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్ అనే పేరు పెట్టడం ఎంతో సముచితం. కోవింద్ జీవితంలో ఎదురైన పోరాటాలు వ్యక్తిగతమైనవే కానీ. వాటి ఫలితంగా సాధించిన విజయం మాత్రం భారత గణతంత్రానికి, దేశ ప్రజాస్వామ్యానికే చెందుతుందన్న సందేశం ఈ శీర్షికలో ఉంది' అని ప్రధాని మోదీ అన్నారు.



రాష్ట్రపతి పదవీకాలం పూర్తయిన తర్వాత కూడా రామ్‌నాథ్ కోవింద్ విశ్రాంతి తీసుకోలేదని మోదీ ప్రశంసించారు. 'వన్ నేషన్- వన్ ఎలక్షన్' వంటి కీలక అంశాలపై ఆయన ఇప్పటికీ పనిచేస్తున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించే విధానంపై అవగాహన పెంచేందుకు కోవింద్ కృషి చేస్తున్నారని మోదీ అన్నారు. ఈ అంశంపై పరిష్కారం కనుగొనగలిగితే భారత ప్రజాస్వామ్యంలో కొత్త అధ్యాయం ప్రారంభమయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. తన ఆత్మకథలో కోవింద్ మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్‌తో తన అనుభవాలను కూడా వివరించారని మోదీ తెలిపారు. దేశ రాజకీయ, ప్రజాస్వామ్య ప్రయాణంలోని వివిధ కోణాలను అర్థం చేసుకోవడానికి ఇలాంటి అనుభవాలు ఉపయోగపడతాయని అన్నారు.

**'రీల్స్ కాలంలో ఆత్మకథలు చదవాలి'**

ప్రస్తుతం రీల్స్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల ప్రభావం ఎక్కువగా ఉందని ప్రధాని అన్నారు. ఇలాంటి సమయంలో ప్రతిదానికీ షార్ట్‌కట్ వెతకడం సరికాదని యువతకు సూచించారు. రైల్వే స్టేషన్లలో కనిపించే 'షార్ట్‌కట్స్ విల్ కట్ యూ షార్ట్' అనే హెచ్చరికను గుర్తుచేస్తూ, జీవితంలోనూ సులభమైన దారుల కోసం వెతకడం వల్ల ఎదుగుదల పరిమితమవుతుందని యువతకు వివరించారు. ఎవరి జీవిత ప్రయాణం నచ్చినా వారి ఆత్మకథను చదవాలని కోరారు. జీవితంలో ఎదురైన సవాళ్లు, వైఫల్యాలు, విజయాల గురించి తెలుసుకోవడం ద్వారా ఎంతో నేర్చుకోవచ్చని పేర్కొన్నారు. పుస్తక పఠనం యువత ఆలోచనా విధానాన్ని విస్తృతం చేస్తుందని సూచించారు.

**కోవింద్ నిరాడంబరతకు మోదీ ప్రశంస**

మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నిరాడంబరత, భారతీయ సాంస్కృతిక విలువల పట్ల ఆయనకున్న గౌరవాన్ని ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాష్ట్రపతి భవన్‌లో ప్రధానిగా తాను కోవింద్‌ను కలిసిన సందర్భాలను గుర్తుచేసుకున్నారు. రాష్ట్రపతిగా ఉన్న సమయంలో ప్రోటోకాల్‌కు పరిమితం కాకుండా కోవింద్ తనతో ఆత్మీయంగా మాట్లాడేవారని మోదీ తెలిపారు. ప్రధానమంత్రి కారులో వెళ్లే సమయంలో ఆయన స్వయంగా కారు తలుపు వరకు వచ్చి వీడ్కోలు పలికేవారని గుర్తుచేశారు. అలా చేయవద్దని తాను పలుమార్లు చెప్పినా.. కోవింద్ తన నిరాడంబరతను మాత్రం విడిచిపెట్టలేదని అన్నారు.

## నిరసనలు, నినాదాలతో సభ ప్రతిష్ఠను దెబ్బతీయొద్దు'



నిరసనలు చేపట్టడం, నినాదాలు చేయడం ద్వారా లోక్‌సభ ప్రతిష్ఠను దెబ్బతీయడం సమంజసం కాదని లోక్?సభ స్పీకర్ ఓం బిర్లా హితవు పలికారు. ప్రజల సమస్యలపై చర్చించేందుకు పార్లమెంట్ వేదికగా ఉందని, సభ్యులు తమ అభిప్రాయాలను సభలో వ్యక్తం చేయాలని సూచించారు. ప్రతిపక్షం, అధికారపక్షం ఆలోచనలు, విధానాలు వేర్వేరుగా ఉండొచ్చని, కానీ దేశ ప్రజలు మాత్రం పార్లమెంట్ సజావుగా పనిచేయాలని కోరుకుంటున్నారని అన్నారు. బుధవారం లోక్‌సభ ప్రారంభమైన వెంటనే విపక్ష సభ్యులు తమ డిమాండ్లపై నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో స్పీకర్ ఓం బిర్లా వారిని ఉద్దేశించి మాట్లాడారు. సభను పనిచేయనివ్వాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం సమావేశాలు ప్రారంభమైన తర్వాత స్పీకర్ విజ్ఞప్తి చేసినప్పటికీ ప్రతిపక్ష సభ్యులు తమ ఆందోళనను కొనసాగించారు. నినాదాలు చేస్తూ సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగించారు. దీంతో పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో స్పీకర్ లోక్‌సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. దీంతో బుధవారం ప్రశ్నోత్తరాల సమయం మూడు నిమిషాలకంటే తక్కువ వ్యవధికే పరిమితమైంది. ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు ప్రభుత్వాన్ని వివిధ అంశాలపై ప్రశ్నించి సమాధానాలు పొందాల్సి ఉండగా, నిరసనల కారణంగా ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. జులై 20న ప్రారంభమైన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు రోజూ ఏదొక అంశంపై ప్రతిపక్షం, ప్రభుత్వానికి మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. దీంతో సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు ఒక్కరోజు కూడా ప్రశ్నోత్తరాల సమయం పూర్తిస్థాయిలో కొనసాగలేదు. ఇలా జరగడం ఇది 18వ రోజు.

## పేపర్ లీక్‌ను అరికట్టడానికే ఫాస్ట్‌ట్రాక్ కోర్టు

నీట్- యూజీ పేపర్ లీక్ కేసులో సీబీఐ దాఖలు చేసిన అభియోగపత్రాన్ని ఢిల్లీ కోర్టు పరిగణనలోకి తీసుకుంది. 13 మంది నిందితులపై దర్యాప్తు సంస్థ సమర్పించిన ఛార్జ్‌షీట్‌ను ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి అజయ్ గుప్తా పరిశీలించారు. పేపర్ లీక్‌లపై విచారణకు ఏర్పాటు చేసిన ఫాస్ట్ ట్రాక్ కోర్టులో ఇటీవలే సీబీఐ తుది ఛార్జ్ షీట్‌ను వేసింది. 13 మంది నిందితులపై 20వేల పేజీలతో ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. పబ్లిక్ ఎగ్జామినేషన్ చట్టం, 2024 కింద నిందితులపై సీబీఐ ఛార్జిషీట్ దాఖలు చేసింది. అభియోగాలపై గురువారం నుంచి వాదనలు వింటామని న్యాయస్థానం తెలిపింది. 360 మంది సాక్షులు, 422 డాక్యుమెంట్లు, 43 భౌతిక సాక్ష్యాలను అభియోగపత్రంలో పొందుపర్చినట్లు సీబీఐ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా మీడియా ప్రచురిస్తున్న పేర్లలో కొందరు సాక్షులు మైనర్లు ఉండొచ్చని ఛార్జిషీటులోని కొన్ని భాగాలను పత్రికల్లో నిరంతరం ప్రచురిస్తున్నారని కోర్టుకు సీబీఐ తెలియజేసింది. అయితే, ఈ కేసులో సాక్షుల పేర్లను మీడియా ప్రచురించడంపై న్యాయస్థానం అసంతృప్తి వ్యక్తం చేసింది. కోర్టులో ఇంకా చెప్పనివి, ప్రస్తుతం ఛార్జిషీటులో భాగంగా ఉన్నవి మీడియాలో బహిర్గతం కావడం ఆశ్చర్యకరమని కోర్టు పేర్కొంది. బాధ్యతాయుతమైన మీడియా ఇలాంటి పనులు చేయకుండా ఉండాలని సూచించింది.



**పేపర్ లీక్‌ను అరికట్టడానికే ఫాస్ట్‌ట్రాక్ కోర్టు**

ఇదిలా ఉండగా, పేపర్ లీక్ వ్యవహారంపై ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. పరీక్ష పత్రాల లీకేజీని అరికట్టడానికి, అలాగే లీకేజీ బాధ్యులకు త్వరితగతిన శిక్ష పడేలా చూసేందుకు ఈ ఫాస్ట్?ట్రాక్? కోర్టులు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపింది. కేసుల విచారణలో జాప్యం జరగకుండా, రోజువారీ ప్రాతిపదికన విచారణ జరిపేలా చర్యలు తీసుకోనున్నారు. అలాగే, 2 నుంచి 3 నెలల లోపే కేసుకు సంబంధించిన తీర్పులు ఇచ్చేలా ప్రతి రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతంలో ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పరీక్షల్లో అవకతవకలను అరికట్టడానికి ప్రభుత్వం తీసుకొచ్చిన 'యాంటీ పేపర్ లీక్ బిల్లు'కు కూడా ఇటీవల లోక్‌సభ ఆమోదం లభించింది. ఈ చట్టాన్ని మరింత కఠినతరం చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల కొత్త సవరణలు తీసుకొచ్చింది. దీని ప్రకారం, ఈ కేసులో దోషులుగా నిర్ధరణ అయితే, గరిష్ఠంగా 10 ఏళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంది. అలాగే, రూ.10కోట్ల వరకు భారీ జరిమానా విధిస్తారు.

**ప్రత్యేక టాస్క్‌ఫోర్స్**

ఇక, పేపర్ లీక్‌లను అరికట్టడానికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల్లాగే, ప్రత్యేక టాస్క్? ఫోర్స్?ను ఏర్పాటు చేస్తున్నట్లు కూడా కేంద్ర ప్రభుత్వం ఇదివరకే తెలిపింది. పరీక్షా విధానంలో సంస్కరణలపై సిఫార్సులకు ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని నేతృత్వంలో హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు మోదీ ప్రకటించారు. ఇందుకోసం అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యువత భవిష్యత్తుకు హాని చేయాలని చూసేవారిని ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టబోమని, యువత సంక్షేమమే తమ ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యమని ఆయన పేర్కొన్నారు. అయితే, ప్రత్యేక టాస్క్?ఫోర్స్? కోసం ఏర్పాటు చేసిన కమిటీ, ప్రధానంగా పరీక్షల సంస్కరణలపై దృష్టి సారిస్తుంది. కమిటీ నివేదిక ఆధారంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. ఈ కమిటీలో నందన్ నీలేకనితో పాటు ఇస్రో మాజీ ఛైర్మన్ సోమనాథ్, ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ డైరెక్టర్ తపన్ డేకా, ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ వి. కామకోటి, కేంద్ర విద్యాశాఖ మాజీ కార్యదర్శి అనితా కర్వాల్, లాజిస్టిక్స్, పరిపాలనా నిపుణుడు అమృత్ లాల్ మీనా సభ్యులుగా ఉన్నారు.

## త్వరలోనే జంతర్ మంతర్ సీజన్- 2 ప్రారంభం

**సీజేపీ ఫౌండర్ అభిజీత్ దీప్కే**

విద్యార్థుల నిరసన తరహాలోనే మరో నిరసన కార్యక్రమాన్ని త్వరలో చేపట్టనున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రకటించారు. ఈ నిరసన కార్యక్రమాన్ని ఆయన 'జంతర్ మంతర్ సీజన్- 2'గా అభివర్ణించారు. ఢిల్లీలో తమ వాలంటీర్ల సమావేశం కోసం వేదికను వెతకడంలో సీజేపీ ఇబ్బందులు ఎదుర్కొందని తెలిపారు. చాలా మంది హాల్ యజమానులు పైస్థాయి నుంచి ఒత్తిడి ఉందని చెప్పి తమకు వేదికను ఇచ్చేందుకు నిరాకరించారని ఆరోపించారు. ఈ బెదిరింపుల వెనుక బీజేపీ హస్తం ఉందని విమర్శించారు. ఇటువంటి చర్యలు సీజేపీని ఏమాత్రం భయపెట్టలేవని స్పష్టం చేశారు. ఢిల్లీలో జరిగిన బహిరంగ సమావేశంలో ఈ మేరకు అభిజీత్ దీప్కే వ్యాఖ్యానించారు. "'జంతర్ మంతర్ సీజన్- 2' ఎప్పుడు మొదలవుతుందని చాలా మంది ఇన్‌స్టాగ్రామ్‌లో అడుగుతున్నారు. వారికి నేను చెప్పేది ఒక్కటే- 'జంతర్ మంతర్ సీజన్- 2' చాలా త్వరలోనే ప్రారంభం కాబోతోంది. ఈ రోజు ఢిల్లీలో మా వాలంటీర్ల సమావేశాన్ని నిర్వహించాలని అనుకున్నాం. దాని కోసం హాల్ వెతికినా ఎవరూ అద్దెకు ఇవ్వలేదు. చాలా మంది హాల్ యజమానులు పైస్థాయి నుంచి ఒత్తిడి ఉందని చెబుతున్నారు. చివరికి ఒక హాల్ దొరికింది. అయితే ఆ యజమానికి ఈ రోజు ఉదయం బెదిరింపులు వచ్చాయి. సీజేపీ సమావేశాన్ని ఇక్కడ జరగనిస్తే వారిని (హాల్ యజమానులను) తలకిందులుగా వేలాడదీస్తామని బెదిరించారు. ఈ బెదిరింపుల వెనుక బీజేపీ ఉంది. ఇదంతా బీజేపీయే చేస్తోంది. దేశంలోని యువతను చూసి కమలం పార్టీ భయపడుతోంది. ఆ పార్టీ నేతల మాటలు, చేతలు ఆ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఇలాంటి చర్యలతో మమ్మల్ని భయపెట్టవచ్చని వారు అనుకుంటే అది పొరపాటే. ఇటువంటి చర్యలకు మేం అస్సలు భయపడం. "

**బీజేపీపై ఫైర్**

కమలం పార్టీపై ఢిల్లీ వేదికగా సీజేపీ ఫౌండర్ అభిజీత్ దీప్కే మరోసారి ఘాటు విమర్శలు చేశారు. తాము పాఠశాలల బాగు గురించి మాట్లాడుతున్నందున గందరగోళం సృష్టించడానికి బయటి వ్యక్తులను ఇక్కడికి పంపారని ఆరోపించారు.

# 'ప్రహార్' వ్యూహం దశలవారీ అమలు

భారతదేశపు మొట్టమొదటి సమగ్ర జాతీయ ఉగ్రవాద నిరోధక విధానం 'ప్రహార్' వ్యూహాన్ని దశలవారీగా, ప్రగతిశీల పద్ధతిలో అమలు చేయడానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి కేంద్రం తెలిపింది. ఈ మేరకు భారత ప్రభుత్వం కట్టుబడి ఉందని హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంహెచ్ఏ) బుధవారం పార్లమెంటుకు చెప్పింది. ఉగ్రవాద కార్యకలాపాలు, తీవ్రవాదాన్ని నిరోధించడానికి, ఎదుర్కోవడానికి ఈ వ్యూహం ప్రభుత్వ, సమాజ సమగ్ర విధానాలతో ఒక జాతీయ ఉగ్రవాద నిరోధక ఫ్రేమ్?వర్క్?ను అందిస్తుందని వెల్లడించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 23న ఆవిష్కరించిన ఈ 'ప్రహార్' వ్యూహం ఏడు ముఖ్యమైన అంశాలపై ఆధారపడి ఉందని కేంద్ర హోంశాఖ తెలిపింది. రాజ్యసభలో కొందరు ఎంపీలు అడిగిన లిఖితపూర్వక ప్రశ్నకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి (వీశీ) నిత్యానంద్ రాయ్ సమాధానమిస్తూ ఈ వివరాలను వెల్లడించారు. భారత పౌరులు, ప్రయోజనాలను పరిరక్షించడానికి ఉగ్రవాద దాడులను నివారించడం, ఎదురయ్యే ముప్పునకు తగినట్లుగా, వేగంగా ప్రతిస్పందించడం, ప్రభుత్వ యంత్రాలను సమన్వయం చేయడానికి అంతర్గత సామర్థ్యాలను పెంపొందించడం, ముప్పులను తగ్గించేందుకు మానవ హక్కులు, 'చట్టబద్ధమైన పాలన' పాటించడం, తీవ్రవాద అనుకూల పరిస్థితులను తగ్గించడం, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి అంతర్జాతీయ సహకారం, మొత్తం సమాజ భాగస్వామ్యం ద్వారా ఉగ్రవాద ప్రభావాల నుంచి త్వరగా కోలుకునేలా చేయడం ఉంటాయని అందులో పేర్కొన్నారు.




"ప్రహార్ ముఖ్యంగా ఏడు మూలస్తంభాల వ్యూహంపై నిర్మించిన సమగ్రమైన, నిఘా ఆధారిత క్రియాశీలక ఫ్రేమ్?వర్క్? ద్వారా అన్ని ఉగ్రవాద నిరోధక లక్ష్యాలను పరిష్కరిస్తుంది. ఇది మల్టీ ఏజెన్సీ సెంటర్ (మీూజ) ద్వారా రియల్ టైమ్? నిఘా సమాచార భాగస్వామ్యాన్ని అధికారికం చేయడం, కీలక మౌలిక సదుపాయాలను భద్రపరచడం, రాష్ట్ర ఏజెన్సీలు/పోలీసులు, నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (చీూ+) వంటి ప్రత్యేక కేంద్ర దళాల మధ్య వేగవంతమైన, సమన్వయంతో కూడిన కమాండ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తుంది. ఫలితంగా భారతదేశాన్ని ప్రతిచర్యాత్మక భద్రతా వైఖరి నుంచి క్రియాశీలక సిద్ధాంతానికి మారుస్తుంది. 'ప్రహార్' అత్యాధునిక సాంకేతికతను అనుసంధానిస్తుంది. చట్టబద్ధ పాలన, మానవ హక్కులను కచ్చితంగా సమర్థిస్తుంది. ఉగ్రవాద వ్యవస్థ నిర్మూలనకు సమాజ సహకారంతో కూడిన తీవ్రవాద నిరోధక మాడ్యూళ్లను అమలు చేస్తుంది. ఇది క్రిప్టో వాలెట్‌లను గుర్తించడం, డార్క్ వెబ్ క్రౌడ్‌సోర్సింగ్‌ను అడ్డుకోవడం, కేంద్ర ఏజెన్సీల ద్వారా ఆస్తులను జప్తు చేసి ఉగ్రవాద నిధులను కూడా అడ్డుకుంటుంది. ఈ వ్యూహం ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ ప్రమాణాలకు అనుగుణంగా ఉంది. సరిహద్దుల గుండా జరిగే ప్రభుత్వ-ప్రాయోజిత ఉగ్రవాద నిధుల నెట్‌వర్క్‌లను అడ్డుకోవడానికి అంతర్జాతీయ ఒప్పందాలను ఉపయోగిస్తుంది. 'ప్రహార్' వ్యూహాన్ని దశలవారీగా ప్రగతిశీల పద్ధతిలో అమలు చేయడానికి భారత ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఈ విధానం తక్షణ సంస్థాగత, వ్యవస్థల ఏకీకరణకు ప్రాధాన్యం ఇస్తుంది. అదే సమయంలో బహుళ అంచెల పర్యవేక్షణ యంత్రాంగాల ఫ్రేమ్?వర్క్? ద్వారా పనితీరు ఫలితాలను క్షుణ్ణంగా అంచనా వేస్తుంది."

**ఎన్ఐఏ ఆధ్వర్యంలో వార్షిక 'ఉగ్రవాద వ్యతిరేక సదస్సు'**

సాధారణ పర్యవేక్షణకు అదనంగా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఎన్ఐఏ వార్షిక 'ఉగ్రవాద వ్యతిరేక సదస్సు నిర్వహించడం కూడా అటువంటి ఒక యంత్రాంగమేనని సహాయ మంత్రి నిత్యానంద రాయ్? తెలిపారు. ఇది చట్ట అమలు సంస్థలు, నిఘా సంస్థలు, భద్రతా దళాలు, విధాన రూపకర్తలు, న్యాయ నిపుణులు, ఉన్నతాధికారులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి దేశ ఉగ్రవాద నిరోధక వ్యూహాన్ని సమీక్ష, బలోపేతానికి ఇది ఒక ముఖ్యమైన వేదికగా పనిచేస్తుందని మంత్రి వివరించారు.

# పార్లమెంట్‌లో ప్రతి ప్రశ్నకు సమాధానం చెబుతా

పార్లమెంటులో విపక్షాల ఆందోళనల నేపథ్యంలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా స్పందించారు. జులై 20న సీజేపీ ఇచ్చిన సంసద్ చలో పిలుపు సందర్భంగా విద్యార్థులపై పోలీసుల దమనకాండను నిరసిస్తూ విపక్షాలు ఆందోళన చేస్తున్నాయి. ఈ అంశంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ లోక్‌సభ కార్యక్రమాలను అడ్డుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో స్పందించిన అమిత్‌షా ప్రతిపక్షాలు స్పీకర్ లేఖ రాస్తే చర్చకు సిద్ధమన్నారు. పార్లమెంటు నిబంధనల మేరకు చర్చ జరగాలని ప్రభుత్వం కోరుకుంటోందన్నారు. అందువల్ల సభలో చర్చ జరగాలా? లేక రచ్చ చేయాలా? అనేది ప్రతిపక్షాలే తేల్చుకోవాలని అమిత్ షా సూచించారు.

పార్లమెంట్ ఆవరణలో విలేకరులతో మాట్లాడిన అమిత్ షా, సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి తాను నిరంతరం పార్లమెంట్‌కు వస్తూ తన ఛాంబర్‌లోనే ఉంటున్నానని తెలిపారు. అయితే ప్రతిపక్షాలు ఉభయ సభలను సజావుగా సాగనివ్వకపోతే తాను సభలోకి వెళ్లి ఏం చేయగలనని ప్రశ్నించారు. నీట్ అంశంపై విద్యార్థుల నిరసనలకు సంబంధించిన ప్రతి విషయంపైనా చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఇప్పటికే స్పష్టం చేశారని గుర్తుచేశారు. చర్చకు ఒక సమయం నిర్ణయించాల్సి ఉందని, అందుకు ప్రతిపక్షాలు సిద్ధపడాలని అమిత్ షా అన్నారు.

"నేను వార్తా ఛానెళ్ల ద్వారా ప్రతిపక్షాలకు తెలియజేయాలనుకుంటున్నాను. మీరు (ప్రతిపక్షాలు) మధ్యాహ్నం 2గంటల లోపు స్పీకర్‌కు ఒక లేఖ రాసి ఇవ్వండి. మధ్యాహ్నం 3గంటల నుంచి చర్చను ప్రారంభిస్తాం. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు నేను అన్ని విషయాలకు సంబంధించి సమాధానం ఇస్తాను. పార్లమెంటులో చర్చించడానికి కొన్ని నిర్దిష్టమైన నియమాలు, పద్ధతులు ఉన్నాయి. పైపైన చర్చ జరపటం సాధ్యంకాదు. బహుశా అది మీ(ప్రతిపక్షాల) పద్ధతి కావొచ్చు. కానీ పార్లమెంటరీ పద్ధతి మాత్రం అది కాదు. స్పీకర్ అనుమతిస్తే ప్రశ్నోత్తరాల సమయాన్ని కూడా రద్దు చేయడానికి మేం సిద్ధంగా ఉన్నాం. గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు నేను చర్చకు సిద్ధంగా ఉన్నాను."




**దీనిపై సుదీర్ఘంగా చర్చ జరగాలి**

నీట్ పేపర్ లీక్ వంటి తీవ్రమైన అంశంపై కేవలం ఒక ప్రకటన చేయాలని కోరడం సరైన పార్లమెంటరీ విధానం కాదని అమిత్ షా అన్నారు. పార్లమెంట్‌లో ఇలాంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చ జరగాల్సి ఉంటుందని తెలిపారు.

ప్రతిపక్షాలు స్పీకర్‌కు లేఖ ఇస్తే బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచే చర్చ ప్రారంభించేందుకు సిద్ధమని చెప్పారు. అవసరమైతే బుధవారం రాత్రి పొద్దుపోయే వరకు చర్చ కొనసాగించవచ్చని, గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు కూడా చర్చను కొనసాగించేందుకు తాము సిద్ధంగా ఉన్నానని తెలిపారు. స్పీకర్ అనుమతిస్తే ప్రశ్నోత్తరాల సమయాన్ని కూడా వాయిదా వేసి చర్చ కొనసాగించడానికి అభ్యంతరం లేదన్నారు. చర్చ జరిగినంతసేపు తానే స్వయంగా సభలో కూర్చుంటానని అమిత్ షా స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు లేవనెత్తే ప్రతి అంశాన్ని నమోదు చేసుకుని, వాటన్నింటికీ సమాధానాలు ఇస్తానని తెలిపారు. తద్వారా నీట్ వివాదంపై దేశ ప్రజలకు పూర్తి స్పష్టత వస్తుందని అన్నారు.

"చర్చలో పాల్గొనాలా లేక సభలో గందరగోళం సృష్టించాలా అనేది ప్రతిపక్షాలే నిర్ణయించుకోవాలి" అని అమిత్ షా వ్యాఖ్యానించారు. తీవ్రమైన అంశాలపై పార్లమెంటరీ నిబంధనలకు అనుగుణంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం ప్రకటన చేయాలని డిమాండ్ చేయడం వల్ల సమస్యకు పరిష్కారం లభించదని పేర్కొన్నారు. నీట్ పరీక్షలో అవకతవకలు, ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలు, విద్యార్థుల ఆందోళనలు, నిరసనకారులపై పోలీసుల చర్యల అంశాలపై ప్రభుత్వం నుంచి సమాధానాలు కోరుతూ ప్రతిపక్షాలు పార్లమెంట్‌లో ఆందోళన చేస్తున్నాయి. ఈ వ్యవహారం కారణంగా పార్లమెంట్ కార్యకలాపాలకు పలుమార్లు అంతరాయం ఏర్పడింది.

## పార్లమెంటులో అమిత్ షా ఉపన్యాసాలు వినడానికి ప్రతిపక్షం సిద్ధంగా లేదు

కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. పార్లమెంట్?లో అమిత్ షా ఇచ్చే ఉపన్యాసాలు వినడానికి ప్రతిపక్షాలు సిద్ధంగా లేవని వ్యాఖ్యానించారు. జులై 20న జరిగిన నిరసనల్లో విద్యార్థులపై లాఠీఛార్జ్ చేయమని, కాల్పులు జరపమని ఆదేశాలు ఇచ్చింది ఎవరని ప్రశ్నించారు. ఒకవేళ ఆ ఆదేశాలు ఇచ్చింది అమిత్ షానే అయితే, వెంటనే ఆయన హోంమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గత 20 రోజులుగా హోం మంత్రి సభలో కనిపించడం లేదని, సభను ఎదుర్కొనేందుకు ఆయనకు ధైర్యం లేదని ఆరోపించారు. బుధవారం పార్లమెంట్ ప్రాంగణంలో రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడుతూ ఈ మేరకు వ్యాఖ్యానించారు. విద్యార్థులపై ఎవరు కాల్పులు జరిపారు మేకులు ఉన్న లాఠీలతో విద్యార్థులను కొట్టాలని ఎవరు ఆదేశించారు ఒక విద్యార్థి కంటి చూపు పోయేలా ఎవరు చేశారు విద్యార్థులపై కాల్పులు జరపమని అమిత్ షా ఆదేశించారా ఒకవేళ ఆయన అలా చేసి ఉంటే, అందుకు బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలి. అలా చేయకపోతే, ఆయన అసమర్థుడు కాబట్టి రాజీనామా చేయాలి."

ఇదిలా ఉండగా, విద్యార్థుల ఆందోళనలు సహా అన్నిఅంశాలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అమిత్ షా ఇదివరకే తెలిపారు. సభను సాగనివ్వాలని ప్రతిపక్షాలకు సూచించారు. ప్రతిపక్షాలు స్పీకర్ ఓంబిర్లాకు నోటీసు ఇస్తే చర్చకు సిద్ధమన్నారు. పార్లమెంటు నిబంధనల మేరకు చర్చ జరగాలని ప్రభుత్వం కోరుకుంటోందని తెలిపారు. సభలో చర్చ జరగాలా? లేక రచ్చ చేయాలా? అనేది ప్రతిపక్షాలే తేల్చుకోవాలని అమిత్ షా సూచించారు.

మరోవైపు, అయోధ్య రామమందిర విరాళాల విషయంపై పార్లమెంట్?లో సమాధానం చెప్పడానికి ప్రభుత్వం నిరాకరిస్తోందని కాంగ్రెస్? ఎంపీ ప్రియాంక గాంధీ ఆరోపించారు. దాని రాష్ట్ర అంశంగా ప్రభుత్వం చెబుతోందని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు రామాలయం అంశాన్ని వాడుకుని బీజేపీ రాజకీయంగా లాభం పొందిందని ధ్వజమెత్తారు. బుధవారం పార్లమెంటు ప్రాంగణంలో ఆమె ఈ మేరకు వ్యాఖ్యానించారు.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137